

నేటి దినపత్రిక
సూర్య


www.suryaa.com

సంపుటి 11 | సంచిక 140

ఆదివారం | 18 మార్చి 2018 | విజయవాడ

| పేజీలు 12+16 | వెల: రూ. 6.00

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi



అనుగ్రహం

శ్రీ విళంబి నామ సంవత్సరం, ఉత్తరాయనం, వసంత రుతువు, చైత్ర మాసం, శుక్ల పక్ష తిథి : పాడ్యమి సా.6.22, ఉత్తరాభాద్ర రా.8.16, వర్జ్యం ఉ.7.04 వరకు
రాహుకాలం: సా.4.30 నుంచి 6.00 వరకు; దుర్ముహూర్తం: సా.4.25 నుంచి 5.13 వరకు, సూర్యోదయం : ఉ.6.25 గం; సూర్యాస్తమయం: సా. 6.23 గం.



అయోమయంలో రైతులు

2022 లోగా రైతుల ఆదాయం రెట్టింపు

- సేంద్రీయ వ్యవసాయం చేస్తున్న పురాతన దేశాల్లో భారత్ ఒకటి
- వ్యవసాయం చేసేవారు సంపన్నదారులుగా మారే రోజులు రాక
- రైతులకు సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావాలి
- విశిష్ట సేవలు అందిస్తున్న రైతులకు అవార్డులు
- వ్యవసాయ రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న వారికి అవార్డులు
- కృషి ఉన్నతి మేళాలో ప్రధాని నరేంద్ర మోడీ

న్యూఢిల్లీ:వ్యవసాయ ఉత్పత్తులకు వ్యాల్యూ ఎడిషన్‌తో మరింత లాభాలను పొందవచ్చున్నారు ప్రధాని నరేంద్ర మోడీ. సేంద్రీయ వ్యవసాయం చేస్తున్న పురాతన దేశాల్లో భారత్ కూడా ఒకటన్నారు. శనివారం ఢిల్లీలోని నేషనల్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్ స్టిట్యూట్‌లో కృషి ఉన్నతి మేళాలో ఆయన పాల్గొన్నారు. సేంద్రీయ వ్యవసాయంపై పోర్టల్‌ను, దేశవ్యాప్తంగా 25 కృషి విజ్ఞాన కేంద్రాలను ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ను పరిశీలించారు. 2022లోగా రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్నారు మోడీ. 2022 నాటికి భారతదేశంలో వ్యవసాయం చేసేవారు సంపన్నదారులుగా మారే రోజులు వస్తాయని భారత ప్రధాని నరేంద్ర మోడీ

మిగతా 6లో

ఉగాది శుభాకాంక్షలు

మా పాఠకులకు,
ప్రకటనదారులకు,
ఏజెంట్లకు,
శ్రేయోభిలాషులకు
సూర్య విళంబి నామ
సంవత్సర శుభాకాంక్షలు
ఇట్లు
సూర్య యాజమాన్యం



నేటి సంచికతో పంచాంగం ఉచితం

సత్సంబంధాలకు పాక్ అడ్డుపుల్ల



- పొరుగుదేశాలు మారవని వాజ్‌పేయి అనే వారు
- పాక్ ఉగ్రవాదులను నియంత్రించేందుకు చర్యలు చేపట్టడం లేదు
- అంతర్జాతీయ ఉగ్రవాదిగా పేర్కొన్న వ్యక్తి రాజకీయ పార్టీ ప్రారంభించాడు
- హక్కానీ నెట్‌వర్క్‌కు ఆ దేశం సహాయం చేస్తోంది
- ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన స్తబ్ధత నెలకొంది
- రైజింగ్ ఇండియా సమ్మిట్‌లో కేంద్ర హోమ్ శాఖ మంత్రి రాజ్‌నాథ్

వివరాలు 6లో

బీజేపీ, వైసీపీ పొత్తు?

- ఆశ్చర్యానికి గురిచేసిన ప్రశాంత్‌కిషోర్
- రాజకీయ వర్గాల్లో ఆసక్తికరమైన చర్చ



న్యూఢిల్లీ, సూర్య ప్రత్యేక ప్రతినిధి : వైసీపీ, బీజేపీ మధ్య పొత్తుకు రంగం సిద్ధమైందన్న ప్రచారం ఢిల్లీలో ప్రారంభమైంది. వైసీపీ అధినేత జగన్‌కు రాజకీయ సలహాలిస్తున్న ప్రశాంత్ కిషోర్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాను ఢిల్లీలో కలిశారు. ఏపీ బీజేపీ నేతలతో సమావేశం జరుగుతున్న సమయంలోనే పీకేకు అమిత్‌షా సమయమివ్వడం రాజకీయవర్గాల్లో ఆసక్తి రేపుతోంది. వైసీపీతో ఎన్నికలకు ముందే పొత్తుపెటుకుంటే ఎలా కలిసోస్తుందో అనే అంశంపై ప్రశాంత్ కిషోర్ వివరించినట్లు బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. కొంతకాలంగా మిత్రపక్షమైన టీడీపీ కంటే వైసీపీకే బీజేపీ అధిక ప్రాధాన్యమిస్తోంది. ప్రధాని నరేంద్ర మోడీతో జగన్ సమావేశం తర్వాత విజయసాయిరెడ్డి పదుల సార్లు ప్రధానితో సమావేశమయ్యారు. విజయసాయి ఢిల్లీలో ఉంటే ఎక్కవ సార్లు పీఎంవో చుట్టూ తిరుగుతుంటారని టీడీపీ వర్గాలు చెబుతుంటాయి. టీడీపీని వదిలించుకుని వైసీపీతో పొత్తు కోసం బీజేపీ ప్రయత్నిస్తోందని చాలాకాలంగా ఆరోపణలొస్తున్నాయి. జగన్ కేసులను అడ్డం పెట్టుకుని బీజేపీ ఎదగాలని

మిగతా 6లో



దేశం చూపు ఏపీ వైపు

- కేసుల మాఫీకే విజయసాయి పీఎంవోలో తిరుగుతున్నారు
- టీడీపీ అవిశ్వాసానికి అనేక పార్టీల మద్దతు
- రెండు రోజులు ఢిల్లీలోనే ఆరుగురు ఎంపీల బృందం
- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

(అమరావతి నుంచి 'సూర్య' ప్రత్యేక ప్రతినిధి) : తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన అవిశ్వాసానికి అనేక పార్టీలు మద్దతు పలికాయని, గంటలోనే సానుకూల స్పందన రావటం జాతీయస్థాయిలో తెలుగుదేశం విశ్వసనీయతకు నిదర్శనమని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. తెలుగుదేశం పార్టీ ఎంపీలతో చంద్రబాబు శనివారం ఉదయం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు, అసెంబ్లీ వ్యూహ కమిటీ ప్రతినిధులు ఇందులో పాల్గొన్నారు. పీఎంవో చుట్టూ ఏ2 చక్కర్లు కొట్టడంతో అవిశ్వాసం అన్న వైసీపీని ఎవ్వరూ

మిగతా 6లో

దేశమంతా అసంతృప్తి

దేశాన్ని ముందుకు నడిపించేది చేతిగుర్తే

- దేశాన్ని ఏకం చేయాల్సిన బాధ్యత మనందరిదీ
- కాంగ్రెస్‌ను ముందుకు నడిపించడంలో యువతకు ప్రాధాన్యం
- వారు కోపాన్ని ఉపయోగిస్తున్నారు మేం ప్రేమతో పనిచేస్తున్నాం
- యువతను నిరుద్యోగం వెంటాడుతోంది
- రైతులకు గిట్టుబాటు ధరలు లభించడంలేదు
- ప్లీనరీలో అధ్యక్ష హోదాలో రాహుల్ ప్రసంగం



న్యూఢిల్లీ: ప్రస్తుతం దేశమంతా అసంతృప్తి, ఆగ్రహంతో ఉందని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ అన్నారు. కాంగ్రెస్ పార్టీ 84వ ప్లీనరీ సమావేశం రెండో రోజు ప్రారంభమైంది. ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న ఈ ప్లీనరీలో పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ శనివారం ప్రసంగించారు. అంతకు ముందు ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. ప్రస్తుతం దేశమంతా అసంతృప్తి, ఆగ్రహంతో ఉంది. ఈ పరిస్థితుల్లో దేశం మొత్తాన్ని ఏకం చేయాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది. ఈ ప్లీనరీ దేశానికి, కాంగ్రెస్ పార్టీకి మార్గదర్శకంగా ఉండాలి. కాంగ్రెస్‌ను ముందుకు నడిపించడంలో యువతకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంది. పార్టీలోని అనుభవజ్ఞులు యువతకు మార్గనిర్దేశం చేయాలి. ఈ దేశం ప్రజలందరిది. అన్ని మతాలు, వర్గాల వారిది. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, ప్రయోజనాల కోసమే కాంగ్రెస్ పనిచేస్తోంది. వారు (బీజేపీ) కోపాన్ని ఉపయోగిస్తున్నారు. మేం ప్రేమతో పనిచేస్తున్నాం. దేశాన్ని ఐక్యంగా ఉంచి ముందుకు నడిపించేది చేతిగుర్తే అని రాహుల్ అన్నారు. దేశంలో అనేక సమస్యలున్నాయని చెప్పుకొచ్చారు. యువతను నిరుద్యోగం వెంటాడుతోందని,

మిగతా 6లో

ఇవిఎమ్‌లు వద్దు బ్యాలట్‌లే ముద్దు

- ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లపై అనుమానం
- ఈవీఎంల దుర్వినియోగం జరుగుతోందని ఆరోపణ
- ఎన్నికల విధానంపై విశ్వాసాన్ని పెంపొందించాలి
- ప్లీనరీ సమావేశంలో ప్రస్తావించిన కాంగ్రెస్



సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

పగటిపూట 9గంటల ఉచిత విద్యుత్

- రైతులకు ఎకరానికి మే నెలలో రూ.12,500
- పాలు లీటర్‌కు రూ.4 బోనస్ అందజేస్తాం
- ప్రకృతి వైపరీత్యాల కోసం రూ.4వేల కోట్లు
- నాలుగేళ్లలో చంద్రబాబు ఏం సాధించారు
- కేసీఆర్‌కు ఉన్నదేంటి-బాబుకు లేనిదేంటి
- పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి నీళ్ల సమస్య తీరుస్తాం
- రైతులతో ఆత్మీయ సమ్మేళనంలో వైఎస్ జగన్



(గుంటూరు నుంచి 'సూర్య' ప్రత్యేక ప్రతినిధి) : రైతాంగానికి పగటిపూట 9గంటల ఉచిత విద్యుత్ అందిస్తామని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వై.ఎస్ జగన్మోహన్‌రెడ్డి రైతులకు హామీ ఇచ్చారు. ఓవైపు లిఫ్టులు పెట్టి తెలంగాణ సీఎం కేసీఆర్ నీళ్లు తోడేస్తుంటే, ఏపీ సీఎం చంద్రబాబు ఈ నాలుగేళ్లలో ఏం సాధించారు. అసలు కేసీఆర్‌కు ఉన్నదేంటి–చంద్రబాబుకు లేనిదేంటని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రశ్నించారు. ఓటుకు

మిగతా 6లో

బ్రిటిష్ దౌత్యవేత్తల తరిమివేత

- ప్రకటించిన రష్యా విదేశాంగ మంత్రి సెర్జీ లావ్రోవ్
- బ్రిటీష్ మాజీ గూఢచారి స్క్రిపాల్‌పై రష్యా దౌత్యవేత్తల హత్యాయత్నం
- అందుకు ప్రతీకారంగా ఈ చర్యలు
- స్క్రిపాల్‌ను ఇబ్బంది పెట్టే ఉద్దేశం తమ దేశానికి లేదు
- వెల్లడించిన బ్రిటన్ ప్రధాన మంత్రి థెరిసా మే

6లో

అంతా ఇంతే!



విశ్వాసం, అవిశ్వాసం ఓట్లు ఎన్నొస్తాయో చెప్పమంటున్నారు...

పురుషులను నిలదీయరా? : ఎంపీ కవిత



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః అన్ని రంగాల్లో మహిళల ప్రాధాన్యత పెరగాలని, మహిళా సాధికారతకు ప్రభుత్వాలు సహకరించాలని నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత కోరారు. మహిళలకు నాయకత్వ లక్షణాలు ఉండాలన్నారు. వారసత్వం నుంచి వచ్చే మహిళలను ప్రశ్నిస్తున్నారు. నగరంలోని ఓ హోటల్‌లో శనివారంనాడు నల్సార్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో మహిళా లీడర్షిప్ సమ్మిట్ –2108 జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా టీఆర్ఎస్ ఎంపీ కల్వకుంట్ల కవిత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ కవిత మాట్లాడుతూ.. పురుషులను నిలదీయరా? అని ఆమె ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వం మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తుందన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా పారిశ్రామికవేత్తల కోసం వీ హ బ్‌ను ప్రారంభించామని తెలిపారు. వీ హబ్‌కు బడ్జెట్లో రూ. 15 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి మంచినీరు అందించి మహిళలకు కష్టాలు లేకుండా చేస్తున్నామని పేర్కొన్నారు.

దీని వల్ల సమయం ఆదా అవుతుంది. మహిళలు చదువుకునేందుకు వెసులుబాటు కలుగుతుందన్నారు. మహిళల భద్రత కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా షీటీమ్స్ అద్భుతంగా పని చేస్తున్నాయని ప్రశంసించారు.

ఏపీలో ఇక దూకుడే

- జాతీయ అధ్యక్షుడు అమిత్ షాతో ఏపీ బీజేపీ నేతల భేటీ
- ప్రతిపక్షంగా ప్రశ్నలకు సమాధానాలివ్వాల్సిందే
- ఆంధ్ర ప్రదేశ్‌లో పార్టీ పరిస్థితిపై బీజేపీ మథనం
- పార్టీ బలోపేతం, రాష్ట్ర స్థాయి కమిటీలపై చర్చ
- చెప్పిన మాటకు కట్టుబడి ఉన్నామన్న కంభంపాటి

(న్యూఢిల్లీ నుంచి 'సూర్య' ప్రత్యేక ప్రతినిధి) : జాతీయ అధ్యక్షుడు అమిత్ షాతో ఢిల్లీలోని ఆయన నివాసంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆ పార్టీ నేతలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయాలపై బీజేపీ నేతలతో అమిత్ షా చర్చలు జరిపారు. తెలుగుదేశం పార్టీ వైఖరిని ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలనే అంశంపై ప్రధానంగా చర్చించారు. ఏపీలో బీజేపీ బలోపేతం, రాష్ట్రస్థాయి కమిటీల ఏర్పాటుపై కూడా సమాలోచనలు చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు, పార్టీ నేతలు పి. మాణిక్యాలరావు, కామినేని శ్రీనివాస్, పురంధేశ్వరి, విష్ణుకుమార్ రాజు, కన్నా లక్ష్మీనారాయణ, కావూరి సాంబశివరావు, రామ్‌మాధవ్‌తో పాటు ఆ పార్టీ వ్యూహకర్తగా ఉన్న ప్రశాంత్ కిషోర్ తదితరులు ఈ భేటీలో పాల్గొన్నారు. ఎన్డీయే కూటమి నుంచి తెలుగుదేశం పార్టీ బయటికి వచ్చిన తర్వాత ఏపీ బీజేపీ నేతలకు అమిత్ షాతో జరిగిన తొలి సమావేశం ఇదే కావడంతో ప్రాధాన్యమేర్పడింది. ఏపీలో వైసీపీకి రాజకీయ వ్యూహకర్తగా ఉన్న ప్రశాంత్ కిషోర్ బీజేపీ నేతల సమావేశానికి హాజరుకావడం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాతో ఏపీ బీజేపీ నేతలు సమావేశమయ్యారు. ఈ సమావేశానికి రాంమాధవ్, హరిబాబు, పురంధేశ్వరి, ఇతర ముఖ్య నేతలు హాజరయ్యారు. ఈ సమావేశంలో ఎన్డీయే నుంచి టీడీపీ నిష్క్రమించడం, అవిశ్వాస తీర్మానం, ఏపీకి ప్రత్యేక హోదా, రాష్ట్రంలో తాజాగా నెలకొన్న పరిస్థితులు, ఇతర అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో ఏ విధంగా ముందుకు వెళ్లాలనే దానిపై రాష్ట్ర నేతలతో జాతీయ నేతలు సమాలోచనలు చేస్తున్నారు. మరోవైపు టీడీపీ నేతలతో చర్చించేందుకు సిద్ధంగా ఉన్నట్లు బీజేపీ నేతలు చెబుతున్నారు. ఏపీకి ఇచ్చిన హామీలన్ని కేంద్రం నెరవేస్తుందని రాష్ట్రానికి చెందిన పలువురు బీజేపీ నేతలు తెలిపారు.

చెప్పిన మాటకు కట్టుబడే ఉన్నాం : కంభంపాటి

భారతీయ జనతాపార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాతో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆ పార్టీ నేతల భేటీ ముగిసిన అనంతరం ఏపీ బీజేపీ అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు మీడియాతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఎన్డీయే నుంచి బయటకు రావడం, నరేంద్ర మోడీ నాయకత్వంలో ఉన్న ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టడం ద్వారా రాష్ట్రంలో ఉత్పన్నమైన పరిస్థితిని సమీక్షించేందుకు అమిత్‌షా మమ్మల్ని ఆహ్వానించారు. ఆయనతో వివిధ అంశాలపై చర్చించాం. ఏపీలో ప్రత్యేక హోదా విషయంలో భావోద్వేగాన్ని ప్రేరేపిస్తున్నారు. ప్రత్యేక హోదాతో ఎన్ని నిధులు వస్తాయో అంతకు పైసా కూడా తగ్గకుండా ఇవ్వాలనే దానికి మేం ఇప్పటికీ కట్టుబడే ఉన్నాం. ఇదే అంశాన్ని ప్రజలకు వివరించాలని సమావేశంలో నిర్ణయించాం. విభజన చట్టంలో పేర్కొన్న వివిధ అంశాలు, ఏర్పాటుచేస్తామని చెప్పిన పలు సంస్థలకు సంబంధించి ఈ మూడున్నరేళ్లలో 90శాతం పూర్తిచేశాం. త్వరలోనే బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిపి రాజకీయంగా ప్రజల్లోకి వెళ్లేందుకు కార్యాచరణ రూపొందిస్తాం. రాజకీయ తీర్మానం చేస్తాం. వాటన్నింటిపై చర్చించాం. ఆంధ్రప్రదేశ్‌కు ఏ విధంగా న్యాయం చేయాలో కేంద్రం నిరంతరం ఆలోచిస్తోంది. ప్రత్యేక హోదా విషయంలో ఏపీలో ఉన్న టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్, వామపక్షాలన్నీ బీజేపీపై దుష్ప్రచారం చేస్తున్నాయి. వాటిని తిప్పికొట్టి ప్రజలందరికీ సవివరంగా వివరించాలని నిర్ణయించామని హరిబాబు తెలిపారు.

టీడీపీ సమాధానం చెప్పాల్సిందే : రాం మాధవ్

ఏపీ ప్రజల అభివృద్ధికి చంద్రబాబు, ఇతర పార్టీలు ఎంత కట్టుబడి ఉన్నాయో, మేం అంతకన్నా ఎక్కువగా కట్టుబడి ఉన్నాం. గత నాలుగేళ్లుగా ఆ శ్రద్ధ, కట్టుబాటు కారణంగా అనేక విధాలుగా ప్రజలకు సహాయసహకారాలు అందించేందుకు చిత్తశుద్ధితో పనిచేశాం. రాబోయే రోజుల్లోనూ ఈ కృషి



కొనసాగుతుంది. ప్రజల మనోభావాల ఆధారంగా ప్రశ్నలు లేవనెత్తే కార్యక్రమం జరుగుతోంది. దానికి సమాధానంగా అభివృద్ధి ఆధారంగా బదులిచ్చేందుకు మా పార్టీ సమాయత్తమవుతోంది. తెలుగుదేశం పార్టీ ఎన్డీయే నుంచి వైదొలగడం, అవిశ్వాసం ద్వారా తనంతట తానే మాకు వ్యతిరేకంగా నిలబడింది. ఇప్పటి వరకూ సీఎం చంద్రబాబు, టీడీపీ నేతలు బీజేపీని ప్రశ్నించారు. రాబోయే కాలంలో మేం లేవనెత్తే ప్రశ్నలకు వారు సమాధానం చెప్పాల్సిందేనని రాం మాధవ్ అన్నారు.

మేం ఎవరికీ స్క్రిప్టులు ఇవ్వలేదు : సోము వీర్రాజు


ఇప్పటివరకు తెలుగుదేశం పార్టీ మిత్రపక్షంగా మా కార్యవర్గ సమావేశాలు జరిగాయి. ఇకపై ప్రతిపక్షంగా కొనసాగుతాయి. మేం ప్రజల కోసమే ఉన్నాం. బీజేపీ ప్రజాపక్షం. రాబోయే రోజుల్లోనూ మేం ప్రజలపక్షమే. వాస్తవాల ఆధారంగా సీఎంకు కొన్ని ప్రశ్నలు వేశాం. వాటికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఆయనపై ఉంది. నిజాల ఆధారంగా ప్రశ్నలు వేస్తే ఇది వైసీపీ స్క్రిప్ట్ అంటారు. లేకపోతే ఇంకోటి అంటారు. రాష్ట్రంలో అభివృద్ధి గురించి మేం మాట్లాడితే స్క్రిప్టులు అంటూ పొలిటికల్ డెలాగ్‌లతో తెలుగుదేశం పార్టీ ముందుకు వెళుతోంది. ప్రత్యేక హోదా సంజీవని కాదని సీఎం అన్నారు. ప్రత్యేక హోదా గురించి ఎవరైనా మాట్లాడితే జైలుకెళ్తారు? అని హెచ్చరించారు. మేం ఎవరికీ స్క్రిప్టులు ఇవ్వడంలేదు. మేం ఎవరి స్క్రిప్టులను చదవడంలేదు. విభజనకు ముందు, తర్వాతా ఏకోన్ముఖంగా ఒకే వాయిస్‌తో పోరాడిన పార్టీ మాది. రాజ్యసభలో హోదా కావాలని మేం అడిగాం. ముంపు మండలాలను కలిపే ఆర్డినెన్స్ మేమే ఇచ్చాం. ఏ పార్టీ అడగలేదు. ప్రజలను రక్షించే పార్టీ మాది అని సోము వీర్రాజు వివరించారు.

వ్యవసాయానికి పెద్ద పీట వేసిన ఘనత కేసీఆర్‌కే దక్కింది



హైదరాబాద్, మేజర్‌న్యూస్ః తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి అత్యధికంగా నిధులు కేటాయించామని మంత్రి పట్నం మహేందర్ రెడ్డి చెప్పారు. శనివారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయం పండుగలా సాగాలని సీఎం కేసీఆర్..ఎకరాకు రూ. 4వేల చొప్పున పంట పెట్టుబడి ఇవ్వబోతున్నారని చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి రూ. 12వేల కోట్లు కేటాయించారని చెప్పారు. తెలంగాణలో కోతలు లేని విద్యుత్‌ను అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని, రైతులకు 24గంటల ఉచిత విద్యుత్ అందించి దేశానికే ఆదర్శంగా నిలిచామని మంత్రి మహేందర్ రెడ్డి వెల్లడించారు.

తెలుగు ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు



హైదరాబాద్, మేజర్‌న్యూస్ః తెలుగు రాష్ట్రాల ప్రజలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ విళంబి నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. షడ్రుచుల సమ్మిళతమైన కమ్మనైన ఉగాది పచ్చడిలా తెలుగు ప్రజల జీవితాలు సుఖ సంతోషాలతో అష్ట ఐశ్వర్యాలతో ఆనందమయంగా సాగాలని మన స్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు శనివారం విడుదల చేసిన లేఖలో తెలిపారు. ఈ ఏడాదిలో సకాలంలో వర్షాలు కురిసి, సస్యశ్యామలం కావాలని, గ్రామీణ ప్రజలు, రైతాంగం పాడి పంటలతో, సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రధాని మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి, రైతు సంక్షేమానికి, రైతుల ఆదాయం రెట్టింపు కోసం, గ్రామీణాభివృద్ధికి తీసుకుంటున్న ప్రజాహిత కార్యక్రమాలు తెలుగు ప్రజల జీవితాలలో సుఖశాంతులు నింపుతాయని ఆశిస్తున్నట్లు లక్ష్మణ్ పేర్కొన్నారు.

ప్రజలంతా సుఖశాంతులతో వర్ధిల్లాలి



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః తెలంగాణా ప్రజలంతా సుఖశాంతులతో వర్ధిల్లాలని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కోరారు. రాజ్‌భవన్‌లో జరిగిన శ్రీవిళంబినామ సంవత్సర ఉగాది వేడుకల్లో సీఎం పాల్గొన్నారు. ప్రజలందరికీ విళంబినామ సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కొత్త

- కొత్త సంప్రదాయానికి గవర్నర్ శ్రీకారం
- రాజ్‌భవన్‌లో ఘనంగా ఉగాది ఉత్సవాలు
- హాజరైన పార్టీల నేతలు, అధికారులు : సీఎం

సంప్రదాయానికి శ్రీకారం చుట్టిన గవర్నర్‌కు కేసీఆర్ ధన్యవాదాలు తెలిపారు. శనివారం రాత్రి రాజ్‌భవన్‌లో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. ఏదో ఒక సంవత్సరమే అనికాకుండా ప్రతి ఏడాదీ నిష్టతో చాలా చక్కగా నిర్వహిస్తున్న గవర్నర్‌కు ఈ సందర్భంగా సీఎం మనస్ఫూర్తిగా మరోసారి అభినందనలు తెలియజేశారు. ఇది వరకు ఎప్పుడూ ఇలా రాజభవన్‌లో పండుగ లేదని.. నర్సింహన్ వచ్చాక కొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టారని కేసీఆర్ చెప్పారు. ప్రభుత్వం ఓ వైపు అధికారికంగా జరుపుతున్నప్పటికీ.. రాజ్‌భవన్‌లో ఇటువంటి సత్‌సంప్రదాయానికి శ్రీకారం చుట్టి మన పండుగను మన గౌరవాన్ని ఇనుమడింపు చేస్తున్న గవర్నర్‌కు.. కేసీఆర్ ధన్యవాదాలు తెలిపారు. యావన్మంది తెలుగు ప్రజలు, అన్య సంస్కృతుల, అన్య భాషల ప్రజలు కూడా సుఖంగా, సంతోషంగా విలసిల్లాలని సీఎం కేసీఆర్ ఆకాంక్షించారు. కాలం జరుగుతూనే ఉంటుంది. కొంత మంచి వస్తుంటుంది.. ఇంకొంత చెడు వస్తుంటుంది. అన్నింటినీ సహిస్తూ, అన్నింటినీ భరిస్తూ.. ఆనందాన్ని ఆస్వాదిస్తూ.. దు:ఖాన్ని దిగమింగుతూ ముందుకు సాగేదే జీవితం. మనదేశంలో అనేక భాషలు, సంస్కృతులు ఉన్నప్పటికీ అందరూ ఈ పండుగను చాలా ఘనంగా జరుపుకుంటారు.

ముఖ్యంగా మన తెలుగువారు ఈ పండుగను చాలా గొప్పగా జరుపుకోవటం.. పచ్చటి స్వీకరించడం అందులోనే మంచి, చెడు అనే రెండు అర్థాలున్నాయని ఈ రోజు ఆస్వాదించడం జరుగుతుంది. అందులోని పులుపు, వగరు, తీపిలాగా జీవితం కూడా ఇదేలా ఉంటుందనే సందేశాన్ని అందులో నుంచే అంతర్లీనంగా తీసుకోవడం.. ఇలా పరంపరగా మన తెలుగు సంవత్సర వేడుకలు జరుపుకుంటున్నాం అని కేసీఆర్ అన్నారు. ఈ ఉత్సవాల్లో రాష్ట్ర హోంమంత్రి నాయిని నర్సింహరెడ్డి, ఆర్థిక మంత్రి ఈటెల రాజేందర్ అసెంబ్లీ స్పీకర్ మధుసూధనాచారి, మండలి ఛైర్మన్ స్వామిగౌడ్, జీహెచ్‌ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్, ఎంపీలు, ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు అధికారులు .ఈ సందర్భంగా నిర్వహించిన ఒగ్గుడోలు విన్యాసాలు అతిథులను అలరించాయి. దేవనార్ బ్లైండ్ స్కూల్ విద్యార్థుల సీతా స్వయంవరం ఆకట్టుకున్నది.

తెలంగాణ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి



హైదరాబాద్, మేజర్‌న్యూస్ : తెలుగు నూతన సంవత్సరంలో తెలంగాణ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, రైతులకు పాడి పంటలు సమృద్ధిగా పండాలని టిపిసిసి అధ్యక్షులు ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆకాంక్షించారు. తెలంగాణ ప్రజలకు విళంబి నామ ఉగాది పండుగ శుభాకాంక్షలను ఆయన తెలిపారు. తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలు ఆనందోత్సవాలతో ఉగాది పర్వదినోత్సవాన్ని జరుపుకోవాలని కోరారు. ఈ ఏడాదంతా ప్రజలు ఎలాంటి సమస్యలు, కష్టాలు లేకుండా ప్రశాంతమైన జీవితం గడపాలని ఉత్తమ్ ఆకాంక్షించారు.

దేశ రాజకీయాల్లో కీలక పరిణామాలు



విజయవాడ, సూర్య ప్రతినిధి : సోమవారం దేశ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకోబోతున్నాయని తెలుగుదేశం పార్టీకి చెందిన విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని నాని పేర్కొన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ టీడీపీ అవిశ్వాసానికి జాతీయ స్థాయిలో పార్టీల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తోందని, ఇది ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఊహించని షాక్ అన్నారు. ఏపీ సమస్యల పట్ల జాతీయస్థాయిలో పార్టీలు సానుభూతితో ఉన్నాయని, కొన్ని రాజకీయ పార్టీలు స్వచ్ఛందంగా మద్దతు తెలిపాయని, పలువురు నేతలు నేరుగా నాతో మాట్లాడారని ఎంపీ తెలిపారు. బీజేపీలోనే కొంత మంది ఎంపీలు మోదీకి వ్యతిరేకంగా ఉన్నారని, మీ సమస్యలకు మద్దతిస్తామని ఆఫ్ ది రికార్డ్‌గా చెబుతున్నారని ఆయన అన్నారు. సమాజ్‌వాదీ, తృణమూల్, అకాలీదళ్, శివసేన ఎంపీలు కూడా స్వచ్ఛందంగా ముందుకొచ్చి మద్దతు తెలిపారని కేశినేని నాని తెలిపారు. మేం అన్ని పరిణామాలకు సిద్ధపడే రంగంలోకి దిగామని, హౌస్ ఆర్డర్‌లో లేదని అవిశ్వాసాన్ని తిరస్కరిస్తే జాతీయ స్థాయిలో అన్ని పార్టీలతో కలిసి ఢిల్లీలో పోరాటం చేస్తామన్నారు. చంద్రబాబు నిర్ణయాన్ని జాతీయ స్థాయిలో అందరూ అభినందిస్తున్నారని, చంద్రబాబు, తెలుగు ప్రజలతో పెట్టుకున్నవారెవరూ బాగుపడినట్టు చరిత్రలోలేదని ఆయన అన్నారు.

లోక్‌సభలో అవిశ్వాస తీర్మానం పెడతాం



కాకినాడ, సూర్య ప్రతినిధి : సోమవారం లోక్‌సభలో అవిశ్వాస తీర్మానం పెడతామని టీడీపీ పార్లమెంటు సభ్యుడు తోట నరసింహం అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్పీకర్‌కు మరోసారి నోటీస్ ఇచ్చామని, అవిశ్వాసానికి దేశ వ్యాప్తంగా పలు పార్టీల నుంచి అనూహ్య మద్దతు వచ్చిందన్నారు. సోమవారం మా అవిశ్వాస తీర్మానం చర్చకు వచ్చేలా మరిన్ని పార్టీల మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నిస్తామన్నారు. అవిశ్వాస తీర్మానాలు చర్చకు రాకుండా కేంద్రం కొన్ని పార్టీల ద్వారా సభ ఆర్డర్‌లో లేకుండా చేస్తోందని ఆయన ఆరోపించారు. ఏపీకి బీజేపీ చేసిన ద్రోహం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైందని, పవన్ కల్యాణ్ సడన్‌గా ఎందుకు యూటర్న్ తీసుకున్నారో తెలియదన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంపై పవన్ ఆరోపణలు అవాస్తవమని తోట నర్సింహం అన్నారు.

2019లో తెలంగాణాలో అధికారం కమలానిదే : అరుణ్‌సింగ్

హైదరాబాద్, మేజర్‌న్యూస్ః రాబోయే ఎన్నికల్లో తెలంగాణాలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ ఆశాభావం వ్యక్తం చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సంస్థాగతంగా ఎలాంటి బలం లేని త్రిపుర లాంటి రాష్ట్రాల్లో బిజెపి అధికారంలోకి వచ్చిందని, 2014 తర్వాత దేశంలో 14 రాష్ట్రాల్లో క్రమంగా పార్టీ అధికారం చేపట్టిందని, అలాగే తెలంగాణలో కూడా అధికారాన్ని చేపట్టడం ఖాయమని ఆయన స్పష్టం చేశారు. వచ్చే కర్ణాటక ఎన్నికల్లో బిజెపి ఘన విజయం సాధిస్తుందని, అధికారాన్ని ఏర్పాటు చేస్తుందని, దీంతో దక్షిణాది రాష్ట్రాల్లో పెను మార్పులు సంభవిస్తాయని అవి బిజేపీకు అనుకూలంగా ఉంటాయని చెప్పారు. టిడిపి.. ఎన్డీయే నుంచి వెళ్లిపోయినంత మాత్రాన ఒరిగేది ఏమీ లేదని, దాని ప్రభావం తమ పార్టీపై ఏమీ ఉండదని, ఇది బిజెపికి అనుకూలంగా మారుతుందని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారని, దీంతో దేశం అభివృద్ధిలో ముందుకు సాగుతుంని అరుణ్‌సింగ్ తెలిపారు.

కాళేశ్వరం గ్రేట్

- కాళేశ్వరం తొలి గేటు బిగింపు
- వానకాలానికి ఎల్లంపల్లికి నీరు
- అన్నారం బ్యారేజీ గేట్ల బిగింపు పనులు షురూ
- 80 శాతం పూర్తయిన కాంక్రీటు పనులు
- అన్నారం-కన్నేపల్లి కెనాల్ పనులు 70 శాతం పూర్తి
- డిప్యూటేషన్‌పై అదనపు ఇంజనీర్
- పది రోజుల్లో పంప్ హౌస్‌ల యంత్రాల దిగుమతి
- ఊపందుకున్న విద్యుత్ పనులు
- వానాకాలం నాటికి ఎల్లంపల్లికి నీరు
- మంత్రి హరీశ్ రావు

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః వచ్చే వానాకాలం నాటికి కాళేశ్వరం నుంచి ఎల్లంపల్లి కి నీటిని తరలిస్తామని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్ రావు ప్రకటించారు. ప్రతిష్టాత్మక కాళేశ్వరం ప్రాజెక్టు పనులు మూడు షిఫ్టులలోనూ యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి. అన్నారం, సుండిళ్ళ ,మేడిగడ్డ బ్యారేజీలలో 5 కోట్ల 81 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి పనులకు గాను 4.50 కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టిపనులు జరిగాయి. ముఖ్యమంత్రి కెసిఆర్ ఆదేశాల మేరకు నిర్ణీత గడువులోగా మూడు బ్యారేజీలు,మూడు పంప్ హౌజ్ ల నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నట్టు ఇరిగేషన్ మంత్రి హరీశ్ రావు తెలియజేశారు. శనివారం మంత్రి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. బ్యారేజీలు, పంప్‌హౌజ్ ల పనులను ఆయన తనిఖీ చేశారు. అన్నారం బ్యారేజీ గేట్ల బిగింపు ప్రక్రియ శనివారం ప్రారంభమైంది. మంత్రి ఈ పనులను పరిశీలించారు. అన్నారం బ్యారేజీకి 66 , మేదిగడ్డ కు 86, సుందిళ్ళ బ్యారేజీకి 74 గెట్లను అమర్చవలసి ఉంది. అన్నారం బ్యారేజికి శనివారం తొలి గేటు బిగించారు. కాళేశ్వరం కు సంబంధించిన బ్యారేజీలు, పంప్ హౌజ్ పనుల్లో 80 శాతం సిమెంటు కాంక్రీటు పనులు పూర్తయినట్టు మంత్రి ప్రకటించారు. మిగతా 20 శాతం పనులు మరో రెండు నెలల్లో పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. అన్నారం–కన్నేపల్లి మధ్య గ్రావిటీ కెనాల్ పనులు 70 శాతం పూర్తయినట్టు హరీశ్ రావు మీడియా ప్రతినిధులకు చెప్పారు. కాళేశ్వరం పనుల పురోగతిపై మంత్రి హరీశ్ రావు కన్నెపల్లి దగ్గర ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ అమేయ కుమార్, కాళేశ్వరం ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ నల్ల వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు. వేసవి కాలంలో రాత్రి వేళల్లో పనుల వేగం కోసం అవసరమైన చోట కొందరు ఇంజనీర్లను డిప్యూటేషన్ పై నియమించనున్నట్టు మంత్రి తెలిపారు. కన్నేపల్లి, మేడిగడ్డ, సుందిళ్ళ,అన్నారం పంప్ హౌజ్ లకు అవసరమైన యంత్రాలు మరో పది రోజుల్లో దిగుమతి కానున్నట్టు మంత్రి చెప్పారు. జపాన్, స్విట్జర్లాండ్ , ఆస్ట్రియా వంటి దేశాల నుంచి ఈ యంత్ర సామాగ్రి రవాణా అవుతున్నట్టు హరీశ్ రావు తెలియజేశారు. కన్నేపల్లి–అన్నారం మధ్య అటవీ ప్రాంతంలో తలపెట్టిన 13.35 కిలోమీటర్ల పొడవైన గ్రావిటీ కెనాల్ నిర్మాణ పనులను మంత్రి హరీష్ రావు శనివారం స్వయంగా పరిశీలించారు. ఈ కెనాల్ పనుల్లో మట్టి పనులు దాదావు పూర్తి కావస్తున్నాయి. స్ట్రక్చర్ల నిర్మాణం సహా అన్నీ పనులను రెండు నెలల్లో పూర్తి చేయాలని ఇంజనీర్లు, ఏజన్సీ ప్రతినిధులను ఆయన ఆదేశించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు చెందిన వివిధ నిర్మాణాల్లో ఈ అప్రోచ్ కెనాల్ పనులు అత్యంత కీలకమని మంత్రి అభిప్రాయపడ్డారు. ఈ కెనాల్ పనులు మే 31 కల్లా పూర్తి చేయాలని డెడ్ లైను విధించారు.


కాళేశ్వరం ప్రాజెక్టులో విద్యుత్ పనులు మరింత ఊపందుకున్నాయి. విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణ పనులు వేగవంతమయ్యాయి. ప్రాజెక్టు అవసరాలకు ప్రత్యేక విద్యుత్ లైన్ల ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రాజెక్టులో ప్రధానమైన బ్యారేజీలు, పంప్ హౌజ్ ల కోసం ప్రత్యేకంగా విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణాలు, ప్రత్యేక లైన్ల ఏర్పాట్ల పనులు జోరుగా సాగుతున్నాయి. విద్యుత్తు అవసరాల సామర్థ్యానికి అనుగుణంగా పనులు పూర్తవుతున్నాయి. జైపూర్ లోని సింగరేణికి చెందిన పవర్ ప్లాంట్ ద్వారానే ప్రత్యేకంగా మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల పంప్ హౌజ్ లకు వేర్వేరుగా విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. పెద్దపల్లి జిల్లా గోలివాడ నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కన్నేపల్లి దగ్గర నిర్మిస్తున్న పంప్ హౌజ్ వరకు 80 కిలోమీటర్ల మేరకు విద్యుత్ లైను లాగుతున్నారు. 40 మెగావాట్ల సామర్థ్యంతో 11 మోటార్లకు గాను 440 మెగావాట్ల విద్యుత్తు అవసరం. 220/11 కె.వి.సబ్ స్టేషన్ నిర్మాణ పనులు 80 శాతం పూర్తయ్యాయి. విద్యుత్ లైన్ పనులు 40 శాతం , టవర్లు 14 శాతం,అటవీ మార్గంలో 9 కిలోమీటర్ల మేరకు విద్యుత్



లైను ఉన్నది. 180.56 కోట్ల వ్యయంతో చేపట్టిన పనులు ఈ నెలాఖరుకల్లా పూర్తి కానున్నాయి. పెద్దపల్లి జిల్లా గోలివాడ లో జరుగుతున్న సుందిళ్ళ పంప్ హౌజ్ కోసం జైపూర్ పవర్ ప్లాంట్ నుంచి 6 కిలోమీటర్ల మేరకు విద్యుత్ లైను పనులు జరుతున్నాయి. 40 మెగావాట్ల సామర్థ్యంతో 9 మోటార్లకు గాను 360 మెగావాట్ల విద్యుత్ అవసరం. 400/220/11 కె.వి.సబ్ స్టేషన్ నిర్మాణం జరుతున్నది. దీని పనులుకూడా 60 శాతం పూర్తయ్యాయి. 400 కె.వి.విద్యుత్తు డబుల్ సర్క్యూట్ లైన్ పనులు 75 శాతం పూర్తయ్యాయి. 205.78 కోట్ల వ్యయతో దీన్ని నిర్మిస్తున్నారు. అన్నారం పంప్ హౌజ్ కోసం 40 మెగావాట్ల సామ్ర్థ్యంతో 8 మోటార్లకు గాను 320 మెగావాట్ల విద్యుత్తు అవసరం. 220/11 కె.వి.సబ్ స్టేషన్ నిర్మాణ పనులు 80 శాతం పూర్తయ్యాయి. విద్యుత్ లైను పనులు 45 శాతం, టవర్ల ఎరక్షన్ పనులు 10 శాతం పూర్తయ్యాయి. దీనిని 99.48 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున చేపట్టిన ఎత్తిపోతల పథకాలకు అవసరం అయిన విద్యుత్ కోసం విద్యుత్ శాఖ ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నది. మొత్తం ఎత్తి పోతల పథకాలకు 12,500 మెగావాట్ల విద్యుత్ అవసరం అని అంచనా వేశారు. వచ్చే వానాకాలం నాటికి కాళేశ్వరం ప్రాజెక్టు పంపింగ్ స్టేషన్లు పని చేయనున్నవి. విద్యుత్ సరఫరాకు సంబంధించి ఏర్పాటు వేగవంతం చేయాలని కాలేశ్వరం పనులను క్షేత్రస్థాయిలో సందర్శించినప్పుడే మంత్రి హరీష్ రావు ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో గడువులోగానే విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణం, పంపిణీ లైన్ల ఏర్పాట్లు పూర్తి చేయడానికి ట్రాన్స్ కో సన్నాహాలుచేస్తున్నది. విద్యుత్, ఇరిగేషన్ అధికారులతో మంత్రి హరీశ్‌రావు నిరంతరం సమీక్షిస్తున్నారు. కాళేశ్వరంతో పాటు ఇతర ప్రాజెక్టుల కోసం 2018 జూన్ నాటికి 12,500 మెగావాట్ల విద్యుత్తు అవసరమవుతుందని అధికారిక అంచనా. ఈ మేరకు విద్యుత్ సరఫరాకు సంబంధించి ట్రాన్స్కు కో అన్ని చర్యలు తీసుకుంటున్నది. కాళేశ్వరం పంవు హౌజ్ లపనులు త్వరలోనే పూర్తి చేయడానికి టైం లైన్ పెట్టుకున్నందున విద్యుత్ సంస్థలు తమ పనులను మరింత వేగవంతం చేశాయి. ప్యాకేజీల వారిగా పంపింగ్ స్టేషన్లను పూర్తి చేసేందుకు నీటిపారుదల శాఖ ప్రణాళిక రూపొందించుకున్నది.

అవిశ్వాస తీర్మానం వల్ల ఎన్డీయేకు నష్టం లేదు

బెంగళూరు, సూర్య ప్రతినిధి : తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వల్ల మోదీ ప్రభుత్వానికి ఎటువంటి నష్టం ఉండబోదని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అనంత్‌కుమార్ అన్నారు. శనివారం బెంగళూరులో నిర్వహించిన సేవ్ బెంగళూరు క్యాంపెయిన్‌లో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కొనేందుకు భాజపా సిద్ధంగా ఉందని ఆయన తేల్చి చెప్పారు. కాంగ్రెస్ ఇతర ప్రతిపక్ష పార్టీలకు నేను ఒకటి చెప్పదలుచుకున్నానన్నారు. పార్లమెంటు బయట, లోపల ఎన్డీయే ప్రభుత్వానికి పూర్తి మద్దతు ఉందని, అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడితే ఎదుర్కొనేందుకు బీజేపీ సిద్ధంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వడానికి కేంద్రం నిరాకరించడంతో టీడీపీ ఎన్డీయేతో తెగదెంపులు చేసుకోవడంపై ఆయన స్పందించారు. టీడీపీ కొన్ని విషయాలను మాత్రమే దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకుందన్నారు. మోదీ ప్రభుత్వం ఏపీ రూపకల్పన కోసం అదనంగా రూ. 24వేల కోట్లు విడుదల చేసిందని, ఇప్పటి వరకు ఏ రాష్ట్రానికి ఇంత మొత్తంలో నిధులు ఇవ్వలేదని ఏపీ గ్రహించాలన్నారు. రాజధాని అమరావతి నిర్మాణానికి, పోలవరం, జాతీయ రహదారులు, ఇరిగేషన్, పేదలకు ఇళ్లు కట్టించేందుకు కేంద్రం నిధులు ఇచ్చి సాయం చేసింది. భాజపా ఏపీ అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంది అని ఆయన స్పష్టం చేశారు. లోక్‌సభ,



రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీలు చేస్తున్న ఆందోళనలను ఆయన తప్పుబట్టారు.



టీడీపీ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహిస్తాం : రమణ

హైదరాబాద్, మేజర్‌న్యూస్‌: తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని టీటీడీపీ అధ్యక్షుడు ఎల్.రమణ పార్టీ శ్రేణులకు సూచించిరు. మార్చి 29న అన్ని గ్రామా ల్లో పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం మండల పార్టీ ఆధ్వర్యంలో అన్ని మండలాలలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం జరపాలని తెలిపారు. శనివారం ఎన్‌టిఆర్ భవన్‌లో రమణ అధ్యక్షతన పార్లమెంటు నియోజకవర్గాల పార్టీ పరిశీలకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం రోజున ఉదయం ఎన్టీఆర్ ఘాట్‌కు వెళ్లి నివాళులర్పించిన అనంతరం బైక్ ర్యాలీని నిర్వహించి సాయంత్రం ఎన్‌టీఆర్ భవన్‌లో ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున జరపాలని తెలిపారు. తెలుగుదేశం పార్టీ కార్యక్రమం జరుగుతున్న తీరును కూడా సమీక్షించారు. జిల్లాల్లో ఖాళీగా ఉన్న నియోజకవర్గ నాయకత్వాన్ని భర్తీ చేయడానికి పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకులు నివేదికలు తీసుకుని నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు. అనుబంధ సంఘాలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని కూడా నిర్ణయించారు. ఈ సమావేశంలో పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖర్ రెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి, ఇ.పెద్దిరెడ్డి, అమర్‌నాథ్ బాబు, సామ భూపాల్‌రెడ్డి, యూసుఫ్, బుచ్చిలింగం, అలీ మస్కతీ, వీరేందర్‌గౌడ్, బిఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల జాప్యానికి కాంగ్రెస్ కుట్ర

- పంచాయతీ రాజ్ శాఖ మంత్రి జూపల్లి ఆగ్రహం
- ప్రతిపక్షాల ప్రచారానికి, ఇక్కడి పరిస్థితులకు పొంతన లేదు : అల్లం నారాయణ
- ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రాజెక్టులను సందర్శించిన మీడియా బృందం

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః రాష్ట్రంలో ప్రాజెక్టులను పూర్తి చేయకుండా అడ్డుపడాలన్నదే కాంగ్రెస్ కుట్రలో భాగమని పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు విమర్శించారు. గడిచిన మూడున్నరేండ్లలో ప్రాజెక్టులకు అనేక అడ్డంకులు సృష్టించి కాలయాపనకు కారణంగా కాం గ్రెస్ నిలిచిందని ఆరోపించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై గ్రీన్ ట్రిబ్యునల్లో కేసు వేయించి ఏడాదిన్నరపాటు పనుల ఆలస్యానికి కారణమైందన్నారు. కేవలం 200 మీటర్ల తేడాతో ఉన్న ఈ పెద్ద ప్రాజెక్టును అడ్డుకోవాలని కాంగ్రెస్ పెద్ద కుట్రను తలపెట్టిందన్నారు.శుక్రవారం రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ ఆధ్వర్యంలో హైదరాబాద్ నుంచి మీడియా ప్రతినిధుల బృందం పాలమూరు ప్రాజెక్టులపై అధ్యయన యాత్ర చేపట్టింది. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం ఎల్లూరు సమీపంలో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల టన్నెల్, రిజర్వాయర్ బండింగ్, ఎంజీకేఎల్ఐ మొదటి లిఫ్ట్, ఎల్లూరు రిజర్వాయర్, వాటర్‌గ్రిడ్ ప్రధాన కేంద్రం, వనపర్తి జిల్లా ఏదుల రిజర్వాయర్ సమీపంలో ఏర్పాటవుతున్న టన్నెల్ పనులను పరిశీలించింది. కేఎల్ఐలోని మూడో లిఫ్ట్ గుడిపల్లి వద్ద మంత్రి జూపల్లి మీడియాతో మాట్లాడారు. ఆసియాలోనే పెద్ద ప్రాజెక్టుగా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని సీఎం కేసీఆర్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని నిర్మిస్తున్నా రన్నారు. పెండింగ్‌లో పడేసిన నాలుగు ప్రాజెక్టులను ఉమ్మడి పాలమూరును సస్యశ్యామలం చేయాలనే ఉద్దేశంతో మూడున్నరేండ్లలో పనులన్నీ పూర్తి చేసి చివరి దశకు తీసుకొచ్చినట్లు చెప్పారు.

పనులు వేగంగా సాగుతున్నాయి : అల్లం నారాయణ

సాగునీటి ప్రాజెక్టులపై ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారానికి, వాస్తవ పరిస్థితికి ఏ మాత్రం పొంతన లేదని మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ పేర్కొన్నారు. కర్ణాటక నుంచి వచ్చిన రాష్ట్ర మీడియా బృందానికి కాళేశ్వరం ప్రాజెక్టును చూపించినట్టు వివరించారు. ఇక్కడి ప్రాజెక్ట్ పనులు వేగంగా సాగుతున్నాయని, ఇన్నాళ్లు కరువుతో పాలమూరు, ఫ్లోరైడ్ నీటితో నల్లగొండ జిల్లా ప్రజలు బాధలను అనుభవించారన్నారు. ఇన్ని ఇబ్బందులు పడ్డ ఈ



జిల్లాల ప్రజలకు ప్రభు త్వం అత్యంత వేగంగా చేపడుతున్న ప్రాజెక్ట్ పనులతోనే న్యా యం జరుగుతున్నదన్నారు. ప్రాజెక్టుతోనే తలెత్తే సమస్యలను సహేతుకంగా పరిష్కారం చేసుకుంటూ ప్రభుత్వం ముందుకెళ్తున్నదని చెప్పారు. బృందంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర కోశాధికారి అస్కని మారుతీసాగర్, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బడిగె బసవపున్నయ్యతో పాటు ఫ్రింట్, ఎలక్ట్రానిక్‌మీడియా ప్రతినిధులున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ముస్లింల అభ్యున్నతికి కృషి చేస్తోంది : మంత్రి తుమ్మల



హైదరాబాద్, మేజర్‌న్యూస్‌: తెలంగాణ రాష్ట్రంలో ముస్లింల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ అనేక చర్యలు తీసుకుంటున్నారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. అందులో భాగంగానే ముస్లింల సంక్షే మానికి ఈబడ్జెట్‌లో రూ. 2వేల కోట్లు కేటాయిం చారని చెప్పారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత ప్రభు త్వాలు ముస్లిం, మైనారి టీలను ఓటు బ్యాంకుగానే వాడుకున్నాయని తెలిపారు. తెలంగాణలోని అన్ని జిల్లాలతో పాటు ఖమ్మం జిల్లాకు ఏం కావాలన్నా ఇచ్చేందుకు కేసీఆర్ సిద్ధంగా ఉన్నారని చెప్పారు. పట్టణంలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చామని, ప్రతి ఎక్షాలు అధికార దాహంతోనే అనవసర ఆరోపణలు చేస్తున్నాయని విమర్శి ంచారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసే ప్రభుత్వాన్ని ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని మంత్రి తుమ్మల కోరారు.

ఈ సమావేశాల్లోనే బిసి కమిషన్ బిల్లుకు ఆమోదమని కేంద్రం హామీ



హైదరాబాద్, మేజర్‌న్యూస్‌: ఈ పార్లమెంటు సమావేశాలు ముగిసేలోగా జాతీయ బిసి కమిషన్‌కు రాజ్యాంగ బద్ధమైన హోదా ఇచ్చే బిల్లును పాస్ చేస్తామని కేంద్ర సామాజిక న్యా య సాధికార సహాయ మంత్రి రాందాస్ అథ్వాలే బిసి నేతలకు హామీ ఇచ్చారు. శనివారం బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, ఎన్ భూపేష్ సాగర్, లక్ష్మీనారాయణ తదితర బీసీ నేతలు ఢిల్లీలో కేంద్రమంత్రితో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా రాందాస్ అథ్వాలే మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ఈ బిల్లును ఆమోదింపజేయడానికి చిత్తశుద్ధితో ఉందని, కొన్ని ప్రతిపక్షాలు వ్యతిరేకించినందుకే జాప్యం జరుగుతుందని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ సమావేశాల్లోనే బిల్లును పాస్ చేయడానికి కేంద్రం కట్టబడి ఉందని బీసీ నేతలకు హామీ ఇచ్చారు. తెలుగు రాష్ట్రాలల్లో కొనసాగుతున్న ఫీజుల రీయింబర్స్‌మెంట్ పథకం, కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలో అన్ని రాష్ట్రాలలో ప్రవేశపెట్టాలని బిసి నేతలు కేంద్రమంత్రిని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా సంస్థలల్లో రిజర్వేషన్ అమలు చేయడం వల్ల పేద వర్గాలకు చెందిన విద్యార్థులు ఇంజనీరింగ్, మెడిసిన్, ఇతర వృత్తి విద్యా, ఉన్నత విద్యా కోర్సులలల్లో చదువుకునేందుకు ముందుకు వస్తున్నారని తెలిపారు.

కేంద్ర మంత్రివర్గంలోకి కంభంపాటి?



- కేంద్ర మంత్రి పదవికి గ్రీన్‌సిగ్నల్
- బీజేపీ నేతల భేటీలో వైసీపీ వ్యూహకర్త పీకే
- ఏపీ అధ్యక్ష పదవిపై చర్చించిన అమిత్‌షా

న్యూఢిల్లీ, సూర్య ప్రత్యేక ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ తెలుగుదేశం పార్టీ ఎన్డీఏ నుంచి బయటికి రావడం, కేంద్ర మంత్రి పదవులకు సుజనాచౌదరి, అశోక్‌గజపతిరాజు రాజీనామా చేయడంతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కంభంపాటి హరిబాబుకు కేంద్రమంత్రి వర్గంలో స్థానం కల్పించే అవకాశమేర్పడింది. గతంలోనే హరిబాబుకు కేంద్ర మంత్రి పదవి లభిస్తుందని పార్టీ శ్రేణులు భావించినా వివిధ కారణాల వల్ల అది సాధ్యం కాలేదు. తెలుగుదేశం పార్టీ ఎంపీలు కేంద్రమంత్రి వర్గం నుంచి వైదొలగడం ప్రస్తుతం హరిబాబుకు కలిసొచ్చింది. శనివారం సాయంత్రం ఢిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షాతో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బీజేపీ నేతలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హరిబాబును కేంద్రమంత్రి వర్గంలోకి తీసుకుంటే రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు ఎవరికి అప్పగించాలనే దానిపై కసరత్తు జరిగినట్లు సమాచారం. సోము వీర్రాజు, ఆకుల సత్యనారాయణ, విష్ణుకుమార్‌రాజు వీరిలో ఒకరికి అధ్యక్ష బాధ్యతలు అప్పగించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఏ సామాజిక వర్గానికి చెందిన నేతకు అధ్యక్ష బాధ్యతలు అప్పగిస్తే పార్టీకి మేలు జరుగుతుందనే అంశాన్ని పరిశీలిస్తున్నారు.

బీజేపీ నేతల భేటీకి ఏపీలో వైసీపీ వ్యూహకర్తగా ఉన్న ప్రశాంత్‌కిషోర్ హాజరుకావడం ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ప్రశాంత్ కిషోర్ గత ఏడాదిన్నరగా ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై అధ్యయనం చేస్తున్నందున ఆయన సలహాలను కూడా అమిత్ షా పరిగణనలోకి తీసుకుంటున్నారు. ప్రశాంత్ కిషోర్ జాతీయ స్థాయిలో బీజేపీకి కూడా వ్యూహకర్తగా ఉన్నారు. ప్రశాంత్ కిషోర్ కేంద్రంలో బీజేపీకి, రాష్ట్రంలో వైసీపీకి వ్యూహకర్తగా పనిచేయడంపై రాజకీయవర్గాల్లో ఆసక్తికర చర్చ దారితీసింది. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వకుండా మోసం చేసిన భారతీయ జనతాపార్టీతో వైసీపీ అంటకాగుతోందని తెలుగుదేశం పార్టీ తీవ్ర విమర్శలు చేస్తున్న తరుణంలో తాజాగా ప్రశాంత్ కిషోర్ బీజేపీ నేతల భేటీకి హాజరుకావడం టీడీపీ నేతలు చేస్తున్న ఆరోపణలకు మరింత బలం చేకూరినట్లయింది.

2014లో బీజేపీ, టీడీపీలకు మద్దతిచ్చిన జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ గతంలో కాకినాడ సభలో బీజేపీపై విమర్శలు గుప్పించడం, తాజాగా మంగళగిరిలో జరిగిన జనసేన ఆవిర్భావ సభలో తెలుగుదేశం పార్టీపై అవినీతి ఆరోపణలు చేయడంపై బీజేపీ నేతలు చర్చించారు. ప్రస్తుతం పవన్ కల్యాణ్ రాజకీయ వైఖరి ఏమిటి, రాష్ట్రంలో ఎలాంటి వ్యూహం అనుసరించాలనే దానిపై చర్చించారు. ప్రత్యేక హోదా ఇవ్వకుండా బీజేపీ ఆంధ్రప్రదేశ్‌కు ద్రోహం చేసిందని టీడీపీ చేస్తున్న ఆరోపణలు తిప్పికొట్టాలని, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి చేసిన సాయాన్ని రాష్ట్ర ప్రజలకు వివరించాలని బీజేపీ నేతలు నిర్ణయించారు. ప్రత్యేక హోదాతో వచ్చే సాయాన్ని ప్యాకేజీ ద్వారా ఇస్తామని చెప్పిన మాటకు ఇప్పటికీ కట్టుబడి ఉన్నామని బీజేపీ నేతలు రాష్ట్ర ప్రజలకు వివరించనున్నారు. రాష్ట్ర బీజేపీ నేతలు అమిత్ షాతో భేటీ తర్వాత తెలుగుదేశం పార్టీపై ఎలాంటి ఎదురుదాడికి సిద్ధమవుతారో వేచి చూడాల్సిందే.

ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తే దేశంలో అశాంతి నెలకొంటుంది : కిషన్ రెడ్డి



హైదరాబాద్, మేజర్‌న్యూస్‌: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తే దేశంలో అశాంతి నెలకొం టుందని బీజేపీ శాసన సభాపక్ష నేత జి.కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం ఏపీకి ప్రత్యేక హోదా అంశంపై ఆయన స్పందించారు. ఎన్నికల ముందు హోదాపై మోదీకి సరైన అవగాహన లేదన్నారు. తిరుపతి సభ లో ఎవరో రాసి ఇచ్చిన చీటి చూసి హోదా ఇస్తా మని ప్రకటించినట్లు చెప్పారు. ఉమ్మడి రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తెలంగాణ కంటే ఎక్కువ నిధులు ఇచ్చామని చెప్పారు. ఏ1, ఏ2లకు ప్రధాని నరేంద్రమోదీ అపాయింట్‌మెంట్ ఎందుకు ఇచ్చారనడం సరికాదని, జగన్ కేసులు ఇంకా విచారణ దశలోనే ఉన్నాయని, అప్పుడే నిందితులుగా ఎలా నిర్ధారిస్తారని కిషన్ రెడ్డి ప్రశ్నించారు.

నిరుద్యోగులతో కేసీఆర్ చెలగాటం

మాజీ ఎమ్మెల్సీ కనుకుల జనార్దన్ రెడ్డి

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః నీళ్లు, నిధులు, నియమాకాల్లో అన్యాయం జరుగుతుందని తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, తెలంగాణా వచ్చిన తర్వాత అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులతో చెలగాటం ఆడుతున్నదని కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ సేవాదళ్ చైర్మన్ కనుకుల జనార్ధన్‌రెడ్డి ఆరోపించారు. శనివారంనాడు ఆదర్శనగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యమ సమయంలో అయితే ఏకంగా తెలంగాణలో 1,68,000 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని ఉద్యమనేతగా ఆనాడు కేసీఆర్ ప్రకటించారన్నారు. వీటిని భర్తీ చేయాలంటూ ఆనాడు అనేక సందర్భాల్లో డిమాండ్ చేశారని, అయితే సీఎంగా పదవీబాధ్యతలు స్వీకరించిన తర్వాత ఖాళీ అయిన ఉద్యోగాల నియామకంపై శ్రద్ధచూపడంలేదన్నారు. గతంలో ప్రతి అంశంపై విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు, ప్రజలచే హైదరాబాద్‌లో ధర్నాలు, ర్యాలీలునిర్వహించిన కేసీఆర్, నేడు సమస్యలు పరిష్కారం కోరుతూ శాంతియుతంగా ఆందోళనలు నిర్వహిస్తానంటే ఎక్కడికక్కడే ఆరెస్టులు చేయిస్తున్నారని ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చాక సీఎం కేసీఆర్ అసెంబ్లీ వేదికగా 1,12,400 పైగా ఉద్యోగాలను భర్తీ చేస్తానని ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. టీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడి దాదాపు నాలుగేళ్లు పూర్తికావస్తున్నా ఇప్పటి వరకు 4వ వంతు ఉద్యోగాలను కూడా భర్తీ చేపట్టలేదని జనార్ధన్‌రెడ్డి విమర్శించారు. వేగంగా ఉద్యోగాలను నింపకుండా కావాలనే నోటిఫికేషన్ల పేరుతో నిరుద్యోగులను సర్కార్ మోసం చేస్తున్నదన్నారు. ఫలితంగా అనేక మంది నిరుద్యోగులు ఉద్యోగాలు లేక... కుటుంబాలు గడవక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు సెక్టర్ లో కూడా అర్హతకు తగిన ఉద్యోగాలు లేక చాలా మంది నిరుద్యోగులు అష్టకష్టాలు పడుతున్నారన్నారు. సీఎం కేసీఆర్ చెప్పిన ఒక లక్ష 12 వేల ఉద్యోగాల్లో ఇప్పటి వరకు వివిధ డిపార్ట్ మెంట్ల వారిగా 21,473 పోస్టులను భర్తీ చేసినట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయని తెలిపారు. అంటే ఈ ప్రభుత్వం నిరుద్యోగుల విషయంలో ఎంత నిర్లక్ష్యం చేస్తోందో అర్థమవుతోందని జనార్ధన్‌రెడ్డి అన్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్న వేల నోటిఫికేషన్లను ఇస్తోందే తప్ప చిత్త శుద్ధితో వాటిని భర్తీ చేయాలన్న ధ్యాస ప్రభుత్వానికి లేదన్నారు. జేఏసీ నేత కోదండ రామ్ నిరుద్యోగులతో కొలువుల కొట్లాట సభ పెడుతామంటే ప్రభుత్వం అడ్డుకుంది. చివరికి కోర్టుకు వెళ్లి వాళ్లు కోదండరామ్ సభకు అనుమతి తెచ్చుకోవాల్సిన దౌర్భాగ్యం రాష్ట్రంలో ఉందని, త్వరలో జరగబోయే ఎన్నికల్లో టీఆర్ఎస్‌పార్టీకి ప్రజలు షాక్ ఇవ్వబోతున్నారని ఆయన తెలిపారు.కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఉద్యోగాల నియమాకం చేయడం లేదని ఆందోళన చేసిన టీఆర్ఎస్ నేతలు ఇప్పడు ఉద్యోగాల నియమాకాల విషయంలో తత్సారం చేయడం వెనుక అంతర్యమేమిటని ప్రశ్నించారు. టీఎస్ పీఎస్సీ ద్వారా వివిధ డిపార్ట్ మెంట్ ల ద్వారా 11,086 ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చింది. నిజంగా ప్రభుత్వానికి టీచర్ ఉద్యోగాలను భర్తీ



చేయాలని ఉంటే ఇలా బాధ్యత రహిత్యంగా నోటిఫికేషన్ ఇస్తుందా? అని జనార్ధన్‌రెడ్డి ప్రశ్నించారు. ఎన్నికలు దగ్గర పడుతున్న వేల 14 వేల 177 పోలీసు ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వడం అంటే ఓట్ల రాజకీయం కాకపోతే ఏంటని ప్రశ్నించారు. 4 ఏళ్లుగా నిరుద్యోగుల రోదనను పట్టించుకోకుండా ఇప్పుడు నోటిఫికేషన్ల పేరుతో ఓట్ల ఏర వేస్తోంది కేసీఆర్ ప్రభుత్వం. ప్రభుతానికి చిత్తశుద్ధి లేకపోడం వల్లే ఏళ్లు గడిస్తున్న ఉద్యోగాల భర్తీ జరగడం లేదు. ప్రభుత్వం కావాలనే ఉద్యోగాల భర్తీకి విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ప్రజలు, విద్యార్థులు, నిరుద్యోగులు అన్ని విషయాలను గమనిస్తున్నారు... రానున్న ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతారన్నారు.

జనసేన లీగల్ సెల్ ఏర్పాటు



వెలగపూడి, సూర్య ప్రతినిధి : జనసేన లీగల్ సెల్ ఏర్పాటుచేస్తూ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ప్రకటన విడుదల చేశారు. ఈ సెల్‌కు డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌గా పేరు పెట్టారు. అమరావతికి చెందిన ఆరుగురు సభ్యులకు లీగల్ సెల్‌లో చోటు కల్పించారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధనకు న్యాయపరమైన అంశాలను పరిశీలించాల్సిందిగా లీగల్ సెల్‌ను పవన్ ఆదేశించారు.

పవన్‌ను కలిసిన ఉద్దండరాయునిపాలెం ఎస్సీ రైతులు


జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను శనివారం ఉద్దండరాయునిపాలెం ఎస్సీ రైతులు కలిశారు. లంకభూముల పరిహారంలో అన్యాయాన్ని ఎస్సీ రైతులు వివరించారు.

ఎన్డీయేను నిర్మొహమాటంగా నిలదీస్తాం



అమరావతి, సూర్య ప్రతినిధి : ఎన్డీయేను నిర్మొహమాటంగా నిలదీస్తామని తెలుగుదేశం పార్టీకి చెందిన రాజమండ్రి పార్లమెంటు సభ్యుడు మురళీ మోహన్ పేర్కొన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నాలుగేళ్లు ఎదురుచూశాక తప్పనిసరి పరిస్థితుల్లో అవిశ్వాసం పెట్టాల్సి వచ్చిందన్నారు. కాంగ్రెస్ అన్యాయం చేసిందని, బీజేపీ న్యాయం చేస్తుందని నమ్మామని, అయితే బీజేపీ కూడా ఏపీకి అన్యాయం చేసిందన్నారు. ఎన్ని కష్టాలు ఎదురైనా న్యాయం కోసం పోరాడతామని, చంద్రబాబు అనుభవం కలిగిన నేత అని, అందరినీ ఏకతాటిపైకి తీసుకొస్తారని ఆయన్ను బలహీనపర్చాలనుకుంటున్నారన్నారు. దక్షిణాదిపై సవతి ప్రేమ చూపిస్తున్నారన్న అభిప్రాయం పెరుగుతోందని మురళీమోహన్ అన్నారు. రాష్ట్రాలపై కేంద్రం పెత్తనమేందని ఎన్టీఆర్ ఆనాడే చెప్పారని ఆయన అన్నారు.


జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి : టీడబ్ల్యూజేఎఫ్



హైదరాబాద్, మేజర్‌న్యూస్‌: తెలంగాణలోని జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించి అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇళ్లు నిర్మించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం జర్నలిస్టులు అన్ని జిల్లా కేంద్రాలలో కలెక్టర్లు, మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు సమర్పించారు. అందులో భాగంగా ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు ఉప ముఖ్య మంత్రి మహమూద్ అలీని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ అధ్యక్షుడు సోమయ్య, ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్యలు జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను మంత్రికి వివరించారు. ప్రజలకు.. ప్రభుత్వానికి మధ్య వారసులుగా వుండి సమాజసేవ చేస్తున్న జర్నలిస్టుల జీవన పరిస్థితి దయనీయంగా ఉందని, ఏ కొద్ది మందికో తప్ప చాలా మందికి కనీస వేతనాలు, కూడూ గూడూ లేక ఇబ్బంది పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించి డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించేందుకు సీఎం సుముఖంగా ఉన్నారని, త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని చెప్పారు.

దివ్యాంగులకు దన్నుగా తెలంగాణ సర్కార్

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి



హైదరాబాద్, మేజర్‌న్యూస్‌: ముఖ్యమంత్రి కేసీఆర్‌తో చర్చించి పది రోజుల్లో 18 దివ్యాంగుల హాస్టళ్ల పక్కా భవన నిర్మాణాలకు అనుమతులు ఇప్పించే విధంగా కృషి చేస్తానని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖమంత్రి కడియం శ్రీహరి తెలిపారు. అనుమతులు వచ్చిన తర్వాత రానున్న తొమ్మిది నెలల్లో భవనాలు పూర్తి చేయించే విధంగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు . దివ్యాంగులు ఏ పరిస్థితుల్లో బాధ పడొద్దని మీకు అన్ని విధాలా సాయం చేసేందుకు తెలంగాణ ప్రభు త్వం అండగా ఉందన్నారు. హన్మకొండ లోని సుబేదారి లో 1.22 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించనున్న దివ్యాంగుల వసతి గృహానికి కడియం శ్రీహరి శంకుస్థాపన చేశారు. ఈ భవనాన్ని 6 నెలల్లో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దివ్యాంగులకు వసతి గృహాలు ఇంకా అద్దె భవనాల్లో ఉన్నాయని చెప్పడం నాకు బాధ అనిపించింద న్నా రు. అందరికంటే ముందు పక్కా వసతి గృహాలు ఉండాల్సింది దివ్యాంగులకేనని ఆయన అన్నారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక దివ్యాం గుల పెన్షన్ ను 500 నుంచి 1500 కు పెంచామని పేర్కొన్నారు దివ్యాంగుల ను పెళ్లి చేసుకునే సకలాంగులను ప్రోత్సహించడానికి ఇచ్చే ఆర్థిక ప్రోత్సాహం ను 50వేల నుంచి లక్ష రూపాయలకు పెంచామన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో ఐదు శాతం వారికి కేటాయించామన్నారు. వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ వాసుదేవరెడ్డి, జడ్పీ చైర్ పర్సన్ గద్దల పద్మ, ఎమ్మెల్సీ శ్రీనివాస రెడ్డి, ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, అరూరి రమేష్, మహిళా కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, వరంగల్ అర్బన్ కలెక్టర్ ఆమ్రపాలి, స్థానిక నేతలు, అధికారులు, ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. హాస్టళ్లలో అందరికి కామన్ మెనూ అమలు చేస్తున్నామని మంత్రి కడియం తెలిపారు. వీటితో పాటు నెయ్యి కూడా ఇస్తున్నామని, ఇక్కడ కూడా ఇస్తున్నారా? లేదా? అని ఆయన అధికారు లను ప్రశ్నించారు. ఇవ్వడం లేదని అధికారులు చెప్పడంతో ఎందుకు ఇవ్వడం లేదని అధికారులని ప్రశ్నించి, వెంటనే ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. ఈ రోజు ఈ భవనాన్ని 1.22 కోట్ల రూపాయలతో నిర్మించడానికి శంకుస్థాపన చేశామని, వచ్చే 6 నెలల్లో దీనిని పూర్తి చేయించే విధంగా ఛాలెంజ్ గా తీసుకుంటున్నామన్నారు.

మంత్రి ప్రోత్సాహంతోనే కమిషన్లు తీసుకుంటున్నాం

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః బీజేపీ యేతర, కాంగ్రెసేతర కూటమి ద్వారా దేశంలో ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక ఏర్పాటు చేస్తామని, అవకాశం లభిస్తే అందుకు తానే నాయకత్వం వహిస్తానని ఇటీవల తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే అ దిశగా మొదటి అడుగులు వేసేందుకు కేసీఆర్ సన్నద్ధమయ్యారు. దేశ రాజకీయాల్లో మూడో కూటమి ఏర్పాటు చేస్తామని కేసీఆర్ ప్రకటించిన వెంటనే పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ.. కేసీఆర్‌కు ఫోన్ చేసి అభినందనలు తెలిపారు. తమ్ముడు కేసీఆర్ మీరు ఎలా చెబితే అలాగే. మీ వెంటే నడుస్తాం అని దీదీ చెప్పారని కేసీఆర్ తెలిపారు.

త్వరలో తెలంగాణ భాషా బిల్లు

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః తెలంగాణ రాష్ట్రం తెలుగు భాష పరిరక్షణకు నడుం బిగించింది. ఇటీవల జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ ఒకటి నుంచి 12 తరగతుల వరకు తెలుగు తప్పనిసరిగా ఉండాల్సిందేనని, అందుకు తమిళనాడు రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకొంటామని చెప్పారు. ఈ నేపథ్యంలో తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి నేతృత్వంలో బృందం ఇటీవల తమిళనాడు వెళ్లొచ్చింది. అనంతరం బృంద సభ్యులు విద్యా భాషగా తమిళం ఎలా ఉందో.. తెలంగాణలో తెలుగు అంతకన్నా మెరుగ్గా ఉంచేందుకు ఒక నోట్‌ను తయారు చేసి ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్యకి ఇచ్చారు. దాన్ని ముసాయిదా బిల్లు రూపంలో ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. ఈ మొత్తం ప్రక్రియ పూర్తి చేసుకొన్న తర్వాత దాన్ని కేబినెట్ ముందు ఉంచనున్నారు. కేబినెట్ దీన్ని ఆమోదించిన తర్వాత దీనికి తెలంగాణ భాషా బిల్లుగా నామకరణం చేసి సీఎం కేసీఆర్ చేతుల మీదుగా విడుదల చేయనున్నారు. ఆ తర్వాత కఠినతరమైన జీవో ఒకటి రానుంది. ఇది 1 నుంచి 12 వ తరగతుల వరకు నిర్వహించే పాఠశాలల ముంగిటకు చేరుతుంది.

“ఉగాది పండుగను తెలుగు ప్రజలు ఎంతో ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఉగాది పండుగ ప్రతి సంవత్సరం చైత్రశుద్ధ పాడ్యమినాడు జరుపుకుంటారు. కొత్త యుగానికి ఆది కాబట్టి యుగాది అంటారు. ఉగాది అంటే యుగా + అది అంటే ప్రపంచం యొక్క జన్మ ఆయుషులకు మొదటి రోజు అనగా సృష్టి ప్రారంభ సూచిక. యుగము అనగా జత అని అర్ధం కూడా ఉంది. ఉత్తరాయణం, దక్షిణాయనం కలిపితేనే సంవత్సరం. అది మొదలయ్యేది ఈ రోజే. ఉగాది రోజు నుండే తెలుగువారికి నూతన సంవత్సరం మొదలవుతుంది. ఇది తెలుగువారి మొదటి పండుగ ఉగాది రోజున కొత్తగా పనులు మొదలు పెడతారు. ఈ రోజు పొద్దునే లేచి తల స్నానం చేసి కొత్త బట్టలు వేసుకొని ఉగాది పచ్చడితో పలు కొత్త పనులు ప్రారంభిస్తారు. ఉగాది పచ్చడి ఉగాది పండుగకు ప్రత్యేకమైనది. ఉగాది పచ్చడి షడచుల సమ్మేళనం. షడచు అంటే తీపి, వులువు, కారం, ఉప్పు, ఒగరు, చేదు అని ఆరు రుచులు. ఈ ఆరు రుచులు కలగలిపిన ఉగాది పచ్చడి తెలుగువారికి ప్రత్యేకం. సంవత్సరం పొడవునా ఎదురయ్యే కష్ట సుఖాలను, మంచి చెడులను సమానంగా స్వీకరించాలన్న సందేశాన్ని ఈ ఉగాది పచ్చడి తెలియజేస్తుంది. హిందువులకు అత్యంత ఇష్టమైన ఈ ఉగాది పండుగ ముఖ్యంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రలలో ప్రత్యేకంగా జరుపుకుంటారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఉగాదిగా..మహారాష్ట్రలో గుడిపడువగా పిలుస్తారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ఈ ఉగాది పండుగ రోజున పంచాంగ శ్రవణం నిర్వహించడం ఆనవాయతీ. ఉగాది రోజే పాత లెక్కలు మూసేసి కొత్త లెక్కలు రాయటం మొదలు పెడతారు. కవులు ఉగాది పండుగ సందర్భంగా కవి సమ్మేళనాలు నిర్వహిస్తారు. ఏది ఏమైనా పకృతి గమనాన్ని అనుసరించి, మానవాళిలో చైతన్యం వచ్చేలా సంస్కృతి సాంప్రదాయాలను గౌరవిస్తూ, ఆదర్శాలను ప్రతిబింబించేల చేయటమే ఈ పండుగల పరమార్ధం.”

సమత్వాన్ని చాటిచెప్పే ఉగాది


ఉగాది పండుగను తెలుగు ప్రజలు ఎంతో ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఉగాది పండుగ ప్రతి సంవత్సరం చైత్రశుద్ధ పాడ్యమినాడు జరుపుకుంటారు. కొత్త యుగానికి ఆది కాబట్టి యుగాది అంటారు. ఉగాది అంటే యుగా + అది అంటే ప్రపంచం యొక్క జన్మ ఆయుషులకు మొదటి రోజు అనగా సృష్టి ప్రారంభ సూచిక. యుగము అనగా జత అని అర్ధం కూడా ఉంది. ఉత్తరాయణం, దక్షిణాయనం కలిపితేనే సంవత్సరం. అది మొదలయ్యేది ఈ రోజే. ఉగాది రోజు నుండే తెలుగువారికి నూతన సంవత్సరం మొదలవుతుంది. ఇది తెలుగువారి మొదటి పండుగ ఉగాది రోజున కొత్తగా పనులు మొదలు పెడతారు. ఈ రోజు పొద్దునే లేచి తల స్నానం చేసి కొత్త బట్టలు వేసుకొని ఉగాది పచ్చడితో పలు కొత్త పనులు ప్రారంభిస్తారు. ఉగాది పచ్చడి ఉగాది పండుగకు ప్రత్యేకమైనది. ఉగాది పచ్చడి షడచుల సమ్మేళనం. షడచు అంటే తీపి, వులువు, కారం, ఉప్పు, ఒగరు, చేదు అని ఆరు రుచులు. ఈ ఆరు రుచులు కలగలిపిన ఉగాది పచ్చడి తెలుగువారికి ప్రత్యేకం. సంవత్సరం పొడవునా ఎదురయ్యే కష్ట సుఖాలను, మంచి చెడులను సమానంగా స్వీకరించాలన్న సందేశాన్ని ఈ ఉగాది పచ్చడి తెలియజేస్తుంది. హిందువులకు అత్యంత ఇష్టమైన ఈ ఉగాది పండుగ ముఖ్యంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రలలో ప్రత్యేకంగా జరుపుకుంటారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఉగాదిగా..మహారాష్ట్రలో గుడిపడువగా పిలుస్తారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ఈ ఉగాది పండుగ రోజున పంచాంగ శ్రవణం నిర్వహించడం ఆనవాయతీ. ఉగాది రోజే పాత లెక్కలు మూసేసి కొత్త లెక్కలు రాయటం మొదలు పెడతారు. కవులు ఉగాది పండుగ సందర్భంగా కవి సమ్మేళనాలు నిర్వహిస్తారు. ఏది ఏమైనా పకృతి గమనాన్ని అనుసరించి, మానవాళిలో చైతన్యం వచ్చేలా సంస్కృతి సాంప్రదాయాలను గౌరవిస్తూ, ఆదర్శాలను ప్రతిబింబించేల చేయటమే ఈ పండుగల పరమార్ధం. ఉగాది రోజున వేకువ జామున బ్రహ్మ ముహూర్తంలో తలకు నూనె పట్టించి తలంటు స్నానం చేయాలి. పర్వదినాలలో తైలంలో లక్ష్మీదేవి, నీటిలో గంగాదేవి నివాసం ఉంటారట. అందుకని ఆ రోజులలో తలకు నూనె రాసుకొని తలంటుస్నానం చేస్తే లక్ష్మీదేవి, గంగా మాతల అనుగ్రహం పొందుతామని పెద్దలు చెప్తారు. నూతన వస్త్రాలు కట్టుకొని, తర్వాత ఇల్లు శుభ్రం చేసుకొని, మామిడి తోరణాలు కట్టుకొని, పూజకు కావల్సినవి సిద్ధం చేసుకోవాలి. గడపకు పసువు రాసి, బొట్టు పెట్టుకోవాలి. మన ఇష్ట దైవాన్ని పూజించాలి. తులసి చెట్టుకు పూజ చేయాలి. లక్ష్మీదేవికి, విష్ణుమూర్తికి తులసీదళాల మాల సమర్పించుకోవాలి. మన ఇష్టదైవాన్ని తులసి దళంతో అష్టోత్తరం చేయాలి. ఉగాది రోజున ప్రత్యేక ప్రసాదం ఆరు రుచులు కలిగిన అంటే వులువు, చేదు, తీపి, ఉప్పు, కారం, వగరుతో ఉగాది పచ్చడి చేసి దేవునికి నివేదన ఇవ్వాలి. మనస్సులో దైవాన్ని నివేదన స్వీకరించి ఆయన ఉచ్ఛిష్టాన్ని ప్రసాదించమని వేడుకోవాలి. తర్వాత హారతి ఇచ్చి సాష్టాంగ నమస్కారం చేయాలి. ఈ పూజ విధానం అంతా భక్తిశ్రద్ధలతో, విశ్వాసంతో చేయాలి. అప్పుడే ఆ పూజ దైవానికి చెందినట్లు. ఆ తర్వాత పంచాంగ శ్రవణం చేయాలి. మీ రాశి ఫలాలు ఎలా ఉన్నాయో తెలుసుకోవాలి. ఈ పంచాంగ శ్రవణం ద్వారా, జరగబోయే విపత్తులనుండి ముందే తెలుసుకుంటాము. కాబట్టి శాస్త్రాన్ని నమ్మిన వారికి వారి వారి వ్యక్తిగత జాతక ఆధారంగా కొంత ముందస్తుగా జాగ్రత్త పడే అవకాశం అభిస్తుంది. త్రేతాయుగం, ద్వాపర యుగ కాలం నుండి మొన్నటి రాజుల కాలంతో సహా పంచాంగ శ్రవణాన్ని గౌరవిస్తూ, ఆచరిస్తూ వస్తున్నారు. ఆధునిక కాలంలో కొంత మందికి ఈ శాస్త్రంపై అవగాహనలేక శాస్త్రీయ పద్ధతులు తెలియక, ఆచరించక అయోమయస్థితిలో జీవితాన్ని కొనసాగించడం గమనిస్తునే ఉన్నాం, అది వారి విజ్ఞతకే వదిలేద్దాం. బ్రహ్మకల్పం ప్రారంభమైన మొదటి ఉగాది ప్రభవ. మొదటి ఋతువు వసంతం. మొదటి నెల చైత్రం. మొదటి తిథి పాడ్యమి. మొదటి వారం ఆదివారం. ఆ వేళ ఈ సృష్టి ప్రారంభమైందని అర్థం. ప్రభవించిందని అర్థం. అందుకే తెలుగుసంవత్సరాలలో మొదటిది ప్రభవ. చివరిది క్షయ. నాశనమైందని. అంటే ఈ బ్రహ్మకల్పం అంతమయ్యే సంవత్సరం అన్నమాట. అందువల్ల చైత్రమాసంలో శుక్లపక్షంలో సూర్యోదయ వేళకు పాడ్యమి తిథి ఉన్నరోజును ఉగాదిగా నిర్ణయిస్తారు. ఉగ అంటే నక్షత్ర గమనం. దీనికి ప్రారంభమే ఉగాది అని అర్థం. బ్రహ్మకు పగలు అంటే మనుషుల లెక్కల ప్రకారం 432,00,00,000 సంవత్సరాలు. రాత్రి కూడా అంతే. అంటే బ్రహ్మకు ఒకరోజు అంటే 864,00,00,000 సంవత్సరాలన్నమాట. ఇలాంటివి 360 రోజులు పూర్తి చేస్తే ఆయనకు ఒక సంవత్సరం అయినట్లు లెక్క. అంటే 3 లక్షల 11 వేల 40 కోట్ల సంవత్సరాలన్నమాట. ఇలా వందేళ్లు బ్రహ్మ ఆయుర్దాయం. ఇప్పటివరకు ఆరుగురు బ్రహ్మలు సృష్టికార్యాలు ముగించారు. ఏడవ బ్రహ్మ ఇప్పుడు ద్వితీయపరార్థంలో ఉన్నాడు. అంటే ఇప్పుడు ఆయన వయస్సు 51 సంవత్సరాలన్నమాట. కలియుగం ప్రమాది నామ సంవత్సరం చైత్ర శుద్ధ పాడ్యమినాడు ప్రారంభమైంది. ఈ కల్పం ప్రారంభమై 197,29,49,114 సంవత్సరాలు పూర్తయింది. ఇప్పుడు మనం వైవస్వత మన్వంతరంలోని కలియుగంలో ఉన్నాం. ఇది ప్రారంభమై 5114 సంవత్సరాలైంది. ఉగాదినాడే బ్రహ్మ సృష్టిని ప్రారంభించాడని అంటారు. మహావిష్ణువు మత్స్యావతారము ధరించి సోమకుడిని సంహరించి వేదాలను రక్షించి బ్రహ్మకు అప్పగించిన రోజుకూడా ఇదేనని ప్రతీతి. శ్రీరాముడు, విక్రమాదిత్యుడు, శాలివాహనుడు పట్టాభిషిక్తుడైన రోజుకూడా ఉగాదే. వరాహమిహిరుడు పంచాగాన్ని జాతికి అంకితం చేసినది ఉగాదినాడే. మన పూర్వీకులైన ఋషులు మన బాగోగులు కోరి ఎంతో తపోనిష్టతో అనుభవ పూర్వకంగా, పరిశోధనల ద్వారా ఖగోళంలో అనేక నక్షత్రాలు ఉన్నా, ఒక నిర్దిష్టమైన కక్ష్యలో తిరుగుతూ భూమిపై ఏవైతే ఎక్కువ ప్రభావాన్ని చూపిస్తున్నాయో వాటిని మాత్రమే పరిగణలోకి తీసుకుని ఖగోళంలో ఉండే నక్షత్రాలు, గ్రహాలు భూమి మీద నివసించే మానవునిపై చూపే ప్రభావానికి అనుగుణంగా భారతీయ జ్యోతిష అధ్యయనం ద్వారా ఫలితాలను అంచనా వేసి శాస్త్ర పద్ధతులను, తగు జాగ్రత్త సూచనలు చేసారు. నూతన సంవత్సర ఆరంభం రోజున బ్రహ్మదేవున్ని ప్రార్థిస్తే సకల శుభాలు కలుగుతాయి. బ్రహ్మదేవున్ని ప్రార్థించే ఏకైక పండగ ఈ ఉగాదే. గౌరీ వ్రతము, సౌభాగ్య వ్రతాలు చేస్తారు. ప్రత్యేకించి విశ్వబ్రాహ్మణులు ఎంతో ఘనంగా నిర్వహించుకుంటారు. ఇల్లంతా శుభ్రపరచుకుని ఇంటికి, వ్యాపార సంస్థలకు సున్నాలు, రంగులు వేసుకుని చక్కగా రంగు రంగుల ముగ్గులతో అలంకరిస్తారు.

సంక్షోభంలోనూ... చంద్రబాబు సంక్షేమ బాట



ఇస్కా రాజేష్‌బాబు, 'సూర్య' అమరావతి బ్యూరో చీఫ్,
96520 39780

- అభివృద్ధి, సంక్షేమంలో రాజీ ఉండదన్న సందేశం
- నిరుద్యోగుల కోసం రూ. 1000 కోట్లు కేటాయింపు
- బడ్జెట్‌లో నిధుల కేటాయింపు సరే...విడుదల ఎలా?
- వచ్చే ఆర్థికానికి రూ. 2.49 లక్షలకోట్ల రుణ భారం
- ఐదేళ్లలో రెట్టింపు అయిన ఆంధ్రప్రదేశ్ బడ్జెట్



నవ్యాంధ్రలో ప్రస్తుతం ఉన్న సంక్షోభ పరిస్థితుల్లోనూ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని మరువలేదు. ఎన్ని కష్టాలున్నా ఎదురొడ్డి పథకాలను మరిం త సమర్థవంతంగా అమలుచేసేందుకు బడ్జెట్‌లో అన్ని వర్గాలకు సమ న్యాయం చేసి బడుగుల బాట పట్టింది. అప్పుల ఊబిలోకి జారుకుంటున్నామని తెలిసినా వెనకడుగు వేయకుండా సాహసోపేతంగా బడ్జెట్‌ను శాసనసభలో ప్రవేశపెట్టింది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వంతో సయోధ్య లేకున్నా..అక్కడి నుంచి రావాల్సిన నిధుల్లో కోత పడుతుందని తెలిసినా ధైర్యం చేసి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి రెట్టింపు బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. గోరు చుట్టుపై రోకటి పోటులా కేంద్రం నుంచి సహకారం లేకున్నా ప్రజలకు మేలు చేయాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుకు సాగుతుండడం విశేష ం. బీసీల సంక్షేమానికి రూ. 6,210 కోట్లు, పోలవరం ప్రాజెక్టుకు రూ. 9వేల కోట్లు, సాంఘీక సంక్షేమానికి రూ. 3,221కోట్లు, గిరిజన సంక్షేమానికి రూ. 4,176.61 కోట్లు కేటాయించి అన్ని వర్గాలకు భరోసా కల్పించారు...'

గత బడ్జెట్‌లకు ఈ బడ్జెట్‌కి పరిస్థితులు–నేపథ్యం చాలా వ్యత్యాసం ఉంది. ఒక ప్రత్యేక పరిస్తితిలో రాష్ట్ర బడ్జెట్‌ను శాసనసభలో ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు ప్రతిపాదించారు. కేంద్రం ఇచ్చినహామీలు నెరవేరకపోవడం, తగిన సహాయం రాష్ట్రానికి అందకపోవడంతో సమర్థవంతంగా వనరులను సమీకరించుకుంటూనే రాష్ట్ర ఆర్థిక స్థితిగతులను నిరాటంకంగా తీసుకువెళ్లే వ్యూహాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. అనేక ఆర్థిక ఒడిదుడుకుల మధ్య రూ. 1,91,063 కోట్ల రాష్ట్రబడ్జెట్‌ను సమర్పించడం సాధ్యమైన విషయం కాదు. దీనిలో రూ. 1,08,162 కోట్లు అభివృద్ధి వ్యయం కింద వెళుతుంటే ఆదాయంలో మాత్రం పన్నులు, సుంకాల రూపంలో రూ. 65,535 కోట్లు, కేంద్ర పన్నుల వాటా కింద రూ. 33,929 కోట్లు ఖజానాకు చేకూరుతుంది. విభజన సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ రాష్ట్రం ఉన్న వనరులను సమతుల్యం చేసుకుంటూ ఎటువంటి రాజీ లేకుండా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేసే ప్రయత్నం ఈ బడ్జెట్ ద్వారా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సారి కీలక అంశం 37 కొత్త పథకాలను ప్రకటించి వాటికి సరైన స్థాయిలో నిధులు కేటాయించడం. వీటిలో ముఖ్యంగా రూ. 575 కోట్లు ఇళ్ల స్థలాల భూ సమీకరణ కోసం కేటాయించడం, అంకుర పరిశ్రమలకు రూ. 100 కోట్లు, అన్న క్యాంటీన్లకు రూ. 200కోట్లు, ఆదరణ పథకం కింద రూ. 750 కోట్లు కేటాయించి అన్ని వర్గాలకు అండగా నిలవడంచేలా బడ్జెట్ రూపొందింది. తల్లి, పిల్లల పౌష్టికాహారం కోసం ప్రత్యేకంగా రూ. 360 కోట్లు, హిజ్రాల సంక్షేమానికి రూ. 20 కోట్లు కేటాయించి కీలకమైన వర్గాలను ఉపేక్షించలేమని రాష్ట్రప్రభుత్వం స్పష్టమైన సందేమిచ్చింది. నిరుద్యోగులకు బాసటగా ఉంటామంటూ బడ్జెట్‌లో రూ. 1000కోట్లతో భారీ కేటాయింపు చేసి నిబద్ధతను చాటుకుంది.

పెరగనున్న అప్పుల భారం

ఏటా రాబడుల కన్నాఖర్చులు పెరుగుతున్నాయి. ప్రభుత్వంఅప్పులపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఇవి కూడా అంచనాలను మించిపోతున్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరం చివరినాటికి రూ. 2,49,435 కోట్లకు ఈ అప్పుల భారం చేరుతుందని అంచనా వేశారు. ఎఫ్ఆర్‌బీఎం పరిమితిని దాటి రుణాలు సంపాదించే క్రమంలో కొత్త మార్గాలు అన్వేషిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అప్పులు చేస్తోంది. ఇందు కోసం కార్పొరేషన్లకు అప్పులు తీసుకునేందుకు మంత్రిమండలిలో ఆమోదం పొంది వాటి పరిమితిని పెంచి బ్యాంకుల నుంచి రుణాలు పొందుతోంది. ఆ రుణాలను పీడీ ఖాతాలకు రప్పిస్తూ అక్కడి నుంచి ప్రభుత్వం తీసుకుని వ్యయం చేస్తోంది. రాష్ట్ర అప్పులను స్థూల జాతీయోత్పత్తితో పోల్చి చూస్తుంటారు. ఆ రకంగా చూస్తే అప్పుల వాటా తగ్గుతూ, ఎగబాకుతూ వస్తోంది. 2014- 15లో ఇది 28.25 శాతానికి పరిమితం కాగా ఆ తరువాత 28.50 శాతానికి, 2016–17లో ఇది గరిష్టంగా 28.79 శాతానికి చేరింది. 2017–18లో సవరించిన అంచనాలను పరిశీలిస్తే మళ్లీ అప్పుల భారం స్థూల ఉత్పత్తితో పోలిస్తే కొంత తగ్గింది. అది 28.40 శాతానికి చేరింది. వచ్చే ఆర్థిక సంవత్సరం చివరి నాటికి మరికొంత పెరిగి 28.6శాతం వద్దకు చేరుతుందని ఆర్థిక శాఖ అంచనాలను రూపొందించింది.

సర్దుబాటు కాని రెవెన్యూ లోటు

ఆంధ్రప్రదేశ్ విభజన తరువాత రెవెన్యూ లోటును కేంద్రం భర్తీ చేయాల్సి ఉంది. 2014–15లో రాష్ట్రం రెవెన్యూ లోటును రూ. 16,079 కోట్లుగా లెక్కించి కేంద్రం భర్తీ చేయాలని కోరింది. ఈవిషయంలో ఇప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సరైన పొంతన లేదు. రాష్ట్రం ఏ ఆధారాలు చూపి అడుగుతున్నా ఇక్కడి నుంచి ఆర్థిక శాఖ అధికారులను పంపి చర్చలు జరిపినా ఫలితం రాలేదు. రాష్ట్రానికి సంబంధించి రావాల్సిన రెవెన్యూ రాబడులను పరిగణనలోకి తీసుకుని ఏర్పడిన లోటును భర్తీ చేస్తామని, పింఛన్లు, రుణమాఫీ, పీఆర్‌సీ బకాయిలతో తమకు సంబంధం లేదని కేంద్రం చెబుతోంది. అవరోధాలను అధిగమిస్తూ అడుగులేస్తున్న ఆంధ్రప్రదేశ్ పరిశ్రమలు, సేవా రంగాల్లో సానుకూల ఫలితాలు సాధిస్తోంది. తలసరి ఆదాయంలో మెరుగైన వృద్ధిని కనపరుస్తోంది. అసమానతలను తొలగించిప్రజలకు ఆరోగ్యం, సంపద, మెరుగైన మౌలిక సౌకర్యాలు కల్పించాల్సిన అవసరాన్ని 'సామాజిక ఆర్థిక గణన–2017–18' గుర్తు చేసింది. ఈ నివేదికను కూడా ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టింది. రంగాల వారీ ప్రాధాన్యంలో భాగంగా వ్యవసాయంలో కరవు నివారణ చర్యలను వివరించింది. సంక్షేమానికి ఏటా రూ. 60వేల కోట్లు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం ప్రతి కుటుంటానికి రూ. 10వేల ఆదాయం అందించే పథకాలను అమలు చేస్తున్న విషయాన్ని ప్రస్తావించింది. రాష్ట్ర తలసరి ఆదాయం 2015–16లో రూ. 1,07,276 కోట్లు కాగా 2016–17లో అది రూ. 1,23,664 కోట్లకు చేరింది. 2017–18 (అంచనా)లో రూ. 1,42,054 కోట్లుగా ఉంది.

ఐదేళ్లలో రెట్టింపు అయిన బడ్జెట్

ఆంధ్రప్రదేశ్ పునర్వవస్థీకరణ తరువాత కొత్త రాష్ట్రం అనేక ఆపసోపాలు పడుతూ ముందుకు సాగుతోంది. 2014–15లో నవ్యాంధ్రలో రూ. 1,11,824 కోట్ల బడ్జెట్ అంచనాతో కొత్త ప్రయాణం మొదలు కాగా 2018–19 ఆర్థిక సంవత్సరానికి ఈ మొత్తం రూ. 1,91,061 కోట్లకు చేరింది. అలానే 2018–19లో దాదాపు రూ. 5,235 కోట్ల మేర రెవెన్యూ మిగులు ఉంటుందని యనమల రామకృష్ణుడు అంచనా సమర్పించారు. రెవెన్యూ ఆదాయం 1.55లక్షల కోట్లు ఉంటుందని పేర్కొన్నారు. 2014–15లో బడ్జెట్ అంచనా రూ. 1,11,824 కోట్లు కాగా వాస్తవంగా రూ. 1,38,449.60 కోట్లు ఖర్చు చేశారు. 2015–16లో బడ్జెట్ అంచనా రూ. 1,13,048 కోట్లు కాగా వాస్తవంగా రూ. 1,49,434.96 కోట్లు ఖర్చు చేశారు. 2016–17లో బడ్జెట్ అంచనా రూ. 1,35,688.69 కోట్లు కాగా వాస్తవంగా రూ. 1,66,698.69 కోట్లు ఖర్చు చేశారు. 2017–18లో బడ్జెట్ అంచనా రూ. 1,56,999.39 కోట్లు కాగా వాస్తవంగా రూ. 1,59,822.25 కోట్లు ఖర్చు చేశారు. ప్రస్తుతం 2018–19 బడ్జెట్‌ను రూ. 1,91,063.60 కోట్లుగా సమర్పించారు.

సున్నితమైన సమస్యకు పరిష్కార మార్గం

11 నుంచి 50 సంవత్సరాల మధ్య వయసుగల మహిళలకు ఎదురయ్యే సున్నితమైన సమస్య రుతుస్రావం. అటువంటి సమయంలో తీసుకునే చర్యల విషయంలో చాలా మంది ఆర్థిక కారణాల వల్ల అనారోగ్యాన్ని పణంగా పెట్టాల్సిన పరిస్థితులను చూస్తున్నాం. ఈ సున్నితమైన సమస్యను దృష్టిలో పెట్టుకుని శానిటరీ నాప్‌కిన్స్‌ని డ్వాక్రా మహిళలు, ఇతర కౌమార బాలికలకు రాయితీలో అందచేయడానికి రూ. 100కోట్లు కేటాయించడం ఈ బడ్జెట్‌లో మరో ప్రత్యేకం. స్కూళ్లకు వెళ్లే ఆడపిల్లలకు కూడా ప్రత్యేకంగా రూ. 27కోట్లు కేటాయించి రాష్ట్ర ప్రభుత్వం చాలా ముఖ్య బాధ్యతను నెరవేర్చింది.

ప్రధాన శాఖలకు భారీ కేటాయింపులు.

వ్యవసాయ అనుబంధ రంగాలకు 2017–18లో రూ. 9090.91 కోట్లు కేటాయించగా ప్రస్తుతం 35.91వృద్ధిశాతంతో 2018–19లో రూ. 12,355.32 కోట్లు కేటాయించారు. గ్రామీణాభివృద్ధికి 2017–18లో రూ. 19,565.14 కోట్లు కేటాయించగా ప్రస్తుతం 6.39 వృద్ధి శాతంతో 2018–19లో రూ. 20,815.98 కోట్లు కేటాయించారు. నీటి పారుదల, వరద నియంత్రణకు 2017–18లో రూ. 12,770.26 కోట్లు కేటాయించగా ప్రస్తుతం 32.95 వృద్ధి శాతంతో 2018–19లో రూ. 16,978.23 కోట్లు కేటాయించారు. సాధారణ విద్యకు 2017–18లో రూ. 20,384.72 కోట్లు కేటాయించగా ప్రస్తుతం 18.65 వృద్ధి శాతంతో 2018–19లో రూ. 24,185.75 కోట్లు కేటాయించారు. సంక్షేమానికి 2017–18లో రూ. 11,361.52 కోట్లు కేటాయించగా ప్రస్తుతం 20.78 వృద్ధి శాతంతో 2018–19లో రూ. 13,722.98 కోట్లు కేటాయించారు. ఎంతో కీలకమైన వైద్య రంగానికి 2017–18లో రూ. 7020.631 కోట్లు కేటాయించగా ప్రస్తుతం 20.55 వృద్ధి శాతంతో 2018–19లో రూ. 8463.51 కోట్లు కేటాయించారు. అలాగే గ్రామీణ, పట్టణ గృహ నిర్మాణానికి 2018–19 బడ్జెట్‌లో రాష్ట్రప్రభుత్వం రూ. 3,679.53 కోట్లు కేటాయించింది. 2017–18 కేటాయింపులు రూ. 1,465.55 కోట్లు కంటే ఇది 152.36 శాతం అధికం. ఇతర ప్రభుత్వ శాఖలకంటే అత్యధికంగా పేదల గృహనిర్మాణం కోసం నిధులు కేటాయించారు.

రైతన్నకు అండగా ప్రభుత్వ కేటాయింపులు

రైతన్న అండగా వ్యవసాయ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి శాసనసభలో వ్యవసాయ బడ్జెట్‌ను రూ. 19,078 కోట్లుగా ప్రకటించారు. ఇందులో రెవెన్యూ వ్యయం రూ. 18,602 కోట్లు కాగా పెట్టుబడి వ్యయం రూ. 467. 38 కోట్లుగాఉంది. ప్రధాన కేటాయింపులను చూస్తే నాలుగో విడత రుణ ఉపశమనానికి రూ. 4,100కోట్లు, ఉచిత విద్యుత్ కోసం రూ. 2,500కోట్లు కేటాయించారు. ఈ కేటాయింపుల్లో వ్యవసాయ శాఖకు రూ. 7,607.49కోట్లు, ఉద్యానవన శాఖకు రూ. 1,517.88కోట్లు, పశుసంవర్థక శాఖకు రూ. 1,223.40కోట్లు, మత్స్యశాఖకు రూ. 386కోట్లు, మార్కెటింగ్‌కు రూ. 208.11 కోట్లు కేటాయించారు. మరో ఏడాదిలో వస్తున్న ఎన్నికలను, ప్రజల ఆశలను, ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకుని ఎవరికీ లేదనకుండా...కాదనకుండా అటు అభివృద్ధిని, ఇటు సంక్షేమాన్ని సమతుల్యం చేస్తూ సామాజిక బాధ్యతను విస్మరించకుండా ఆర్థిక పద్దును ప్రవేశపెట్టారు. ●

అగ్రకులాల ఆధిపత్యంలో సమిధలు బడుగులేనా?

నీలం ఉపేంద్ర, హైదారాబాద్
8341083544

- ఆది నుంచి చిన్నకులాలపై పెరుగుతున్న దాడులు
- రిజర్వేషన్లను సైతం స్వాహా చేస్తున్న నేతలు
- జనాభా దామాషాకు మంగళం పాడుతున్న పార్టీలు
- స్థానిక ఎన్నికలలో నిమ్న వర్గాలకు దక్కని పదవులు
- అమాయక మహిళలపైనా పెరిగిన అత్యాచారాలు



అగ్రకులాలు కింది కులాల ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, చాకలి, మంగలి, వడ్డెర తదితర చిన్న కులాలపై దాడులు చేసేవి. అఘా యిత్యాలకు పాల్పడేవి. ఇప్పుడు ధనాధిపత్యఅగ్రకులాలకు జనాధిక్యబీసీ కులాలు మున్నూరుకాపు, గౌడ, యాదవ, ముదిరాజ్ తోడయ్యి నోరులేని చిన్న కులాలపై దాడులకు తెగబడుతున్నాయి. గ్రామ బహిష్కరణలు చేస్తు స్థానిక సంస్థల్లో పదవులను తమ జనవాటాకు మించి పొందుతున్నారు. అసెంబ్లీ, పార్లమెంటు స్థానాల్లోనూ ఈ కులాలకు ప్రాతినిథ్యం ఉంది. 30 ఏళ్లుగా స్థానిక సంస్థల బీసీ రిజర్వేషన్లలో ఏబీసీడీ వర్గీకరణ లేకపోవడం వీటికి కలసి వచ్చింది. అందుకే ఈ కులాలవారు ఏనాడూ స్థానిక సంస్థల్లోని రిజర్వేషన్లను వర్గీకరించాలని డిమాండ్ చేయలేదు. అధికార రుచిని, పలుకుబడిని ఈ జనాధిక్య బీసీ కులాలు సంపాదించుకు న్నాయి. విద్యాపరంగా కూడా మెరుగైన స్థితిలో ఉండి ఉద్యోగస్వామ్యాన్ని పెంపొందించుకున్నాయి. వారసత్వకులసరుకు ఈ కులాలకు ధనాన్ని తెచ్చిపెడుతోంది. నిచ్చెనమెట్ల కుల వ్యవస్థ ఎలాగూ కింది కులాలపై సామాజిక ఆధిపత్యం, పెద్దరికం కల్పించింది. ఎన్నికల్లో అగ్రకుల, పాలక పార్టీలకు ఎక్కువ ఓట్లు కావాలి. కాబట్టే గ్రామాలలో ఆ పార్టీల ఏజెంట్లు (ధనాధిపత్య అగ్రకుల నేతలు) ఈ జనాధిక్య కులాలతో మిలాఖత్ అవుతున్నారు. ఈ క్రమమంతా జనాధిక్య బీసీ కులాలకు ఒకరకమైన ఆధిపత్యాన్ని, కుల అహంకారాన్ని కలుగచేసింది. ఈ నేపథ్యమే కిందికులాలపై అఘాయిత్యాలకు, దాడులకు దన్ను ఇస్తోంది. తెలంగాణలోని జనాధిక్య బీసీ కులాలు తమ జనాభా కంటే అధికంగా పదవులను అనుభవిస్తు న్నా యో అంకెల్లో చూద్దాం.

రాష్ట్రంలో మొత్తం జెడ్పీటీసీ స్థానాలు 441. బీసీ రిజర్వేషన్లు 29 శాతం. రిజర్వేషన్ల ప్రకారం బీసీలకు దక్కాల్సినవి కేవలం 128 స్థానాలు. కానీ, బీసీలు ఇప్పుడెన్ని పదవులను కలిగి ఉన్నాయో తెలుసా? 196 జెడ్పీటీసీ పదవులను బీసీలు అనుభవిస్తున్నారు. అంటే రిజర్వేషన్ కల్పించిన వాటి కంటే చాలా ఎక్కువస్థానాలను బీసీలు సొంతం చేసుకున్నారు. వాస్తవానికి చిన్న బీసీ కులాలేమో తమ జనాభా వాటా కంటే తక్కువ పదవులను చేజిక్కించుకోగలిగాయి. ఈ మిగులు పదవులన్నీ జనాధిక్య బీసీ కులాలు కొల్లగొట్టాయి. ఈ కొల్లగొట్టడానికి ఏమిటి ఆధారమంటే... ఇదిగో ఈ లెక్కలను చూడండి. 441 జెడ్పీటీసీల్లో మున్నూరుకాపులు 45, గౌడ సామాజిక వర్గం 37, యాదవులు 24, ముదిరాజ్‌లు 15, పద్మశాలిలు 16 స్థానాలను పొందారు. నిజానికి చాకలి జనాభా(సుమారు 6 శాతం)ను బట్టి ఈ కులానికి 25 మంది జెడ్పీటీసీలు ఉండాలి. కానీ, ఉన్నదికేవలం ఒక్కరు . చాకళ్లకు రావాల్సిన 24 పదవులు ఈ పెద్ద కులాలకు సంక్రమించి చిన్న కులాలపై దాడులు, అత్యా చారాలు చేస్తున్నాయి. ఎంపీటీసీ పదవుల్లోనూ అంతే. రాష్ట్రంలో మొత్తం ఎంపీటీసీ స్థానాలు 6,490. రిజర్వేషన్ల ప్రకారం బీసీలకు కేవలం 1,900 స్థానాలు దక్కాలి. కానీ, బీసీలు అనుభవిస్తున్న పదవులు సంఖ్య 3,267. వాటిల్లో గౌడ్‌లు 733, యాదవులు467, మున్నూ రుకావు457, ముది రాజ్‌లు 418. మరి చాకళ్లు కేవలం 73 ఎంపీటీసీ స్థానాలే దక్కించుకున్నారు. ఈ భారీ వ్యత్యాసం, ఈ భారీ మిగులు పదవులు చాలవా... పెద్ద కులాలకు కుల అహంకారం పెరగడానికి, ఆధిపత్యం చెలాయించడానికి, దాడులకు పాల్పడడానికి? ఈ వ్యత్యాసం సుస్పష్టం. రాజకీయాధిపత్యాన్ని కొనసా గించడానికి.. ఈ మిగులు పదవులు చాలవా? ఆర్థిక, సామాజిక పెత్తనాన్ని చాటుకోవడానికి? ఇక సర్పంచ్‌ల స్థానాలను పరిశీలిస్తే... తెలంగాణ రాష్ట్రంలో మొత్తం సర్పంచ్‌ల సంఖ్య 8,692. రిజర్వేషన్ల ప్రకారం బీసీలకు దక్కాల్సినవి ఎన్నంటే.. కేవలం 2,800.కానీ, బీసీలు అను భవిస్తున్న సర్పంచ్ పద వుల సంఖ్య 4,141. వీటిల్లో గౌడ్లలు 818, ముదిరాజ్‌లు 625, మున్నూరు కావు 549, యాదవులు 560 పదవులు అనుభవిస్తున్నారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను వర్గీకరిస్తే వచ్చే వాటా కంటే అధికంగా ఆయా పదవును ఈ జనాధిక్య బీసీ కులాలు కొల్లగొడుతున్నట్లు ఈ లెక్కలు చెప్పడం లేదా? ఇప్పుడు చెప్పండి? గ్రామాల్లో జనాధిక్య బీసీ కులాలు ప్రదర్శించేది కుల దురహంకారం కాదనగలరా? ఈ జనాధిక్య కుల దురహంకారం, అగ్రకుల దురహంకారాన్ని మరిపించేవిధంగా దాడులు, గ్రామ బహిష్కరణలు, అత్యాచారాలు చేసిన ఉదం తాలు కోకొల్లలు. అంబేడ్కర్, ఫూలే ఆలోచనల వెలుగులో కొత్త కుల విముక్తి సిద్ధాంతాన్ని, కొత్త సూత్రాలను కనిపెట్టండి. మీరు ఇప్పటికే పుస్తకాల్లో చదువుకొని, ఒకదాని నుంచి మరో దానిలోకి ఎత్తి రాసుకొని రూపొందించుకున్న సిద్ధాంతంలో ఇరుక్కుపోవడానికి మేము సిద్ధంగా లేము. మా సామాజిక స్థితిగతులను, నిర్దిష్ట పరిస్థితులను నిర్దిష్టంగా విశ్లేషించి కొత్త సిద్ధాంతం రాయండి. హెచ్చుతగ్గులు లేని, కలిమి, లేమి లేని, వెక్కువోడు, తక్కువోడు లేని మరో ప్రపంచానికి దారులు వేయండి.

చరిత్రలో ఈరోజు


మార్చి 18

1922: మాధవపెద్ది సత్యం, తెలుగు సినిమా నేపథ్య గాయకుడు, జననం
1689: శంభాజీ, మరాఠా సామ్రాజ్య స్థాపకుడైన ఛత్రపతి శివాజీ పెద్ద కుమారుడు, మరణం.
1955: అలెగ్జాండర్ ఫ్లెమింగ్, పెన్సిలిన్ ‌ను కనిపెట్టిన శాస్త్రవేత్త, మరణం.
1970: నేదునూరి గంగాధరం, ప్రముఖ తెలుగు రచయిత, మరణం.
1979: రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, ప్రముఖ తెలుగు సాహితీకారులు, మరణం.
2009: కె.ఎన్.వై.పతంజలి, ప్రముఖ తెలుగు రచయిత, మరణం.
2013: శ్రీపాద పినాకపాణి, శాస్త్రీయ సంగీత విద్వాంసుడు, వైద్య రంగంలో నిష్ణాతుడు, మరణం.

శంభాజీ


శంభాజీ రాజే భోంస్లే మే 18, 1657న జన్మించి, మార్చి 18, 1689న మరణించాడు. మరాఠా సామ్రాజ్య స్థాపకుడైన ఛత్రపతి శివాజీ పెద్ద కుమారుడు. శంభాజీ అతని సలహాదారు కవికలష్‌లను ఔరంగజేబు సేనాని ముకర్రబ్‌ఖాన్ సంగమేశ్వర్ వద్ద కుట్రచేసి బంధించాడు. మరాఠా సామ్రాజ్యంలోని కోటలన్నిటినీ తనకు స్వాధీనం చేసి, ఇస్లాంలోకి మారితే శంభాజీని వదిలేస్తానని బేరం పెట్టాడు మొఘల్ చక్రవర్తి. కనుగుడ్లు, గోళ్లూ పీకారు. బతికుండగానే చర్మం వలిచారు. ఏం చేసినా మతం మారననీ ఒక్కకోటనూ స్వాధీనం చేయననీ ధైర్యంగా చెప్పాడు. మరణించిన శంభాజీ శవాన్ని ముక్కలుముక్కలు చేసి నదిలో పారేయమన్నాడు. అక్కడికి దగ్గరలోని వధు గ్రామస్థులు నదిలోకి దిగి శంభాజీ శరీర ఖండాలను వెదికి దొరికిన వాటిని అతికించి ఘనంగా అంతిమసంస్కారాలు జరిపించారు.

అలెగ్జాండర్ ఫ్లెమింగ్



పెన్సిలిన్ ఇంజక్షన్ పేరు విననివారు ఉండరు. సర్వ రోగ నివారిణిగా పెన్సిలిన్ను ఇప్పటికీ తిరుగేలేదు. అటువంటి పెన్సిలిన్‌ను కనుగొన్న వాడు అలెగ్జాండర్ ఫ్లెమింగ్. ఆయన ఆగష్టు 6, 1881న జన్మించి, మార్చి 18, 1955న మరణించాడు. 1928లో ఈ బాక్టీరియాలజిస్టు పెన్సిలిన్ కనుక్కొని లోకానికి గొప్ప ఉపకారం చేసిన వాడయ్యాడు. అలెగ్జాండర్ ఫ్లెమింగ్ స్కాటిష్ జీవశాస్త్రవేత్త, వైద్య రసాయన శాస్త్రవేత్త (ఫార్మకాలగిస్ట్). ఈయన కనిపెట్టిన ఎంజైము లైసోజైము (1923), అంటి బయోటిక్ పెన్సిలిన్ (1928)లు ముఖ్యమైనవి. 1945లో వైద్య శాస్త్రానికి నోబెల్ బహుమానం ఈ పెన్సిలిన్ కనుగొన్నందుకు ఫ్లెమింగ్‌తో పాటు హోవార్డ్ ఫ్లోరే, ఎర్నెస్ట్ చెయిన్ అనే మరో ఇద్దరు శాస్త్రవేత్తలకు కూడా ఇచ్చారు. 1999లో టైమ్ మ్యాగజైన్ 20వ శతాబ్దపు 100 మంది ప్రముఖ వ్యక్తులలో ఒకడిగా గుర్తించింది.

రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ



అనంతకృష్ణశర్మ జనవరి 23, 1893న జన్మించి, మార్చి 18, 1979న మరణించాడు. తెలుగు సాహిత్యపు ఆధునిక వచన శైలీ నిర్మాతలలో అగ్రేసరుడు. విమర్శనా రీతులలో వీరు మార్గదర్శకుడు. అన్నమాచార్యులు వారి కృతులను–కొన్ని వందల కృతులను– ఆయన స్వరపరచి తెలుగువారికి అందించాడు. వేమనపై సాధికారమైన విమర్శ గ్రంధాన్ని వెలువరించాడు. వేమన గురించి శర్మగారు తమ వేమనోపన్యాసాలలో అనేక విషయాలు ఆవిష్కరించాడు. నిగమశర్మ అక్క, నాచన సోముని నవీన గుణములు, తిక్కన తీర్చిన సీతమ్మ, రాయలనాటి రసికత అనే ఆయన వ్యాసాలు బాగా ప్రసిద్ధమైనవి. కట్టమంచి రామలింగారెడ్డి గారితో పరిచయం కలిగి, వారి ఆహ్వానం మీద 1912లో మొట్టమొదటిసారిగా ఏర్పరచిన తెలుగు పండిత పదవిని అలంకరించాడు. అప్పటి నుండి తెలుగులో రచనా వ్యాసంగాలను మొదలుపెట్టాడు. కాళిదాసు రచించిన రఘువంశం ఆంధ్రీకరించాడు. ఆయన తాళ్లపాకసంకీర్తనలను పరిశీలించి కొన్నింటికి స్వరకల్పన గావించి వాటి గొప్పతనాన్ని చాటాడు. రేడియోకు ఆకాశవాణియని పేరు పెట్టినది ఆయనే.



ఉబెర్, ఓలా డ్రైవర్ల సమ్మె సైరన్

నేటి నుంచి సమ్మె జరిగే సూచన

ముంబయి : ప్రముఖ ట్యాక్సీ సేవల సంస్థలైన ఉబెర్, ఓలాలకు చెందిన డ్రైవర్లు ఆదివారం నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరిస్తున్నారు. ఆదివారం (18) అర్ధరాత్రి నుంచి తాము సమ్మె చేస్తామని, ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకోవాలని వారు సూచిస్తున్నారు. వారు సమ్మెకు దిగితే కీలక మైన ముంబయి, ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్, పుణె నగరాల్లో తీవ్ర ప్రభావం కానరావచ్చు. ఓలా, ఉబెర్‌లు డ్రైవర్లకు పెద్ద పెద్ద హామీలు ఇస్తున్నాయని, కానీ కంపెనీలు సరిగ్గా నిర్వహించకపోవడం వల్ల డ్రైవర్లు తమ పెట్టుబడిని పూడ్చుకోలేకపోతున్నారని ముంబయిలోని మహారాష్ట్ర నవనిర్మాణ్ వాహతుక్ సేన నిర్వాహకులు తెలియజేశారు. డ్రైవర్లు 5 నుంచి 7 లక్షల రూపాయలు పెట్టుబడిగా పెడుతున్నారని, కానీ నెలకు వారు ఊహించిన స్థాయి కంటే చాలా తక్కువ మొత్తం రాబడిగా వస్తోందని, ట్యాక్సీ సంస్థల నిర్వహణ లోపం వల్లే ఇలా జరుగుతోందని వారు వాపోయారు. ట్యాక్సీ కంపెనీలు తమ వాహనాలకే ముందు ప్రాధాన్యం ఇస్తున్నాయని వారు ఆరోపించారు.ఒక్క ముంబయిలోనే ఈ కంపెనీలను 45 వేలకు పైగా క్యాబ్‌లు ఉన్నాయి. అయితే, వ్యాపారంలో ఇబ్బం దుల వల్ల సంఖ్యలో 20 శాతం క్యాబ్‌లు తగ్గిపోయాయని వారు చెబుతున్నారు. తమ డిమాండ్లను పరిష్కరించకపోతే నిరవధికంగా సమ్మె చేస్తామని వారు హెచ్చరించారు. దీనిపై ఉబెర్, ఓలా స్పందించలేదు.

బిజినెస్

ఎయిర్‌సెల్ కస్టమర్ల కోసం

ఎయిర్‌టెల్, వొడాఫోన్ పోటాపోటీ



ముంబయి : తీవ్ర అప్పుల్లో కూరుకుపోయిన టెలికమ్ సంస్థ ఎయిర్‌సెల్ ఇటీవల దివాలా పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. దీనితో ఆ కస్టమర్లు ఇప్పుడు వేరే నెట్‌వర్క్‌కు మారుతున్నారు. అయితే, వారి కోసం రెండు ప్రముఖ టెలికమ్ సంస్థలు పోటీ పడుతున్నాయి. 'మా నెట్‌వర్క్‌కు అంటే కాదు మా నెట్‌వర్క్‌కే ఎక్కువ మంది వచ్చారు' అని అటు ఎయిర్‌టెల్, ఇటు వొడాఫోన్ చెబుతున్నాయి. గత రెండు వారాల్లో దేశవ్యాప్తంగా 50 శాతానికి పైగా ఎయిర్‌సెల్ కస్టమర్లు తమ నెట్‌వర్క్‌కు పోర్ట్ అయినట్లు ఎయిర్‌టెల్ ప్రకటించింది. 'చాలా మంది ఎయిర్‌సెల్ కస్టమర్లు ఎయిర్‌టెల్‌ను ఎంచుకోవడం సంతోషకరమైన విషయం. మా వేగవంతమైన నెట్‌వర్క్ సదుపాయాలకు, డిజిటల్ సేవలకు ఇదే నిదర్శనం' అని ఎయిర్‌టెల్ సిఒఒ అజయ్ పూరి మీడియాతో అన్నారు. మరొక వైపు ఎయిర్‌టెల్‌కు పోటీగా వస్తున్న వొడాఫోన్ కూడా ఇదే చెబుతోంది. ఎయిర్‌సెల్ వినియోగదారులు వొడాఫోన్ వైపు మారుతున్నారని, ఇప్పటికే గత రెండు వారాల్లో 10 లక్షల మందికి పైగా వొడాఫోన్ నెట్‌వర్క్‌కు మళ్లారని సంస్థ తెలియజేసింది.

హువాయి పి20లైట్ విడుదల ఈ నెలలోనే



న్యూఢిల్లీ : చైనా మొబైల్ తయారీ సంస్థ హువాయి మరొక కొత్త స్మార్ట్ ఫోన్‌ను త్వరలోనే ఆవిష్కరించనున్నది. పి 20 సీరీస్‌లో పి20 లైట్‌ను ఈ నెల 27న విడుదల చేసేందుకు సంస్థ సన్నద్ధం అవుతోంది. పాత వాటి తరహాలోనే తాజా స్మార్ట్ ఫోన్ కూడా ఉండబోతోందని అంచనా. పారిస్‌లో నిర్వహించనున్న ఈ లాంచింగ్ ఈవెంట్‌లో పి20, పి 20 ప్రో స్మార్ట్ ఫోన్లను కూడా లాంచ్ అందుబాటులోకి తీసుకువస్తోంది. వెబ్‌సైట్ సమాచారం ఈ మొబైల్ ధర 30 వేల రూపాయలుగా ఉండనున్నది. పి20 లైట్ విశిష్టతలు : 5.84 అంగుళాల పూర్తి హెచ్‌డి డిస్‌ప్లే, 1080/2280 పిక్సల్స్ రిజల్యూషన్, కిరిన్ 659 ప్రాసెసర్, ఆండ్రాయిడ్ 8.0 4జిబి ర్యామ్ 64 జిబి స్టోరేజ్, 16+2 ఎంపి రియర్ డబుల్ కెమెరా, 3000 ఎంఎహెచ్ బ్యాటరీ.

హెచ్‌టిసి నుంచి యూ12 ప్లస్ స్మార్ట్ ఫోన్



న్యూఢిల్లీ : హెచ్‌టిసి తన కొత్త స్మార్ట్ ఫోన్ యు12 ప్లస్‌ను త్వరలో విడుదల చేయనున్నది. దీని ధర వివరాలను సంస్థ ఇంకా వెల్లడించలేదు. ఇందులో 6 అంగుళల భారీ ఫుల్ వ్యూ డిస్‌ప్లే, ఆక్టాకోర్ స్నాప్‌డ్రాగన్ 845 పవర్‌ఫుల్ ప్రాసెసర్, 6 జిబి ర్యామ్, వెనుక, ముందు భాగాల్లో రెండేసి కెమెరాలు, ఐపి 68 వాటర్, డస్ట్ రెసిస్టెన్స్ వంటి అద్భుతమైన ఫీచర్లు ఉన్నాయి. హెచ్‌టిసి యు12 ప్లస్ ఫీచర్లు : 6 అంగుళాల క్వాడ్ హెచ్‌డి ప్లస్ సూపర్ ఎల్‌సిడి 6 డిస్‌ప్లే, 2880/1440 పిక్సల్స్ స్క్రీన్ రిజల్యూషన్, ఆక్టాకోర్ క్వాల్‌కాం స్నాప్‌డ్రాగన్ 845 ప్రాసెసర్, 6 జిబి ర్యామ్, 64/128 జిబి స్టోరేజ్, ఆండ్రాయిడ్ 8.0 ఓరియో, హైబ్రిడ్ డ్యుయల్ సిమ్, 12, 16 మెగాపిక్సల్ డ్యుయల్ బ్యాక్ కెమెరాలు, 8 మెగాపిక్సల్ డ్యుయల్ సెల్ఫీ కెమెరాలు, ఐపి 68 వాటర్, డస్ట్ రెసిస్టెన్స్, ఫింగర్‌ప్రింట్ సెన్సార్, యుఎస్‌బి టైప్ సి, 4జి వీవోఎల్‌టిఇ, డ్యుయల్ బ్యాండ్ వైఫై, బ్లూటూత్ 5.0, ఎన్ఎఫ్‌సి, 3420 ఎంఎహెచ్ బ్యాటరీ, ఫాస్ట్ చార్జింగ్.

26న విడుదల కానున్న ఒప్పో ఎఫ్7 స్మార్ట్ ఫోన్



న్యూఢిల్లీ : చైనాకు చెందిన మొబైల్స్ తయారీ సంస్థ ఒప్పో తన కొత్త స్మార్ట్ ఫోన్ ఒప్పో ఎఫ్7ను ఈ నెల 26న విడుదల చేయనున్నది. ఆ ఫోన్‌లో యూజర్లకు పలు అద్భుతమైన ఫీచర్లు లభించనున్నాయి. ఒప్పో ఎఫ్5 తరువాత ఎఫ్ సీరీస్‌లో వస్తున్న లేటెస్ట్ ఫోన్ ఇదే కావడం విశేషం. ఇక ఆ ఫోన్‌లో 6.2 అంగుళాల పూర్తి హెచ్‌డి ప్లస్ డిస్‌ప్లే, ముందు భాగంలో 25 మెగాపిక్సల్ సెల్ఫీ కెమెరా, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీ, సెల్ఫీలకు బ్యూటీ మోడ్, రియల్ టైమ్ హెచ్‌డిఆర్, ఎఆర్ స్టిక్కర్స్ తదితర ఫీచర్లు పొందుపరచనున్నట్లు సంస్థ తెలియజేసింది. కాగా ఈ ఫోన్‌కు చెందిన స్పెసిఫికేషన్లు పూర్తి స్థాయిలో త్వరలో తెలిసే అవకాశం ఉన్నది.

మొబైల్ ఫోన్ బిల్లులు ఇక తగ్గకపోవచ్చు




ముంబయి : ఒకప్పుడు మొబైల్ ఫోన్ బిల్లు అంటే వామ్మో అనేవారు. ఇక ఏ డేటా ఆఫర్ గానీ వేసుకోవాలంటే బిల్లు బాదుడే. కానీ గత కొన్ని నెలలుగా ఆ పరిస్థితి మారి పోయింది. రిలయన్స్ జియో ప్రవేశించి టెలికమ్ రంగంలో భారీ ప్రకంపనలే సృష్టించింది. ఈ దెబ్బతో ఫోన్ బిల్లులు దిగివచ్చాయి. గత ఆరు నెలల కాలంలో నెలవారీ మొబైల్ బిల్లులు సగటున 30 నుంచి 40 శాతానికి పడిపోయాయి. అయితే, ఇకపై అలా ఉండకపోయే సూచనలు కనిపిస్తున్నాయి. భవిష్యత్‌లో ఫోన్ బిల్లులు మరింత తగ్గే అవకాశాలు కనిపించడం లేదని కౌంటర్‌పాయింట్ టెక్నాలజీ మార్కెట్ రీసర్చ్ తెలిపింది. జియో ప్రవేశం తరువాత ఎయిర్‌టెల్, ఐడియా సహా పలు టెలికమ్ సంస్థలు టారిఫ్‌లను తగ్గించాయి. దీనితో సామాన్య వినియోగదారుడికి ధరలు అందుబాటులోకి వచ్చాయి. కస్టమర్లను ఆకట్టుకునేందుకు టెలికమ్ సంస్థలు తక్కువ ధరలోనే డేటా ఆఫర్లను అందజేస్తున్నాయి. ఇక కొన్ని టెలికమ్ సంస్థలైతే మొబైల్ తయారీ సంస్థలతో పొత్తు పెట్టుకుని క్యాష్‌బ్యాక్ ఆఫర్లను కూడా ప్రకటించాయి. అయితే, దీని వల్ల టెలికమ్ సంస్థల ఆదాయానికి భారీగా గండి పడినట్లు తెలుస్తోంది. 2016 జూన్ నుంచి 2017 డిసెంబర్ మధ్య టెలికమ్ కంపెనీలు దాదాపు9.5 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని కోల్పోయాయని ఇటీవల ఒక నివేదికలో తేలింది.

ఈ కారణాలతో భవిష్యత్‌లో టారిఫ్‌లను తగ్గించకూడదని టెలికమ్ సంస్థలు నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అయితే, కస్టమర్ల సౌలభ్యం కోసం ఉన్న టారిఫ్‌లలోనే ఎక్కువ డేటా, మరిన్ని ఉచిత సదుపాయాలను అందించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది.

ఏపీలో గ్రామీణ అంకుర వాణిజ్య వ్యవస్థాపన

- సామాజిక శిక్షణా శిబిరాల నిర్వహణకు సన్నాహాలు
- సెర్ప్ ఆధ్వర్యంలో కార్యాచరణ ప్రారంభం
- మండలాల్లో బిజినెస్ మేనేజర్ల నియామకం





వెలగపూడి, సూర్య ప్రత్యేక ప్రతినిధి : ఇప్పటి వరకు ప్రభుత్వ పథకాలకు కేవలం లబ్ధిదారులుగా ఉన్న గ్రామీణ వర్గాలను ఇక ముందు అంకుర వాణిజ్య వ్యవస్థాపకులుగా చూడబోతున్నాం. కేంద్ర గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వశాఖ పరిధిలో పనిచేసే నేషనల్ లైవ్లీహుడ్ మిషన్ ఈ మేరకు ఇప్పటికే రాష్ట్రాలకు ఇందుకు అవసరమైన మార్గదర్శకాలు పంపింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో దీని అమలుకు పేదరిక నిర్మూలనా సంస్థ (సెర్ప్) కార్యాచరణ ప్రారంభించింది. గ్రామ స్థాయిలో విస్తృతమైన స్వయం సహాయ సంఘాల సమైఖ్య సహకారం (నెట్ వర్క్) దీనికి ఉండడంతో కొంతకాలంగా రాష్ట్రంలో అమలవుతున్న సూక్ష్మస్థాయి నిర్వహణ అవసరమైన పథకాలైన పెన్షన్లు, కార్మిక బీమా వంటివి సెర్ప్ అమలు చేయడం తెలిసిందే. అయితే గ్రామీణ నిరుద్యోగితను తగ్గించడం లక్ష్యంగా అమలు చేయబోతున్న ఈ పథకం గ్రామీణ అభివఎద్ధిలో మరొక ముందడుగు అవుతుంది. ఈ నూతన చొరవతో అంకుర వాణిజ్య వ్యవస్థాపన కేవలం విదేశీ సాంకేతిక విద్యానేపథ్యం వున్న నగర యువతకు మాత్రమే అన్న అభిప్రాయం నుంచి మనల్ని బయటకు తేనుంది. నేషనల్ సాంపిల్ సర్వే ఆర్గనైజేషన్ 2011 నివేదిక ప్రకారం ప్రస్తుతం గ్రామీణ యువతలో సగం మంది స్వయం ఉపాధి రంగంలో ఉన్నారు. సరాసరి 15-59 ఏళ్ల మధ్య వయసున్నవీరిలో 53శాతం మంది పురుషులు 55.8శాతం స్త్రీలు. అయితే ఇప్పటికీ 58శాతం మంది వ్యవసాయం ప్రధాన జీవనోపాధిగా వున్నారు. అయితే ఇందులో వుండే ఎగుడుదిగుళ్ళు మనకు తెలిసిందే, ఇక భూవసతి లేని వారికీ ఎటువంటి భరోసా లేని పరిస్థితి. పని ఏదయినా వీరిలో 90 శాతం మంది అసంఘటిత రంగంలోనే ఉన్నారు. ఈ పరిస్థితుల్లో ఒక కుటుంబంలో వున్నవారు 3-4 విధాలుగా జీవనోపాధులను ఎంచుకోవాల్సి ఉంటుంది. అయితే వాటిలో వ్యవసాయేతర రంగాల్లో ఉపాధి వెతుక్కుంటున్న వారికీ ఆయా రంగాలకు సంబంధించిన వ్యాపార మెళకువలు, మార్కెట్ గురించిన అవగాహన, ఎంచుకున్న రంగం గురించి లోతైన జ్ఞానం, జమాఖర్చులు, అవసరమైన ఆర్థిక ఆసరా లేక వారు నిలదొక్కుకోవడం కష్టమవుతోంది. ఈ నేపథ్యంలో గ్రామీణ అంకుర వాణిజ్య వ్యవస్థాపన అనే సరికొత్త ఆలోచనకు ప్రభుత్వం పూనుకుంది. ఇందుకోసం సెర్ప్ ఇప్పటికే తనకున్న గ్రామ, మండల, జిల్లా స్థాయి సంఘ సమాఖ్య నిర్మాణాల ద్వార ముందుగ శిక్షణా తరగతుల నిర్వహణకు కార్యాచరణ ఆరంభించింది. ఇందు కోసం మండలాల్లో బిజినెస్ మేనేజర్లను నియమిస్తున్నారు.

ఈ కార్యాచరణ ఇలా: స్వయం సహాయ సంఘ సభ్యులతో గ్రామీణ అంకుర వాణిజ్య వ్యవస్థాపన కోసం నియమించిన సామాజిక శిక్షణా ట్రెయినర్ ప్రతి రోజు తమకు కేటాయించిన గ్రామైఖ్య సంఘాలను సందర్శించి వారితో కనీసం రోజులో సగం సేవ గ్రామీణ అర్థికత వృద్ధి. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాల్సిన ఆవశ్యకత గురించి సమగ్ర అవగాహన కలిగిస్తారు. సామాజిక శిక్షణా ట్రైనర్ ప్రతి గ్రామ సంఘంలోనూ ఒక రోజు గ్రామీణ అంకుర వాణిజ్య కార్యక్రమం గురించి అవగాహన కలిగించాలి. గ్రామైఖ్య సంఘాలు సబ్ కమిటీలు కోసం గ్రామీణ అంకుర వాణిజ్య వ్యవస్థాపన. అందుకు గ్రామ సంఘాలకు సామాజిక శిక్షణ శిబిరాలు నిర్వహస్తారు. గ్రామీణ అంకుర వాణిజ్య వ్యవస్థాపన కోసం నియమించిన సామాజిక శిక్షణా ట్రైనర్ ప్రతి గ్రామ సంఘంలోనూ ఒక రోజు గ్రామీణ అంకుర వాణిజ్య కార్యక్రమం గురించి అవగాహన కలిగిస్తారు. ఆసక్తి వ్యక్తీకరించిన స్వయం సహాయ సంఘ మహిళలకు, వాణిజ్య వ్యవస్థాపన చేయాలనుకునే వ్యక్తులకు, ఎంటర్ ప్రెన్యూర్ కావాలనుకునే వారికి ఉండవలసిన లక్షణాలు, వారి క్రియాశీలత ఎలా వుండాలి అనే అంశం మీద ఒక సమావేశం నిర్వహిస్తారు. ఇందులో స్వయం సహాయ సంఘ మహిళల్లో అంకుర వాణిజ్య వ్యవస్థాపన కొరకు అనువైన వారిని గుర్తిస్తారు. బ్లాక్ రిసోర్స్ సెంటర్ సబ్ కమిటీ ట్రెయినింగ్ లో ఒక బ్లాక్ లో వున్న అన్ని మండల సమాఖ్యల ఆఫీస్ బేరర్లు వుంటారు. వీరికి ఈ ప్రోగ్రాం ప్రధాన గురువు (మెంటార్) బ్లాక్ ప్రాజెక్ట్ మేనేజర్ రెండు రోజులు పాటు బ్లాక్ రిసోర్స్ సెంటర్ లో శిక్షణ ఇస్తారు. అంకుర వాణిజ్య వ్యవస్థాపన కొరకు సాధారణ అవగాహన సదస్సు. ఒక వాణిజ్య వ్యవస్థాపన చేయాలనుకునే వ్యక్తులకు ఎంటర్ ప్రెన్యూర్ కావాలనుకునే వారికి, అందుకు అవసరమైన ప్రతిభా పాటవాలను ఏ విధంగా సంతరించుకోవాలో ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని వారి వారి గ్రామాల్లోనే నిర్వహిస్తారు. సాఫ్ట్ స్కిల్స్ లో శిక్షణా కార్యక్రమం. ఒక వాణిజ్య వ్యవస్థాపన చేసి ఎంటర్ ప్రెన్యూర్ కావాలనుకునే వారు ఇతరులను కలిసినప్పుడు వారితో మన సంభాషణ ఎలా వుండాలి, మన దేహ బాష, శైలి, విషయ స్పష్టత, మర్యాద, చెప్పాలనుకునే విషయంలో క్లుప్తత, ఇటువంటి మృదు నైపుణ్యాలను మెరుగుపర్చుకోవడంలో బ్లాక్ రిసోర్స్ సెంటర్ లో శిక్షణ ఇస్తారు. వాణిజ్య వ్యవస్థాపన ఆలోచన ఆచరణ మధ్య వాస్తవికత అంచనా. అంకుర వాణిజ్య వ్యవస్థాపన కోసం సభ్యురాలి వాణిజ్య వ్యవస్థాపన ఆలోచనను క్షేత్ర స్థాయి వాస్తవికతతో సరి చూసి ఆచరణలో వున్న సాధ్యాసాద్యాలను అంచనా వేయడానికి గాను వారి కార్య క్షేత్రాన్ని ఒక రోజు సందర్శిస్తారు. ప్రతిపాదిత ఆలోచన ఎంతవరకు సాధ్యమో చూస్తారు. ఇందుకు ఒక్కొక్క అభ్యర్ధికి ఒక రోజు చొప్పున కేటాయిస్తారు. వాణిజ్య ప్రణాళిక తయారుచేయడం, అభ్యర్ధి వాణిజ్య వ్యవస్థాపన ప్రతిపాదన కోసం వ్యాపార ప్రణాళిక సిద్దం చేయాలి.


ఔత్సహిక అంకుర వాణిజ్య వేత్తలకు చేయూత: వారికి వాణిజ్య వ్యవస్థాపన కొరకు అవసరమైన సహకారాన్ని సామాజిక శిక్షణా ట్రెయినర్ అందిస్తారు. వారికి రుణం మంజూరు, పంచాయతి లేదా ఇతర ప్రభుత్వ కార్యాలయాలు నుంచి అవసరమైన అనుమతులు, రిజిస్ట్రేషన్ కొరకు అవసరమైన సర్టిఫికెట్లు ఇటువంటి ప్రాధమిక దశ పనులన్నిటిలో చేయూత ఇస్తారు. వ్యాపార నిర్వహణ లో శిక్షణ. ఔత్సహిక అంకుర వాణిజ్య వేత్తలకు వారి వాణిజ్య వ్యవస్థాపన కొరకు అవసరమైన వ్యాపార నిర్వహణ సంబధమైన శిక్షణను రెండు రోజులు పాటు వారి గ్రామంలోనే సామాజిక శిక్షణా ట్రెయినర్ అందిస్తారు. అందులో రికార్డుల నిర్వహణ, మార్కెటింగ్, ప్రచారం వంటి అంశాలు ఉంటాయి. మార్కెటింగ్ కొరకు గొలుసు సంబంధాలు. సామాజిక శిక్షణా ట్రెయినర్ అంకుర వాణిజ్య వేత్త వ్యాపార నిర్వహణ కొరకు అవసరమైన మార్కెట్ గొలుసు సంబంధాలు ఏర్పడే విధంగా చూడాలి.

గ్రామ సంఘానికి నెల నెలా 48 నెలల పాటు వివరణ: ఆ గ్రామంలో వున్న ఔత్సహిక అంకుర వాణిజ్య వేత్తల వ్యవస్థాపక పురోగతి ఏ విధంగా ఉన్నదీ ఇందు కోసం అక్కడ పని చేస్తున్న సామాజిక శిక్షణా ట్రెయినర్, ప్రతి నెలా గ్రామ సంఘానికి తెలియచేస్తారు. ఈ గ్రామీణ అంకుర వాణిజ్య కార్యక్రమం పురోగతి ఇలా 48 నెలల పాటు ఎప్పటికప్పుడు గ్రామ సంఘానికి తెలియచేస్తారు. బ్లాక్ రిసోర్స్ సెంటర్ కు నెల నెలా 48 నెలల పాటు వివరణ. ఆ బ్లాక్ లో వున్న ఔత్సహిక అంకుర వాణిజ్య వేత్తల వ్యవస్థాపక పురోగతి ఏ విధంగా ఉన్నదీ ఇందు కోసం అక్కడ పని చేస్తున్న సామాజిక శిక్షణా ట్రెయినర్, ప్రతి నెలా బ్లాక్ రిసోర్స్ సెంటర్ కు తెలియచేయాలి. ఈ గ్రామీణ అంకుర వాణిజ్య కార్యక్రమం పురోగతి ఇలా 48 నెలల పాటు ఎప్పటికప్పుడు సంబంధి త బ్లాక్ రిసోర్స్ సెంటర్ కు తెలియచేయాల్సి వుంటుంది.

నిరంతర నిఘాతో చేయూత: అంకుర వాణిజ్య వేత్తల వాణిజ్య-వ్యాపార యూనిట్లను సామాజిక శిక్షణా ట్రెయినర్ ప్రతి నెలా విధిగా సందర్శించి అవసర మైన సూచనలు, సలహాలు అందచేస్తారు. కాలానుగుణంగా ప్రణాళికా వ్యూహం. అంకుర వాణిజ్య వేత్తలు తమ వాణిజ్య-వ్యాపార యూనిట్లను, వాటి ప్రణాళికల్ని కాల క్రమంలో మారుతున్న అవసరాన్ని బట్టి ఎలా సవరించి మార్చి కొనసాగించ వచ్చునో సామాజిక శిక్షణా ట్రెయినర్ అవసరమైన సూచనలు, సలహాలు అందచేస్తారు.

ఇప్పటివరకు గ్రామీణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలనకు కొరకు చేసిన కృషిని ఈ కార్యక్రమం ద్వారా తదుపరి దశకు చేర్చినట్లు అవుతుందని గత వారం ఢిల్లీ లో ఇందుకు సంబంధించిన సమావేశంలో పాల్గొని వచ్చిన సంస్థ సిఇఒ. డాక్టర్ పి. కృష్ణ మోహన్ తెలిపారు.

క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డులకు సంబంధించి 2017లో 1,700కుపైగా మోసాలు



న్యూఢిల్లీ : 2017 సంవత్సరం లో వినియోగదారు లు రూ. 71.48 కోట్ల మేర మోసపోయారు. క్రెడిట్, డెబిట్ కార్డు, నెట్ బ్యాంకింగ్ లావాదేవీల్లో 1,700కు పైగా మోసాలు చోటు చేసుకున్నాయి. ఈ విషయాలను కేంద్ర ఐటి శాఖ సహాయ మంత్రి కెజె ఆల్ఫోన్స్ పార్లమెంట్‌కు తెలియజేశారు. ఈ కేసుల్లో జరిగిన మొత్తం నష్టం విలువ రూ. 71.48 కోట్లుగా ఉన్నట్లు ఆయన తెలిపారు. ఇవన్నీ కూడా.లక్ష రూపాయలు ఆపైన విలువ కలిగిన మోసాలే. ఆలోపు విలువ కలిగినవి వేరే. ముఖ్యంగా గత ఏడాది డిసెంబర్‌లో మోసాలు ఎక్కువగా జరిగాయి.

ఆ నెలలో ఎటిఎం, పిఒఎస్ మెషీన్ల ద్వారా జరిగిన లావాదేవీల విలువ రూ. 3.46 లక్షల కోట్లుగా ఉంది. ఆన్‌లైన్ చెల్లింపుల్లో రిస్క్‌ను పరిమితం చేసేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) ఎన్నో చర్యలు తీసుకుంటోందని మంత్రి పార్లమెంట్‌కు తెలియజేశారు. అలాగే, 30,222 ఫిషింగ్, విషింగ్, ఒటిపి చోరీ, సమాచార తస్కరణ ఘటనలు గత ఏడాది అక్టోబర్- డిసెంబర్ కాలంలో జరిగినట్లు మంత్రి తెలిపారు.

విమానాశ్రయంలో పోగొట్టుకున్న వస్తువుల కోసం యాప్




న్యూఢిల్లీ : విమానాశ్రయాల్లో వస్తువులు పోగొట్టుకోవడం, కొన్ని సందర్భాల్లో మరచిపోవడం సహజం. ఇటువంటి పరిస్థితి ఎదురైనప్పుడు సులభంగా వాటిని పొందే అవకాశం ఉంటే బాగుంటుంది. విమానాశ్రయాల భద్రతను చూసే సిఐఎస్ఎఫ్ ఇందు కోసం ఒక యాప్‌ను విడుదల చేసింది. మరచిపోయిన, పోగొట్టుకున్న వస్తువులపై ప్రయాణికులు ఈ యాప్ నుంచే ఫిర్యాదు చేయవచ్చు. ఈ యాప్ పేరు 'లాస్ట్ అండ్ ఫౌండ్'. ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ యాప్‌లో ఉన్న ప్రధాన అనుకూలత ప్రయాణికులు నేరుగా ఫిర్యాదు నమోదు చేసి వెంటనే స్టాటస్ రిపోర్ట్ పొందవచ్చు అని సిఐఎస్ఎఫ్ అసిస్టెంట్ ఇన్ స్పెక్టర్ జనరల్ హేమేంద్ర సింగ్ సూచించారు. గత ఏడాది రూ. 50.5 కోట్లు విలువ చేసే వస్తువులను గుర్తించినట్లు హేమేంద్ర తెలియజేశారు.

చంద్రబాబును కలిసిన వికాట్ సిమెంట్ సిఈఓ గైసిడాస్



అమరావతి, సూర్య ప్రతినిధి : ఉండవల్లి నివాసంలో ముఖ్య మంత్రి చంద్రబాబునాయు డిని ఫ్రాన్స్‌కు చెందిన వికాట్ సిమెంట్ కంపెనీ సీఈఓ గై సిడాస్ మర్యాద పూర్వకంగా కలిశారు. గై సిడాస్ తోపాటు ఫ్రాన్స్ కాన్సలేట్ జనరల్ ఫ్రంక్వోయిస్ గౌటీయర్ కూడా ఉన్నారు. విజయనగరం జిల్లా కొత్తవలసలో వికాట్ సిమెంట్ కంపెనీ నెలకొల్పడంపై మార్చి 10న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో ఎంవోయూ చేసుకుంది. కాల్బర్గీ ఓవర్సీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నెలకొల్పనున్న ఈ సిమెంట్ కంపెనీని రూ. 510 కోట్ల వ్యయంతో నిర్మించనున్నారు. ఇందుకోసం సిమెంట్ కంపెనీకి 200 ఎకరాలు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ఏడాదికి 1.75 మిలియన్ టన్నుల సిమెంట్ ఉత్పత్తిని చేయాలని నిర్దేశించారు. ఫలితంగా 275 మందికి ప్రత్యక్ష్యంగా ఉద్యోగాలు లభించనున్నాయి. ఈ సమావేశంలో ఏపీ ఈడీబీ సీఈఓ జాస్తి కృష్ణ కిషోర్, ఎడిషనల్ డైరెక్టర్ డాక్టర్ ఏ. ఎం. శిరీష్ లు పాల్గొన్నారు.

అరుదైన రికార్డుకు చేరువలో మారుతి స్విఫ్ట్



ముంబయి : దేశీయ దిగ్గజ ఆటో మొబైల్ సంస్థ మారుతి సుజుకీ కార్ల అమ్మకాల్లో దూసుకుపోతోంది. మార్కెట్‌లోకి విడుదల చేసిన కొన్ని రోజుల్లోనే వేలల్లో కార్ల బుకింగులు అవుతున్నాయి. ఏ పేరుతో కారు విడుదల చేసినా సరే వినియోగదారులు ఇట్టే బుకింగులు చేసుకుంటున్నారు. కాగా, మారుతి సుజుకీ ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ స్విఫ్ట్ అరుదైన రికార్డుకు చేరువ అవుతోంది. అతి తక్కువ సమయంలోనే లక్ష బుకింగ్‌ల మైలురాయిని చేరుకున్న కారుగా స్విఫ్ట్ రికార్డు సొంతం చేసుకోనున్నది. ఇప్పటికే 90 వేల బుకింగ్‌లను పూర్తి చేసుకోగా అది మరికొన్ని రోజుల్లోనే ఈ ఘనత సాధించనున్నది. మూడవ జనరేషన్ స్విఫ్ట్ బుకింగ్‌లను జనవరి 18న ప్రారంభించారు. శుక్రవారానికి 90 వేల బుకింగ్‌లు వచ్చినట్లు మారుతి సుజుకీ తెలియజేసింది. మరొక వారంలో లక్ష బుకింగ్‌ల మైలురాయిని చేరుకుంటామని సంస్థ తెలిపింది. అలా జరిగితే కేవలం తక్కువ సమయంలో ఈ ఘనత సాధించిన తొలి కారుగా స్విఫ్ట్ రికార్డు దక్కించుకోనున్నది. గతంలోనూ ఇతర కంపెనీల కార్లు లక్ష బుకింగ్‌ల మైలురాయిని చేరుకున్నాయి.

అయితే, అందు కోసం అవి కాస్త ఎక్కువ సమయం తీసుకున్నాయి. రెనో క్విడ్ ఆరు నెలల్లో, హ్యుందాయ్ క్రెటా 8, మారుతి డిజైర్, వితారా బ్రెజా నాలుగు నెలల్లో ఈ ఘనత సాధించాయి. ఈ కారుకు ఉన్న ప్రత్యేక క్రేజ్ కారణంగానే బుకింగు లు వస్తున్నాయని సంస్థ తెలియజేసింది.

పేటీఎం ద్వారా బంగారం పంపుకోవచ్చు

- బంగారంలో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు
- గోల్డ్ గిఫ్ట్, గోల్డ్ సేవింగ్స్ ప్లాన్ ప్రారంభం
- కోరుకున్న మేరకు బంగారంలో పెట్టుబడులు
- డిజిటల్ రూపంలో పేటీఎం నుంచే ఇతరులకు బంగారం పంపుకునే వీలు



న్యూఢిల్లీ : పసిడి ప్రియులకు మరి రెండు రకాల సేవలను అందిస్తున్నట్లు పేటీఎం ప్రకటించింది. గోల్డ్ గిఫ్టింగ్, గోల్డ్ సేవింగ్స్ ప్లాన్‌ను వెల్త్ మేనేజ్‌మెంట్ విభాగం ద్వారా అందిస్తున్నట్లు సంస్థ తెలియజేసింది. కస్టమర్లు 24 క్యారట్ల 999.9 స్వచ్ఛత బంగారాన్ని పేటీఎం ద్వారా ఒకరికి ఒకరు పంపించుకోవ్చని వెల్లడించింది. దీనినే బహుమతి సేవగా సంస్థ పేర్కొంది. పేటీఎం డిజిటల్, భౌతిక రూపంలో బంగారం కొనుగోలుకు ముందు నుంచి అవకాశం కల్పిస్తోంది. రూపాయి చార్జీ లేకుండానే డిజిటల్ రూపంలో ఉంచుకోవడం లేదా ఫిజికల్‌గా కావాలంటే డెలివరీ తీసుకునే అవకాశం ఉంది. 60 శాతం బంగారం కొనుగోళ్లు టైర్ 2, 3 పట్టణాల నుంచే ఉంటున్నాయని ఈ సంస్థ చెబుతోంది. కస్టమర్లు వీలైనప్పుడల్లా రూ. 500 మొదలుకొని బంగారం కొంటున్నట్లు సంస్థ తెలిపింది. పేటీఎం గోల్డ్ సేవింగ్స్ ప్లాన్ కింద కస్టమర్లు తమ పొదుపు అవసరాల మేరకు బంగారంలో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఇందు కోసం ఫలానా రోజు ఎంత మొత్తం విలువ గల బంగారం కొనుగోలు చేయాలనుకుంటున్నారు మొదలైన వివరాలను నమోదు చేస్తే చాలు. సరిగ్గా అన్ని రోజులకు వారి ఖాతాలో ఆ లావాదేవీ జరిగిపోతుంది.

భారత్, అమెరికా మధ్య వాణిజ్యంతోనే చికాకు


ఒకే విధమైన పన్నులు కోరుకుంటున్న యుఎస్



వాషింగ్టన్ : భారత్, అమెరికా దేశాల మధ్య సంబంధాల్లో వాణిజ్య విషయంలో అత్యంత ఎక్కువగా సంఘర్షణ నడుస్తోందని అధ్యక్ష నివాసమైన వైట్ హౌస్‌లోని సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌తో పారదర్శకమైన, పరస్పరం ఒకే రకమైన పన్నుల విధానాన్ని కోరుకుంటున్నారని ఆయన తెలిపారు. భారత్‌తో అమెరికా సంబంధాల్లో వాణిజ్యం అంశం చికాకుగా మారే అవకాశం ఉందని ఆయన సూచించారు. భారత్‌లో అమెరికా నుంచి దిగుమతి అయ్యే మోటార్ వాహనాలపై అధికంగా సుంకం విధిస్తున్నారని, అదే విధంగా అమెరికా కూడా భారత్ నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై సుంకాలు వసూలు చేస్తామని ట్రంప్ హెచ్చరించిన అనంతరం వైట్ హౌస్ ఈ విధంగా ప్రకటన చేసింది. ఉభయ దేశాల మధ్య బలమైన సంబంధాలు ఉన్నాయని ఆ అధికారి చెబుతూ, ఒక వేళ ఏదైనా విషయంలో రెండు దేశాల మధ్య సంఘర్షణ జరిగితే అది వాణిజ్యం విషయంలోనే అవుతుందని అన్నారు. భారత్ నుంచి అమెరికాలోకి దిగుమతి అవుతున్న మోటార్‌సైకిళ్లపై ఎటువంటి సుంకాలూ విధించడం లేదని, అధ్యక్షుడు భారత్‌తో పూర్తిగా పరస్పరం ఒకే విధమైన పన్నుల విధానాన్ని కోరుకుంటున్నారని సదరు అధికారి స్పష్టం చేశారు. విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానం ఇస్తూ, వాణిజ్య అంశాలపై ట్రంప్ యంత్రాంగం భారత్‌తో సంప్రదింపులు జరుపుతోందని తెలియజేశారు. భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విజయ్ గోఖలే ప్రస్తుతం వాషింగ్టన్‌లో ఉన్నారు. ఆయన అక్కడి ట్రేడ్ రిప్రజెంటేటివ్ రాబర్ట్ లైటిజర్‌ను కలవనున్నారు.

త్వరలో ఐదు పైసలకే లీటర్ తాగునీరు

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ



భోపాల్ : సముద్రపు నీటి నుంచి తయారు చేసే తాగునీటిని త్వరలో ఐదు పైసలకే లీటరు అందిస్తామని కేంద్ర జల వనరుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించారు. ఈ దిశగా తమిళనాడులోని తూత్తుకుడి (ట్యుటకోరన్)లో సముద్రపు నీటిని తాగునీరుగా మార్చే ప్రయోగాలు మొదలయ్యాయని ఆయన తెలియజేశారు. మధ్య ప్రదేశ్ రాజధాని భోపాల్‌ల్లో బాంద్రభన్‌లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న నది మహోత్సవంలో భాగంగా శుక్రవారం జరిగిన ప్రారంభ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా గడ్కరీ మాట్లాడుతూ, కొన్ని రాష్ట్రాలు నదీ జలాల పంపిణీ కోసం కొట్లాడుకోవడం దురదృష్టకరమని అన్నారు. పరోక్షంగా దక్షిణాది రాష్ట్రాలను ఉద్దేశించి ఆయన అలా వ్యాఖ్యానించారు. అదే సమయంలో పాకిస్తాన్‌లోకి ప్రవహిస్తున్న నదీ జలాల గురించి మాత్రం ఎవరూ ఆందోళన చెందడం లేదని ఆయన అన్నారు. 'భారత్‌లోని మూడు నదుల నీరు పాకిస్తాన్‌లోకి ప్రవహిస్తోంది. కానీ ఏ వార్తాపత్రికైనా దీని గురించి రాస్తోందా? లేదా ఎవరైనా ఎంఎల్ఎ దీనిని ఆపాలని డిమాండ్ చేస్తున్నారా?' అని గడ్కరీ సూటిగా ప్రశ్నించారు.

సూర్య
విజయవాడ
ఆదివారం
18 మార్చి 2018

మోడీ హామీలన్నీ డ్రామాలే!
కాంగ్రెస్ అనేది రాజకీయ కాదు... ఒక ఉద్యమం


న్యూఢిల్లీ: కాంగ్రెస్ విజయం ఇది ప్రతీ ఒక్కరి విజయం. కాంగ్రెస్ అనేది ఒక రాజకీయ పదం కాదు. ఇదొక ఉద్యమం అని ఆ పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ అన్నారు. ఢిల్లీలో జరుగుతోన్న 84వ ప్లీనరీ సమావేశంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. క్లిష్టమైన సమయంలో పార్టీ అధ్యక్షుడి బాధ్యతలు తీసుకొని ప్లీనరీ సమావేశాన్ని ఏర్పాటు చేసిన రాహుల్‌గాంధీకి అభినందనలు తెలుపుతూ ఆమె తన ప్రసంగాన్ని ప్రారంభించారు. పార్టీ విజయం దేశ విజయం. ఈ విజయంలో ప్రతి ఒక్కరికీ భాగస్వామ్యం ఉంది. పార్టీని ఎలా బలోపేతం చేయాలనే దాని గురించి ఆలోచించాల్సిన సమయం ఇది. 40ఏళ్ల క్రితం ఇందిరా జీ చిక్‌మంగళూర్‌లో అద్భుతమైన విజయాన్ని సాధించి దేశ రాజకీయాలను తనవైపునకు తిప్పుకున్నారు. ఇప్పుడు మరోసారి అటువంటి ప్రదర్శనే పార్టీకి కావాలి. మన్మోహన్ సింగ్ ప్రభుత్వ హయాంలో ఆర్థిక వృద్ధి అత్యధిక స్థాయిలో ఉంది. కానీ, ప్రస్తుతం మోడీ హయాంలోని పరిస్థితులను చూస్తుంటే బాధగా ఉంది. గత ప్రభుత్వంలో తీసుకొచ్చిన పథకాలను అభివృద్ధి చేయడం మోడీ మరిచిపోయారు. గత నాలుగేళ్లలో కాంగ్రెస్ పార్టీని నాశనం చేసేందుకు ప్రభుత్వం ఏ అవకాశాన్ని వదల్లేదు. కానీ, ఎన్ని ఎదురైనా కాంగ్రెస్ మాత్రం బలహీనపడలేదు. ప్రధాని మోడీ, ఆయనతో ఉండే వారి మోసాన్ని, అవినీతిని మేం బయటపెట్టాం. కాంగ్రెస్‌యేతర ప్రభుత్వం ఎక్కడ ఉన్నా అక్కడ జరుగుతున్న హింసలు, అరాచకత్వాన్ని మేం వ్యతిరేకిస్తూనే ఉంటాం. అన్యాయానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ గళం విప్పుతూ పోరాటం చేస్తూనే ఉంటుంది. సరికొత్త శకానికి ఇది ఆరంభం. కుట్రలు, అవినీతి లేని దేశాన్ని మేం కోరుకుంటున్నాం. ఇది సాధ్యమయ్యేలా చేసేందుకు రాహుల్ అధ్యక్షతన కలిసి పనిచేసేలా ప్రతిజ్ఞ చేద్దాం అని సోనియా పిలుపునిచ్చారు. సబ్‌కా సాత్.. సబ్‌కా వికాస్ పేరుతో ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్నహామీలు, మాటలు అన్ని డ్రామాలే. ఓట్లను పొందేందుకు ఇటువంటి వాటిని ఉపయోగించుకుంటుంది అని సోనియా ఎన్డీయే ప్రభుత్వంపై విరుచుకు పడ్డారు.



కేంద్ర మంత్రివర్గంలోకి కంభంపాటి ?

- కేంద్రమంత్రి పదవికి గ్రీన్‌సిగ్నల్
- బీజేపీ నేతల భేటీలో వైసీపీ వ్యూహకర్త పీకే
- ఏపీ అధ్యక్ష పదవిపై చర్చించిన అమిత్‌షా

న్యూఢిల్లీ, సూర్య ప్రత్యేక ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ తెలుగుదేశం పార్టీ ఎన్డీఏ నుంచి బయటికి రావడం, కేంద్ర మంత్రి పదవులకు సుజనాచౌదరి, అశోక్‌గజపతిరాజు రాజీనామా చేయడంతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కంభంపాటి హరిబాబుకు కేంద్రమంత్రి వర్గంలో స్థానం కల్పించే అవకాశమేర్పడింది. గతంలోనే హరిబాబుకు కేంద్ర మంత్రి పదవి లభిస్తుందని పార్టీ శ్రేణులు భావించినా వివిధ కారణాల వల్ల అది సాధ్యం కాలేదు. తెలుగుదేశం పార్టీ ఎంపీలు కేంద్రమంత్రి వర్గం నుంచి వైదొలగడం ప్రస్తుతం హరిబాబుకు కలిసొచ్చింది. శనివారం సాయంత్రం ఢిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షాతో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బీజేపీ నేతలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హరిబాబును కేంద్రమంత్రి వర్గంలోకి తీసుకుంటే రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు ఎవరికి అప్పగించాలనే దానిపై కసరత్తు జరిగినట్లు సమాచారం. సోము వీర్రాజు, ఆకుల సత్యనారాయణ, విష్ణుకుమార్‌రాజు వీరిలో ఒకరికి అధ్యక్ష బాధ్యతలు అప్పగించాలని



భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఏ సామాజిక వర్గానికి చెందిన నేతకు అధ్యక్ష బాధ్యతలు అప్పగిస్తే పార్టీకి మేలు జరుగుతుందనే అంశాన్ని పరిశీలిస్తున్నారు. బీజేపీ నేతల భేటీకి ఏపీలో వైసీపీ వ్యూహకర్తగా ఉన్న ప్రశాంత్‌కిషోర్ హాజరుకావడం ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ప్రశాంత్ కిషోర్ గత ఏడాదిన్నరగా ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై అధ్యయనం చేస్తున్నందున ఆయన సలహాలను కూడా అమిత్ షా పరిగణనలోకి తీసుకుంటున్నారు. ప్రశాంత్ కిషోర్ జాతీయ స్థాయిలో బీజేపీకి కూడా వ్యూహకర్తగా ఉన్నారు. ప్రశాంత్ కిషోర్ కేంద్రంలో బీజేపీకి, రాష్ట్రంలో వైసీపీకి వ్యూహకర్తగా పనిచేయడంపై రాజకీయవర్గాల్లో ఆసక్తికర చర్చ దారితీసింది. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వకుండా మోసం చేసిన భారతీయ జనతాపార్టీతో వైసీపీ అంటకాగుతోందని తెలుగుదేశం పార్టీ తీవ్ర విమర్శలు చేస్తున్న తరుణంలో తాజాగా ప్రశాంత్ కిషోర్ బీజేపీ నేతల భేటీకి హాజరుకావడం టీడీపీ నేతలు చేస్తున్న ఆరోపణలకు మరింత బలం చేకూరినట్లయింది. 2014లో బీజేపీ, టీడీపీలకు మద్దతిచ్చిన జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ గతంలో కాకినాడ సభలో బీజేపీపై విమర్శలు గుప్పించడం, తాజాగా మంగళగిరిలో జరిగిన జనసేన ఆవిర్భావ సభలో తెలుగుదేశం పార్టీపై అవినీతి ఆరోపణలు చేయడంపై బీజేపీ నేతలు చర్చించారు. ప్రస్తుతం పవన్ కల్యాణ్ రాజకీయ వైఖరి ఏమిటి, రాష్ట్రంలో ఎలాంటి వ్యూహం అనుసరించాలనే దానిపై చర్చించారు. ప్రత్యేక హోదా ఇవ్వకుండా బీజేపీ ఆంధ్రప్రదేశ్‌కు ద్రోహం చేసిందని టీడీపీ చేస్తున్న ఆరోపణలు తిప్పికొట్టాలని, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి చేసిన సాయాన్ని రాష్ట్ర ప్రజలకు వివరించాలని బీజేపీ నేతలు నిర్ణయించారు. ప్రత్యేక హోదాతో వచ్చే సాయాన్ని ప్యాకేజీ ద్వారా ఇస్తామని చెప్పిన మాటకు ఇప్పటికీ కట్టుబడి ఉన్నామని బీజేపీ నేతలు రాష్ట్ర ప్రజలకు వివరించనున్నారు. రాష్ట్ర బీజేపీ నేతలు అమిత్ షాతో భేటీ తర్వాత తెలుగుదేశం పార్టీపై ఎలాంటి ఎదురుదాడికి సిద్ధమవుతారో వేచి చూడాల్సిందే.

అన్నమాచార్య కళామందిరంలో ఘనంగా శ్రీ గోవిందరాజస్వామివారి ఆస్థానం



తిరుపతి, సూర్య ప్రతినిధి : శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్యుల 515వ వర్ధంతి మహోత్సవాల్లో చివరి రోజైన శనివారం తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో శ్రీ గోవిందరాజస్వామివారి ఆస్థానం ఘనంగా జరిగింది. భక్తుడి చెంతకు భగవంతుడు రావడం అనే ఆర్యోక్తికి తార్కాణంగా శ్రీ వేంకటేశ్వరస్వామికి పరమభక్తుడైన అన్నమాచార్యుడు వెలసిన అన్నమాచార్య కళామందిరానికి శ్రీ గోవిందరాజస్వామి ఉత్సవర్లు వేంచేయడం సంప్రదాయంగా కొనసాగుతోంది. అనంతరం గోవిందరాజస్వామివారిపై అన్నమయ్య రచించిన సంకీర్తనలను ప్రాజెక్టు కళాకారులు సుమధురంగా ఆలపించారు. అంతకుముందు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ గోవిందరాజస్వామి ఉత్సవమూర్తులను ఆలయం నుండి ఊరేగింపుగా నాలుగు కాళ్ల మండపం, తీర్థకట్టవీధి మీదుగా అన్నమాచార్య కళామందిరానికి తీసుకువచ్చారు. ఆస్థానం అనంతరం తిరిగి ఉత్సవమూర్తులను శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయానికి తీసుకెళ్లారు. అనంతరం చెన్నైకి చెందిన ఎం.పి. శృతిరవళి బృందం గాత్ర సంగీత సభ నిర్వహించారు. అదేవిధంగా, తిరుపతికి చెందిన కె.చంద్రశేఖర్ భాగవతార్ హరికథ పారాయణం చేశారు. కాగా, సాయంత్రం 6 నుండి 7 గంటల వరకు టిటిడి ఆస్థాన విద్వాంసులు గరిమెల్ల బాలకృష్ణప్రసాద్ గాత్ర సంగీతం, రాత్రి7 నుండి 8.30 వరకు తిరుపతికి చెందిన బి.కేశవి బృందం నృత్య కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో టిటిడి అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు ధనుంజయుడు, రీసెర్చి అసిస్టెంట్ డాక్టర్ సి.లత ఇతర అధికారులు, ఆధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సత్సంబంధాలకు పాక్ అడ్డుపుల్ల
పొరుగుదేశాలు మారవని వాజ్‌పేయి అనే వారు



న్యూఢిల్లీ: దాయాది దేశమైన పాకిస్థాన్‌తో తాము సత్సంబంధాలనే కోరుకుంటున్నామని.. కానీ అందుకు ఆ దేశం అడ్డుపుల్లలు వేస్తోందని కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఢిల్లీలో జరిగిన న్యూస్ 18 రైజింగ్ ఇండియా సమ్మిట్‌లో ఆయన పాల్గొని ప్రసంగిస్తూ పాక్ తీరును ఎండగట్టారు. పొరుగుదేశాలతో సత్సంబంధాలు కలిగి ఉండాలనే మేం కోరుకుంటాం. స్నేహితులు మారతారు.. కానీ పొరుగుదేశాలు మారవని అటల్ బిహారీ వాజ్‌పేయ్ అనే వారు. మా పొరుగు దేశాలతో బాగుండాలనే అనుకుంటాం. కానీ పాకిస్థాన్ మాత్రం ఇరు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపడేలా చేసేందుకు ఏ మాత్రం ప్రయత్నించదు అని ఆయన పేర్కొన్నారు. పాక్ ఉగ్రవాదులను నియంత్రించేందుకు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని దుయ్యబట్టారు. అంతర్జాతీయ ఉగ్రవాదిగా పేర్కొనబడిన వ్యక్తి రాజకీయ పార్టీ ప్రారంభించి.. ఆ దేశ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అంగీకరించింది.

అంతేకాదు.. హక్కానీ నెట్‌వర్క్‌కు ఆ దేశం సహాయం చేస్తోంది అని ఆయన ఆరోపించారు. ఇరు దేశాల మధ్య శాంతిపూర్వకమైన వాతావరణం నెలకొనేలా చేసేందుకు ప్రధాని నరేంద్రమోడీ పలుమార్లు ప్రయత్నించినప్పటికీ వాటిని పాక్ అడ్డుకుంటూ వచ్చిందని అన్నారు. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన స్తబ్దత నెలకొన్న సమయంలో రాజ్‌నాథ్ ఇటువంటి వ్యాఖ్యలు చేయడం గమనార్హం. తమ రాయబారులు వేధింపులకు గురవుతున్నారంటూ ఇరు దేశాలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలోనే మంగళవారం పాక్ విదేశాంగశాఖ కార్యాలయ అధికారులు భారత డిప్యూటీ హైకమిషనర్ జేపీసింగ్‌కు సమన్లు జారీ చేసింది.

బ్రిటీష్ దౌత్యవేత్తల తరిమివేత
ప్రకటించిన రష్యా విదేశాంగ మంత్రి సెర్జీ లావ్రోవ్



ఆస్టానా: లండన్ నుంచి రష్యాకు చెందిన 23 మంది దౌత్య వేత్తలను లండన్ నుంచి తరిమేస్తామన్న బ్రిటన్ ప్రభుత్వంపై సరైన నిర్ణయం తీసుకుంటామని రష్యా విదేశాంగ మంత్రి సెర్జీ లావ్రోవ్ తెలిపారు. బ్రిటీష్ మాజీ గూఢచారి స్క్రిపాల్‌పై రష్యా దౌత్యవేత్తలు హత్యాయత్నం చేశారనే ఆరోపణలపై ఈ బహిష్కరణ నిర్ణయం తీసుకుంటున్నట్టు బ్రిటన్ ప్రధాన మంత్రి థెరిసా మే ప్రకటించారు. సిరియాలో కొనసాగుతున్న అల్లకల్లోల పరిస్థితులపై ఇరాన్, టర్కీ విదేశాంగ మంత్రులతో కలిసి కాజా రాజధాని ఆస్టానాలో గురువారం రష్యా విదేశాంగ మంత్రి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. బ్రిటన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్నే తాము అమలు చేస్తామనీ, బ్రిటన్ దౌత్యవేత్తలను రష్యా నుంచి బహిష్కరిస్తామని స్పష్టం చేశారు. స్క్రిపాల్‌ను ఇబ్బంది పెట్టే ఉద్దేశం తమ దేశానికి లేదని, ఫిఫా ప్రపంచకప్-2018 కి ఆతిథ్యం ఇవ్వబోతున్న రష్యాను ఇబ్బందుల్లోకి నెట్టేందుకు ఇంకెవరైనా స్క్రిపాల్‌పై దాడి చేసి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. దీనికి ముందు రష్యా అధ్యక్షుడి అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ మాట్లాడుతూ.. ఈ వివాదంపై మాస్కో భావాలకు అనుగుణంగానే తమ అధ్యక్షుడు పుతిన్ నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. స్క్రిపాల్, అతని కూతురు యులియా పై జరిగిన దాడిని ఖండిస్తూ.. దానిని యూకే సౌభ్రాతృత్వం పై దాడిగా పేర్కొంటూ బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, అమెరికా దేశాలు ఉమ్మడి ప్రకటన చేశాయి. అంతర్జాతీయ స్థాయి కుంభకోణాన్ని మరుగున పరిచేందుకు బ్రిటీష్ మాజీ గూఢచారి స్క్రిపాల్, అతని కూతురుపై రసాయనాలతో హత్యాయత్నం జరిగిందని ఆయా దేశాలు ఆరోపించాయి. కాగా మార్చి 4న ఇంగ్లండ్‌లోని సలిస్‌బరిలో స్క్రిపాల్, అతని కూతురుపై రసాయన దాడి జరిగింది. ప్రస్తుతం ఈ ఇద్దరూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

అవిశ్వాస తీర్మానం చర్చకు రావాలి
బీజేపీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు హరిబాబు

న్యూ ఢిల్లీ, సూర్య ప్రతినిధి : కేంద్ర ప్రభుత్వంపై తెలుగుదేశం పార్టీ పెట్టిన అవిశ్వాస తీర్మానం చర్చకు రావాలని కోరుకుంటున్నానని బీజేపీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు హరిబాబు తెలిపారు. అవిశ్వాసంపై పార్లమెంట్‌లో చర్చించేందుకు బీజేపీ సిద్ధంగా ఉందన్నారు. బీజేపీ ఎంపీలెవరూ వెల్‌లో ఉండరని, చర్చలో అన్ని విషయాలు వెల్లడవుతాయని చెప్పారు. శనివారం మీడియాతో మాట్లాడిన హరిబాబు ఎన్డీయే నుంచి టీడీపీ విడిపోయిన నేపథ్యంలో ఏపీలో ఏ విధంగా ముందుకు వెళ్లాలనే దానిపై పార్టీ అధిష్టానంతో చర్చిస్తామన్నారు. ఏం చేసినా నేరుగానే చేస్తాం తప్ప లోపాయికారి విధానాలతో చేయబోమని స్పష్టం చేశారు. టీడీపీ ఆపోహలతో కొట్టుమిట్టాడుతుందని వ్యాఖ్యానించారు. ఏపీకి ఇచ్చిన హామీలన్నీ కేంద్రం నెరవేర్చుతుందన్నారు. బీజేపీకి రాష్ట్రంలో నలుగురు శాసనసభ్యులు, ఇద్దరు పార్లమెంట్ సభ్యులు ఉన్నారన్న హరిబాబు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అన్యాయం చేసిందనేది నెపం మాత్రమేనని పేర్కొన్నారు. ఎన్డీయే నుంచి టీడీపీ వైదొలగడం చాలా దురదృష్టకరమని అన్నారు.

ఈవిఎంలు వద్దు బ్యాలట్‌లే ముద్దు




న్యూఢిల్లీ: ఎన్నికల్లో మళ్లీ బ్యాలట్ పేపర్ విధానాన్ని ప్రవేశపెట్టాలని కాంగ్రెస్ పార్టీ కోరింది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన (ఈవీఎం)పై పలు పార్టీలు అనుమానాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ కూడా వంతపాడింది. ఈవీఎంలు వద్దని పేపర్ బ్యాలెట్లే కావాలని వెల్లడించింది. ఢిల్లీలో జరుగుతున్న కాంగ్రెస్ పార్టీ ప్లీనరీ సమావేశంలో కాంగ్రెస్ ఈ విషయాన్ని ప్రస్తావించింది. చాలా ప్రజాస్వామ్య దేశాలు ఇంకా పేపర్ బ్యాలెట్లనే ఉపయోగిస్తున్నాయని గుర్తుచేసింది. ఈవీఎంల దుర్వినియోగం జరుగుతోందని పలు రాజకీయ పార్టీలు, పలువురు వ్యక్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని పార్టీ పేర్కొంది. ఈ నేపథ్యంలో ఎన్నికల విధానంపై విశ్వాసాన్ని పెంపొందించడానికి ఎన్నికల సంఘం తిరిగి పాత పద్ధతైన బ్యాలెట్ విధానానికి వెళ్లాలని పార్టీ పేర్కొంది. అయితే ఈవీఎంలపై ఆరోపణలను ఎన్నికల సంఘం ఖండిస్తూ వస్తోంది. ఈవీఎంల పనితీరు సరిగ్గానే ఉందని చెప్తోంది. ఉత్తర్‌ప్రదేశ్ ఎన్నికల అనంతరం బహుజన్ సమాజ్ పార్టీ అధినేత్రి మాయావతి తొలిసారి ఈవీఎంల పనితీరుపై అనుమానం వ్యక్తంచేశారు. బ్యాలెట్ పేపర్ ప్రవేశపెట్టాలని కోరడంతో పాటు కాంగ్రెస్ పార్టీ ప్లీనరీ సమావేశంలో మరికొన్ని తీర్మానాలను ప్రవేశపెట్టింది. 2019 ఎన్నికల్లో భాజపాను ఓడించేందుకు ఒకే ఆలోచనా ధోరణి ఉన్న పార్టీలను ఏకతాటిపైకి తీసుకొచ్చి, అంతా కలిసి ఒకే ఆచరణాత్మక ప్రణాళికను రూపొందించుకునేలా చేయాలని కాంగ్రెస్ పార్టీ వెల్లడించింది. అధికార దుర్వినియోగాన్ని తనిఖీ చేసేందుకు ఫిరాయింపుదారులను పార్టీ నుంచి ఆరేళ్లపాటు బహిష్కరిస్తుందని తెలిపింది. న్యాయ వ్యవస్థలో అత్యవసరంగా సంస్కరణలు అవసరమని పేర్కొంది. మహిళా బిల్లు అమల్లోకి తీసుకురావాలని తీర్మానించారు.

మొదటి పేజీ తరువాయి

పగటిపూట 9గంటల ఉచిత విద్యుత్

కోట్లు కేసులో ఆడియో టేపులు, వీడియో టేపుల్లో అడ్డంగా దొరికిన వ్యక్తి కనుక ప్రశ్నిస్తే జైల్లో పెట్టిస్తారన్న భయంతోనే చంద్రబాబు తెలంగాణతో ఏ విషయంలోనూ పోరాటలేకపోతున్నారని వైఎస్ జగన్ చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం ఎడాపెడా నీళ్లు తోడేస్తున్నా, ఇక్కడ మాత్రం టీడీపీ ప్రభుత్వం ఏపీ రైతులకు నీళ్లు ఇవ్వడంలో విఫలమైందన్నారు. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం కాకుమానులో రైతులతో ఆత్మీయ సమ్మేళనంలో వైఎస్ జగన్ పాల్గొని ప్రసంగించారు. నాలుగేళ్లు గడుస్తున్నా ఏ పంటకైనా గిట్టుబాటు ధర కల్పించారా ? అని చంద్రబాబును ప్రశ్నించారు. ఇంకా చెప్పాలంటే తానే దళారులకు నాయకుడై, హెరిటేజ్ పేరుతో వ్యాపారం మొదలుపెట్టిన వ్యక్తి చంద్రబాబు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల దగ్గరి నుంచి కొన్న సరుకులను కవర్లో ప్యాక్ చేసి ఎన్నో రెట్ల ధరలకు విక్రయించడం రాష్ట్రం మొత్తం చూసిందని, గుంటూరు మిర్చి యార్డ్ కు ప్రతిపక్షనేత వచ్చి దీక్ష చేయాల్సిన పరిస్థితి తలెత్తిందంటే చంద్రబాబు పాలన ఉందో అర్థం చేసుకోవాలన్నారు. రూ. 3000 కోట్లతో ధరల స్థిరీకరణ అని తాను చెప్పానన్న కారణంగా, తానేం తక్కువ తినలేదన్నట్లుగా చంద్రబాబు రూ.5 వేల కోట్లతో ధరల స్థిరీకరణ అని ప్రకటించారు. కానీ దాన్ని ఎందుకు అమలు చేయలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు పాలనలో చిత్తూరులో షుగర్ ఫ్యాక్టరీలు, ఒంగోలులో డెయిరీలు మూతపడ్డాయి తప్ప ఎలాంటి ప్రయోజనం చేకూరలేదంటూ వైఎస్ జగన్ మండిపడ్డారు.

చంద్రబాబుది 87 వేల కోట్ల మోసం : రుణమాఫీ అని చంద్రబాబు చేసిన మోసం ఇంతా అంత కాదు అది రూ. 87 వేల కోట్ల మోసమని, బ్యాంకుల్లో తాకట్టు పెట్టిన బంగారం ఇంటికి వచ్చిందో లేదో కానీ బ్యాంకుల నుంచి



మాత్రం రైతులకు నోటీసులు వస్తున్నాయన్నారు. ఎందుకంటే ఇది చంద్రబాబు ప్రభుత్వమని మండిపడ్డారు. గత ప్రభుత్వం వడ్డీ లేకుండా రైతులకు రుణాలు ఇప్పించేదని, కానీ రైతుల తరపున ప్రభుత్వం బ్యాంకులకు రుణాల డబ్బులు చెల్లిస్తున్నాయని అధికారులు మళ్లీ రుణాలు అందించేవారు. కానీ చంద్రబాబు ప్రభుత్వం బ్యాంకులకు రైతు రుణాల డబ్బులు ఎగ్గొట్టడం వల్లే ఏ బ్యాంకు కూడా రైతులకు రుణాలు ఇచ్చేందుకు ముందుకు రావడం లేదన్నారు. సహకార సంఘాలు మంచి ఫలితాలు ఇస్తే ప్రైవేట్ రంగంతో పోటీ ఏర్పడి ఉత్పాదకత పెరుగుతుందని, అప్పుడు డిమాండ్ పెరిగి రైతుల పాల కేంద్రాలు, ఇతత్రా సంఘాలకు మేలు జరుగుతుంది. కరువు, వరదలు వచ్చినప్పుడు ప్రజలు, రైతులు ప్రభుత్వం వైపు చూస్తారని, తాము అధికారంలోకి వస్తే ప్రకృతి వైపరీత్యాల కోసం రూ.4 వేల కోట్లు కేటాయిస్తామన్నారు.

రైతులకు పగటిపూట 9 గంటల ఉచిత కరెంట్...

పెట్రోల్, డీజిల్ ధరలు ఇతర రాష్ట్రాలతో పోల్చితే లీటర్‌కు 6 లేక 7 రూపాయలు అదనంగా ఉంది. ఏపీలో దళారీ వ్యవస్థ పెరిగింది తప్ప, రైతులకు ఏమీ మేలు జరగలేదు. రాష్ట్రంలో మిగులు కరెంట్ ఉందంటున్నారు. కానీ రైతులకు 9 గంటల ఉచిత కరెంట్ అని చెప్పిన చంద్రబాబు కేవలం 7 గంటలు కరెంట్ ఇస్తున్నారని, అది కూడా రాత్రిపూట ఇస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిపారు. దేవుడు ఆశీర్వదిస్తే మనం అధికారంలోకి వచ్చాక పగటి పూట 9 గంటల కరెంటు ఉచితంగా ఇస్తామని, రైతులకు పంట రుణాలు వడ్డీ లేకుండా ఇస్తామన్నారు. రైతుల పెట్టుబడి తగ్గించేలా ఎకరానికి మే నెలలో రూ.12, 500 ఇస్తామని, రైతులకు ఉచిత బోర్లు వేయించి వారికి ఇబ్బందులు లేకుండా చూసుకుంటామని, పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తామని, రూ. 3000 కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి రైతుల పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. కోల్డ్ స్టోరేజ్ యూనిట్లుతో పాటు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసి ఆదుకుంటామన్నారు. చంద్రబాబు పాలనలో మూతపడ్డ సహకారం రంగ సంస్థలను మళ్లీ తెరిపించి ఈ రంగాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని హామీ ఇచ్చారు. లీటరు మీద నాలుగు రూపాయల బోనస్ ప్రభుత్వం చెల్లించి వారికి చేయూతనిస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు నీళ్లు అందించి పాడిపంటలు సమృద్ధిగా ఉండేలా చేసి వారి కష్టాలు తీరుస్తామన్నారు. నెల్లూరు జిల్లాలో రొయ్య రైతులు దళారీ వ్యవస్థ కారణంగా తీవ్రంగా నష్టపోతున్నారని, తాము అధికారంలోకి వస్తే సమస్యను తీరుస్తామని వైఎస్ జగన్ హామీ ఇచ్చారు.

దేశమంతా అసంతృప్తి



రైతులకు గిట్టుబాటు ధరలు లభించట్లేదన్నా రు. 84వ కాంగ్రెస్ ప్లీనరీ శుక్రవారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు కొనసాగే ఈ ప్లీనరీకి పార్టీ మాజీ అధ్యక్షు రాలు సోనియా గాంధీ, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, సీనియర్ నేతలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. రాహుల్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత జరుగుతున్న తొలి ప్లీనరీ ఇది.

ఇందులో 2019 లోక్‌సభ ఎన్నికలకు అనుసరించాల్సిన రాజకీయ దార్శనిక ముసాయిదా తీర్మానాలను ఆమోదించనున్నారు.

అయోమయంలో రైతులు

తెలిపారు. శనివారం పుసా క్యాంపస్ ప్రాంతంలోని కృషి ఉన్నతి మేళాలో పాల్గొంటున్న క్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ముఖ్యం గా రైతులకు నూతన సాంకేతికతను, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీని అందుబాటు లోకి తీసుకురావడం కోసం తాము తపిస్తున్నామని ఆయన తెలిపారు. ఇదే కార్యక్రమంలో భారత ప్రధాని కృషి కర్మన్, దీనదయాళ్ ఉపాధ్యాయ కృషి విజ్ఞాన్ ప్రోత్సాహన్ అవార్డులను బహుకరించనున్నారు. అలాగే సేంద్రీయ వ్యవసాయంపై ప్రత్యేక వెబ్‌సైట్ ప్రారంభించ నున్నారు. 25 కృషి విజ్ఞాన్ కేంద్రాలకు శంఖుస్థాపన కూడా ఇదే కార్యక్రమం లో ఆయన చేయనున్నారు.

ఉగాది ఉత్సవాల్లో మోదీ : శ్రీశైలంలో జరగనున్న ఉగాది కార్యక్రమంలో పీఎం నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొననున్నారు. జ్యోతిర్లింగ పుణ్యక్షేత్రమైన శ్రీశైల మహాక్షేత్రంలో ఉగాది మహోత్సవాలు గత శనివారం ప్రారంభమయ్యాయి. దేశ ప్రజలకు మోదీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

బీజేపీ, వైసీపీ పొత్తు?




ప్రయత్నం చేస్తోందనే ఊహాగానాలు వినిపిస్తున్నా యి. కాగా వైసీపీ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ బీజేపీ సమావేశానికి వచ్చి అందరినీ ఆశ్చర్యానికి గురిచేశారు. బీజేపీ జాతీ య అధ్యక్షుడు అమిత్‌షా తో ఏపీ బీజేపీ నేతలు సమావేశమయ్యారు. ఈ భేటీలో బీజేపీ నేతలు రాంమాధవ్, హరిబాబు, పురందేశ్వరితో పాటుగా 14 మంది బీజేపీ ముఖ్య నేతలు సమావేశంలో పాల్గొన్నారు. అయితే సమావేశం ప్రారంభమైన కొద్దిసేపటి తర్వాత ప్రశాంత్ కోషోర్ కూడా సమావేశానికి హాజరయ్యారు. ఎన్టీయే నుంచి టీడీపీ బయటకు రాగానే వైసీపీ చేరేందుకు సిద్ధంగా ఉందని ఇది వరకు వినిపించిన ఊహాగానాలు వినిపించాయి. అయితే పీకే సమావేశానికి రావటం ఆ ప్రచారానికి బలాన్ని చేకూర్చే విధంగా ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ భేటీలో టీడీపీ, బీజేపీ విడిపోయిన నేపథ్యంలో వైసీపీతో బీజేపీ జతకడితే ఎన్నికల్లో కలిగే లాభనష్టాల గురించి అమిత్‌షాకు పీకే వివరించినట్లు తెలుస్తోంది. వైసీపీ ఎన్నికల వ్యూహకర్తగా ఉన్న పీకే ఏపీ సమస్యలపై అధ్యయనం చేసి సంబంధిత నివేదికను ఇప్పటికే జగన్‌కు అందించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పీకే బీజేపీ నేతల సమావేశానికి రావటం ఇప్పుడు రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది. తాజా రాజకీయ పరిణామాలపై కూడా బీజేపీతో చర్చించినట్లు సమాచారం. వైసీపీ, బీజేపీ మధ్య సమోధ్యకుదురుతుందా? అందులోభాగంగానే పీకే ఈ సమావేశానికి వచ్చారా అనే కోణంలో పలువురు చర్చించుకుంటున్నారు.

టీడీపీ మళ్లీ ఎన్డీఏలోకి వస్తుందా...

నాలుగేళ్ల బంధానికి రాంరాం చెబుతూ ఎన్డీఏ నుంచి టీడీపీ వైదొలిగిన సంగతి తెలిసిందే. అయితే ఈ తరుణంలో మరింత దూకుడు పెంచిన బీజేపీ ఏపీలో బలోపేతం కావడానికి గాను శనివారం సాయంత్రం జాతీయ అధ్యక్షుడు అమిత్ షా ఆధ్వర్యంలో కీలక భేటీ జరిగింది. ఈ సమావేశానికి ఏపీ బీజేపీ నేతలతో పాటు ప్రధాన కార్యదర్శి రాంమాధవ్ హాజరయ్యారు. భేటీ అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన రాష్ట్రంలో ప్రస్తుతమున్న రాజకీయ పరిణామాలన్నింటినీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లామన్నారు. మరీ ముఖ్యంగా టీడీపీ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై కూడా భేటీలో నిశితంగా చర్చించినట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకూ చంద్రబాబు ప్రశ్నలు వేస్తున్నారు.. అయితే ఈ క్రమంలో ఎన్డీఏ కూటమిలోకి మళ్లీ టీడీపీ వస్తుందా? అని మీడియా ప్రతినిధులు ఆయన్ను ప్రశ్నించారు. ఈ ప్రశ్న బీజేపీని అడగడం కంటే తెలుగుదేశం పార్టీనే మీరు అడిగితే బాగుంటుందని రాంమాధవ్ బదులిచ్చారు. అమిత్‌షా ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఏపీ బీజేపీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో పాటు పలువురు ముఖ్యనేతలు పాల్గొన్నారు.

దేశం చూపు ఏపీ వైపు



నమ్మలేదని చంద్రబాబు విమర్శించారు. కేసుల మాఫీకే విజయసాయిరెడ్డి పీఎంవోలో తిరుగుతున్నారని ఆరోపించారు. కేంద్ర పెద్దలకు పాదాభివందనాలు, ప్రదక్షిణలు కేసుల మాఫీ కోసమేనని దుయ్యబట్టారు. ఇప్పుడే జగన్ కేసులకు సడలింపులు ఎందుకు వస్తున్నాయని కేంద్రాన్ని ప్రశ్నించారు. జగన్ అనుచరులు పీఎంవోలోనే ఉంటున్నారని, దానికి ప్రతిగానే కేసులలో సడలింపులని ఎంపీలతో అన్నారు. రేపోమాపో జగన్ కేసులు కొట్టివేస్తారనే ప్రచారం జరుగుతోందని చంద్రబాబు చెప్పారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, తగిన గుణపాఠం చెబుతారని వ్యాఖ్యానించారు. టీడీపీ అవిశ్వాసానికి అనేక పార్టీలు మద్దతు ఇస్తున్నాయని, అవిశ్వాసంపై ఓటింగ్ కు పట్టుబట్టాలని, డివిజన్ అడగాలని పార్టీ ఎంపీలకు సీఎం దిశానిర్దేశం చేశారు. ఆరుగురు సభ్యుల ఎంపీల బృందం ఈ రెండురోజులు ఢిల్లీలోనే ఉండాలని ఆదేశించారు. అన్ని పార్టీల నేతలను వ్యక్తిగతంగా కలిసి, అవిశ్వాసానికి మద్దతు కూడగట్టాలన్నారు. సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకున్నామన్న ఆయన మూడు పార్టీల మహా కుట్రను ప్రజల్లో బయటపెట్టామని చెప్పారు. జగన్, పవన్ కేంద్రాన్ని ప్రశ్నించకుండా తనను విమర్శించటమేమిటని చంద్రబాబు మండిపడ్డారు. ఈ సమయంలో తనను బలహీనపరిచే ప్రయత్నం చేసి ఎవరికి లాభం చేకూరుస్తున్నారని ప్రశ్నించారు. దేశం మొత్తం ఆంధ్రప్రదేశ్ వైపే చూస్తోందన్న ముఖ్యమంత్రి చంద్రబాబు జాతీయ స్థాయిలో ఏపీ ప్రజల గొంతు వినిపించామని అభిప్రాయపడ్డారు. తమకు కావాల్సింది రాజకీయం కాదని, రాష్ట్రానికి న్యాయం జరగడమే తమ లక్ష్యమని చంద్రబాబు నేతలకు స్పష్టం చేశారు. జాతీయ స్థాయిలో ఏపీ ప్రజల గొంతు వినిపించామన్నారు. రాష్ట్రానికి న్యాయం జరగడమే మన లక్ష్యమన్నారు. అలాగే కేసుల మాఫీకే విజయసాయిరెడ్డి పీఎంవోలో తిరుగుతున్నారని, జగన్ కేసులకు సడలింపులు ఎందుకు వస్తున్నాయని ప్రశ్నించారు. జగన్ అనుచరులు పీఎంవోలోనే ఉంటున్నారని, దానికి ప్రతిగానే కేసులలో సడలింపులు వస్తున్నాయని, రేపోమాపో జగన్ కేసులు కొట్టివేస్తారనే ప్రచారం జరుగుతోందని చంద్రబాబు అన్నారు. అన్ని పార్టీల నేతలను వ్యక్తిగతంగా కలవాలని, అవిశ్వాసానికి మద్దతు కూడగట్టాలన్నారు. సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకున్నామని, మూడు పార్టీల మహా కుట్రను ప్రజల్లో బయటపెట్టామన్నారు. జగన్, పవన్ కేంద్రాన్ని ప్రశ్నించకుండా నన్ను విమర్శిస్తున్నారని, నన్ను బలహీనపరిచి ఎవరికి లాభం చేకూరుస్తున్నారని జగన్, పవన్‌లను చంద్రబాబు సూటిగా ప్రశ్నించారు.



ఒకరిని హీరో చేయడం ఇష్టం లేదు

పవన్ వ్యాఖ్యలపై ఎమ్మెల్యే బాలకృష్ణ స్పందన

హిందూపురం, సూర్య ప్రతినిధి : ఒకరిపై వ్యాఖ్యలు చేసి హీరోను చేయడం తనకు ఇష్టం ఉండదని, తానే సూపర్ హీరోనని అన్నారు సినీ నటుడు, హిందూపురం శాసనసభ్యుడు నందమూరి బాలకృష్ణ. శనివారం హిందూపురంలో పర్యటించిన ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఓ ప్రైవేటు ఆసుపత్రిని ప్రారంభించారు. పట్టణంలోని ఎంజీఎం క్రీడా మైదానంలో ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియం మరమ్మతుకు రూ. 2కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఇటీవల టీడీపీపైనా, మంత్రి నారాలోకేష్‌పైనా జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యల గురించి బాలకష్ణను ప్రశ్నించగా ఆయన ఆచితూచి స్పందించారు. పవన్ వ్యాఖ్యలపై స్పందించి ఆయన్ని హీరో చేయడం తనకు ఇష్టం ఉండదని, తానే సూపర్ హీరోనని అన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చేస్తానన్నారు. మే నాటికి గొల్లపల్లి నుంచి తాగునీటిని హిందూపురం మున్సిపాలిటీకి అందేలా చూస్తామన్నారు. పిల్లల మానసిక వికాసానికి క్రీడలు ఎంతో అవసరమని, పీ.వీ. సింధు, చాముండేశ్వరీ నాథ్‌లు హిందూపురం వచ్చి విద్యార్థులను ప్రోత్సహిస్తామని తనకు హామీ ఇచ్చారని చెప్పారు. శిథిలావస్థకు చేరిన ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియాన్ని రూ. 2 కోట్లతో మరమ్మతులు చేయిస్తున్నట్లు తెలిపారు.

కల్తీని అరికట్టాల్సిన బాధ్యత ప్రజలపైనే ఉంది

- కల్తీ అనేది విశ్వవ్యాప్తంగా మారింది
- రాష్ట్రంలో డిజిటల్ విధానాలు, ఈ మార్కెటింగ్ విధానాలు అమల్లోకి తెస్తున్నాం
- పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

విజయవాడ, సూర్య బ్యూరో : సమాజంలో వివిధ వస్తువుల కల్తీ, మోసాలు చేసేవారిని అరికట్టడంతో పాటు వారి మోసాలు నుంచి వినియోగదారులను కాపాడటానికి, వాటిని అరికట్టడానికి ప్రభుత్వం చిత్తశుద్ధిగా కృషి చేస్తుందని పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. శనివారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం 2018 సందర్భంగా ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ముఖ్య అతిథిగా పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అమెరికాలో 1962 సంవత్సరంలో జాన్ ఎఫ్ కెనడీ వినియోగదారుల హక్కులను మొదటిగా ప్రస్తావించారన్నారు. వినియోగ దారుల హక్కులు ఏ విధంగా ఉండాలో చూపించిన రోజు మార్చి 15 అని ఆ రోజు నుంచి ఈ రోజు వరకు వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటున్నామన్నారు. ప్రభుత్వ పరంగా వినయోగదారుల హక్కులను కాపాడుతున్నామని, వాటిని కాపాడుకోవటానికి ప్రజలు తమ వంతు కర్తవ్యాన్ని వారు నిర్వర్తించాలని తెలిపారు. అప్పుడే వివిధ వస్తువులలో జరిగే కల్తీలు, మోసాలు అరికట్టడానికి వీలు ఏర్పడుతుందన్నారు. మోసం చేసేవారిని ప్రశ్నించే తత్వం ప్రజలలో రావాల్సిన అవసరం ఉందని, అప్పుడే ఇలాంటి మోసాలను అరికట్టవచ్చన్నారు. వినియోగదారుల హక్కులను కాపాడుకోవటానికి వారిలో చైతన్యం రావాల్సిన అవసరం ఉందన్నారు. డిజిటల్ విధానాలపై ప్రజలలో ఇంకా అవగాహన రావాలని దానికి బ్యాంకులు కూడా గ్రామలలో ఉండాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో సాంకేతిక అంశాలు ఉపయోగించటంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎంతో ముందు ఉందన్నారు. వినియోగదారుల హక్కులకు సంబంధించి రాష్ట్రంలో ప్రజలు సంతృప్తి లెవెల్స్ పెరుగుతున్నాయన్నారు.

రాష్ట్రంలో డిజిటల్ విధానాలు, ఈ మార్కెటింగ్ విధానాలు అమలు లోకి తెస్తున్నామన్నారు. పెట్రోల్ పంపుల్లో మోసాలు, మాల్స్‌లో మోసాలు, సినిమా హాల్స్‌లో మోసాలను అరికట్టగలిగామన్నారు. ప్రీ ప్యాక్డ్ వస్తువులు అమ్మరాదని సెంట్రల్ కోర్టు జనవరి 2018 లో తీర్పు ఇచ్చిందన్నారు. వినియోగదారుల హక్కులు గుర్తిస్తే సమాజంలో మార్పు సాధ్యమౌతుందన్నారు. వినియోగదారుల హక్కుల కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవటంతో పాటు ప్రజలకు పథకాల విధానాలు ఎలా ఉన్నాయో తెలుసుకోవటానికి రియల్ టైమ్ గవర్నెన్స్ 1100 ద్వారా తెలుసుకుంటు న్నామన్నారు. రాబోయే ఆగస్టు 15 కల్లా వినియోగ దారుల హక్కుల కోసం పోరాడే వారికి అవార్డులు ఇచ్చి ప్రోత్సహిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసే 6,500 చంద్రన్న విలేజ్ మాల్స్ లలో డ్వాక్రా సంఘాల ఉత్పత్తులు, గిరిజన ఉత్పత్తులు, ఎమ్ఎన్ఎసీ కంపెనీల ఉత్పత్తులు సబ్సిడీపై ఏర్పాటు చేయనున్నామన్నారు.



ప్రభుత్వం సాధ్యమైనంత వరకు ప్రజలకు మేలైన వస్తువులతో పాటు తక్కువ రేటుకు వస్తువులు అందించే విధంగా చర్యలు తీసుకువస్తున్నామన్నారు. రాష్ట్ర ఆహార కమీషన్ చైర్మన్ జేఆర్ వుష్ప రాజ్ మాట్లాడుతూ అటు ప్రభుత్వానికి, ఇటు వినియోగ దారుల హక్కులను కాపాడటానికి వారధిగా వుడ్ కమీషన్ పనిచేయాల్సి ఉంటుం దన్నారు. కల్తీ అనేది విశ్వవ్యాప్తంగా మారిందని దానిని అరికట్టా ల్సిన అవసరం ప్రభుత్వం, ప్రజలుపై ఉందన్నారు. క్షేత్ర స్థాయిలో జరుగుతున్న పరిస్థితులను తెలుసు కోవ టానికి అధికార యంత్రాంగం గ్రామాలలో పర్యటించాల్సిన అవసరం ఉందని, దాని వలన సమస్యలు పరిష్కారం అవటానికి అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం పెట్టే ప్రతి పైసా పేదలకు అందాలన్నదే ప్రభుత్వం ధ్యేయమని తెలిపారు. ప్రజల్లో అవగాహనకు వినియోగదారుల హక్కుల సంఘాలు కృషి చేయాలన్నారు. ఇతర రాష్ట్రాలతో పోల్చుకుంటే ఏపీలో వినియోగదారుల హక్కులపై అవగాహనకు పలు చర్యలు తీసుకోవటం జరిగిందన్నారు. వినియోగదారుల్లో ప్రశ్నించే తత్వం వచ్చినవ్పుడే మోసాలు తగ్గటానికి అవకాశం ఉందన్నారు.

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గద్దే అనురాధ మాట్లాడుతూ ఉప్పు, పప్పు ల కోసం గ్రామాల ప్రజలు నగరాలకు వెళ్లకుండా ఉండటానికి విలేజ్ మాల్స్ ఏర్పాటు చేయటం మంచి పరిణామమన్నారు. మహిళలకు శానిటరీ నాప్‌కిన్స్ అందిస్తున్నందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ వివిధ శాఖలు ఎంత పగడ్బందీగా చర్యలు తీసుకుంటున్నా కల్తీలు జరుగుతున్నాయని, వీటిని అరికట్టడానికి ప్రత్యేక విధానంతో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు.

సివిల్ సప్లైస్ కమీషనర్ బి. రాజశేఖర్ మాట్లాడుతూ నిస్వార్థంగా వినియోగ దారుల హక్కుల కోసం వినియోగదారుల సంఘాలు రాష్ట్రంలో పనిచేస్తున్నా యన్నారు. వినియోగదారులను కల్తీలు, మోసాల నుంచి రక్షించేందుకు వారికి ఒకపక్క అవగాహన కల్పిస్తూనే వారితో కలసి పనిచేస్తున్నామన్నారు. ప్రజలకు వినియోగదారుల చట్టాల గురించి అవగాహన రావాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా కలెక్టర్ బి.లక్ష్మీకాంతం మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మార్చి 18న ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం మరియు డిసెంబర్ 24న జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం జరువుకుంటు న్నామన్నారు. ప్రతి సంవత్సరం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం రోజున ఒక అంశాన్ని తీసుకోవటం జరగుతుందన్నారు. అందులో భాగంగా ఈ సంవత్సరం డిజిటల్ మార్కెట్లలో నిజాయితీని పెంపొందించటం అనే అంశాన్ని తీసుకోవటం జరిగిందన్నారు. ప్రశ్నించే తత్వం ఉన్న చోట న్యాయం ఉంటుం దని, అదే విధంగా వినియోగదారులలో చట్టాలపై ప్రజలకు అవగాహన రావాల్సి ఉంటుందన్నారు. ప్రతి కొనుగోలులో ఎమ్ఆర్‌పీని చెక్ చేయటం తో పాటు, బిల్లు తీసుకునే అలవాటు ప్రతి ఒక్కరికీ ఉండాలన్నారు. జిల్లాలో ఉన్న మాల్స్, సినిమా హాల్స్‌లో ఎమ్ఆర్‌పీలలో ఉన్న తేడాలను సరిచేశామని, అతిక్రమించిన వారిపై ఫైన్‌లు వేయటం జరిగిందన్నారు.

కృష్ణా జిల్లా వినియోగదారుల ఫోరం అధ్యక్షులు ఆర్. మాదవ పట్నాయక్ మాట్లాడుతూ వినియోగదారులు అసత్య ప్రకటనలతో మోసపోతున్నారని దానిని మీడియా సహకారంతో మంచి పబ్లిసిటీతో తిప్పి కొట్టవచ్చన్నారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం కార్యక్రమం లో జేసీ2 మరియు జిల్లా రిడ్రసెల్ అధికారు బాబురావు, జాయింట్ కలెక్టర్ విజయ కృష్ణన్, ఆర్డీవో అంబేద్కర్, డీఎస్‌వో నాగేశ్వరరావు, ఏఎస్‌వో ఉదయ భాస్కర్, వుడ్డ కంట్రోలర్ పూర్ణ చంద్రరరావు, తూనికలు కొలతుల శాఖ అధికారులు పీఎస్ఆర్ఎన్‌టీ స్వామి,కృష్ణ చైతన్య, రామ్ కుమార్, వివిధ జిల్లాలకు చెందిన వినియోగదారుల హక్కుల కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


విశాఖ ఘటనపై హోమ్‌మంత్రి ఆరా



అమరావతి, సూర్య ప్రతినిధి : విశాఖ జిల్లా నక్కపల్లి మండలం ఉపమాక గ్రామంలో నలుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయిన ఘటనపై ఏపీ హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప ఆరా తీశారు. దీనిపై విచారం వ్యక్తం చేశారు. విశాఖ జిల్లా ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఘటనాస్థలికి పోలీసు బృందాల్ని పంపి సహాయక చర్యల్ని చేపట్టాలని ఎస్పీని ఆదేశించారు. ఉపమాక గ్రామంలో మరుగుదొడ్డి కోసం తవ్విన ట్యాంకులో నిలిచిన నీటిని తోడేందుకు దిగి ఓ వ్యక్తి అందులో పడిపోయాడు. అతడిని రక్షించేందుకు అతని సోదరులు ముగ్గురు దిగగా.. నలుగురూ ఊపిరా డక ప్రాణాలు కోల్పోయారు. మరొకరు అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో అతడిని హుటాహుటిన ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పోలవరంపై ఏ విచారణకైనా సిద్ధం

ఏపీ జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు



వెలగపూడి, సూర్య ప్రతినిధి : మాపై సీబీఐ విచారణ జరపించాలని కేంద్రాన్ని కోరుతున్నారని, పోలవరంపై ఏ విచారణకైనా సిద్ధమని, ప్రాణత్యాగం చేసైనా ప్రాజెక్టు నిర్మిస్తామని ఆంధ్రప్రదేశ్ నీటి పారుదల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు స్పష్టం చేశారు. శనివారం విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రతిపక్షనేత జగన్ చేయించిన ఫిర్యాదుల కారణంగానే పోలవరం పనుల్లో జాప్యం జరిగింద న్నారు. ప్రాజెక్టు కోసం జైలుకెళ్లేందుకైనా సిద్ధమని వెల్లడించారు. పోలవరం పనులు ఇప్పటికి 54.4శాతం పూర్తయ్యాయని తెలిపారు. పోలవరం టెండర్లలో బేరసారాలు కుదరకే వైసీపీ పుట్టిందని ఉమా విమర్శించారు.

జాతీయ పార్టీలపై విశ్వాసం పోతోంది

వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



గుంటూరు, సూర్య ప్రతినిధి : జాతీయ పార్టీలపై ప్రజలు విశ్వాసం కోల్పోతున్నారని తెదేపా జిల్లా అధ్యక్షులు, వినుకొండ ఎమ్మెల్యే ఆంజనేయులు వ్యాఖ్యానించారు. గుంటూరులో ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ ఎన్డీయే నుంచి బయటికి వచ్చి తేదేపా అవిశ్వాసం పెడితే తమ పార్టీపై పైవున్న విశ్వాసంతో అనేక జాతీయ పార్టీలు మద్దతు తెలిపాయని ఆయన చెప్పారు. భాజపా ఇచ్చిన సలహాలకు అనుగుణంగానే జగన్ వ్యవహరి స్తున్నా రంటూ ధ్వజమెత్తారు. గుంటూరు నగరంలో గత కొన్ని రోజులుగా అతిసార ప్రబలిన వెంటనే ప్రభుత్వం సహాయక చర్య లు చేపట్టి.. కారకులపై చర్యలు తీసుకుందని చెప్పారు. అతి సార ఘటనను జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అవకాశ వాద రాజకీ యాలకు ఉపయోగించుకోవడం దురదృష్టకరమన్నారు. ఈ ఘటనను కులాలు, మతాలతో ముడిపెట్టి మాట్లడటం సరికా దని ఇది పవన్ అవివేకానికి నిదర్శనమని విమ ర్శించారు. అనంతరం మీడియాతో మాట్లా డుతూ రాష్ట్ర ప్రభుత్వం పాలనా వ్యవస్థను ప్రక్షాళన చేయా ల్సిన అవసరం ఉందన్నారు. గుంటూరులో మెడికల్ ఎమర్జెన్సీ ప్రకటించాలని, ఓ ప్రత్యేక అధికారిని నియ మించాలని డిమాండ్ చేశారు.


నూకాలమ్మకు పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి సోమిరెడ్డి



విశాఖపట్నం, సూర్య ప్రతినిధి : అనకాపల్లి నూకాలమ్మ కొత్త అమావాస్య జాతర వైభవం గా జరిగింది. ప్రభుత్వం తరపున శనివారం రాష్ట్ర మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, అయ్యన్న పాత్రుడు పట్టువస్త్రాలు సమర్పిం చారు. ఎంపీ అవంతి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు గిడ్డి ఈశ్వరి, పీలా గోవింద్ అమ్మ వారిని దర్శించుకున్నారు. జాతర సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు.

బాబూ మా ప్రశ్నలకూ సమాధానం చెప్పాలి

బీజేపీ ప్రధాన కార్యదర్శి రామ్ మాధవ్



న్యూఢిల్లీ, సూర్య ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కి చంద్రబాబు కంటే ఎక్కువ నిబద్ధతతో ఉన్నామని బీజేపీ ప్రధాన కార్యదర్శి రామ్ మాధవ్ అన్నారు. భవిష్యత్‌లోనూ ఏపీ అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. అమిత్‌షాతో భేటీ అనంతరం మీడియాతో మాట్లాడిన రాంమాధవ్ సెంటిమెంట్‌కు అభివృద్ధితోనే సమాధానం చెబుతామని అన్నారు. ఇప్పటి వరకూ చంద్రబాబు ప్రశ్నలు వేస్తున్నారని, వాటన్నింటికీ సమాధానం చెబుతామని, అదేవిధంగా తాము అడిగే ప్రశ్నలకూ సీఎం చంద్రబాబు సమాధానం చెప్పాల్సి ఉంటుందన్నారు.

హుద్‌హుద్ స్ఫూర్తి గుంటూరులో ఏమైంది


మునిసిపల్ అధికారులపై మండిపడ్డ సీఎం చంద్రబాబు



వెలగపూడి, సూర్య ప్రధాన ప్రతినిధి : గుంటూరు దుర్ఘటన శాఖాపరమైన వైఫల్య మని ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు మున్సిపల్ అధికారు లపై మండిపడ్డారు. ఒక వ్యక్తి వైఫల్యం పదిమంది మృతికి కారణం కావడం దుర దృష్టకరమని విచారం వ్యక్తం చేశారు. బాధితులను పరామర్శించలేక పోవటంతో పాటు పరిహారం కూడా అందించలేక పోయారని తీవ్ర అసంతృప్తిని సీఎం వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్లు, అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వ హించిన సీఎం అధికారుల నిర్లక్ష్య వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విపత్తు వస్తే దానిని చక్కదిద్దేవరకూ వదిలిపెట్టకూడదని, విశాఖలో హుద్ హుద్ అప్పుడు వ్యవహరించిన స్ఫూర్తి గుంటూరులో ఏమైందని ప్రశ్నించారు. స్థానికంగా వైఫల్యం చెందితే ఉన్నతస్థాయి యంత్రాంగం చక్కదిద్ద కుండా ఏం చేస్తోం దంటూ నిలదీశారు. అధికార యంత్రాంగం పనితీరు ప్రభుత్వ గౌరవం పెంచేదిగా ఉండాలని, తప్పు జరగకూడదని, ఒకవేళ జరిగితే సకాలంలో సమర్థంగా సరిదిద్దాలని హితవు పలికారు. ఉదాసీనత, నిర్లక్ష్యాన్ని సహించేది లేదని తేల్చి చెప్పారు. రోడ్లు తవ్వడం, గుంతలు అలాగే వదిలేయడంతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతాయనే కనీస స్పృహ లేకుండా మున్సిపల్ శాఖ పనిచేస్తోందా అంటూ సీఎం ప్రశ్నించారు. పైపులైన్ల లీకేజీలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించా లన్నారు. మురుగు కాలువలన్నీ శుభ్రపరచాలని ఆదేశించారు. శిథిలావస్థకు చేరిన పాత పైపులైన్లు తొలగించి కొత్తలైన్లు వేయా లన్నారు. పట్టణ ప్రజల ఆరోగ్య రక్షణ బాధ్యత అధికార యంత్రాంగా నిదేనని స్పష్టం చేశారు. తాగునీటి నమూనాలు సేకరించాలని, సురక్షిత తాగునీటిని సరఫరా చేయా లని ఆదేశించారు. ఇటువంటి దుర్ఘటనలు పునరా వృతం కారాదని హెచ్చరిం చిన ముఖ్య మంత్రి చంద్రబాబు, సెన్సార్ ద్వారా నీటి కాలు ష్యంపై పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. మున్సిపల్ శాఖ,వైద్య ఆరోగ్య శాఖలు సమన్వ యంగా పనిచేయాలని సూచించారు.

రాములోరి పెళ్లికి చంద్రబాబు

- రూ. 5 కోట్లతో భక్తులకు వసతి సముదాయం
- ప్రారంభించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- కల్యాణానికి లక్షన్నర మందికి పైగా హాజరయ్యే అవకాశం
- భద్రత ఏర్పాట్లపై పోలీసు అధికారుల దృష్టి



కడప, సూర్య ప్రతినిధి : రామయ్య పెళ్లికి చంద్రబాబు నాయుడు హాజరు కానున్నారు. ఆంధ్ర భద్రాద్రిగా పేరొందిన ఒంటిమిట్ట కోదండ రామ స్వామి కల్యాణోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరవుతున్నారు. ఈ మేరకు జిల్లా ఉన్నతాధి కారులకు ప్రాథమిక సమాచారం అందింది. సీఎం పర్యటనను దృష్టిలో ఉంచు కుని అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేసేందుకు కసరత్తు ఆరంభిం చారు. ఒంటిమిట్ట ఆలయం టిటిడి ఆధ్వర్యంలోకి చేరిన తరవాత నిర్వహించిన తొలి కల్యాణో త్సవానికి ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారికంగా హాజరయ్యారు. సతీసమేతంగా ప్రభుత్వం తరపున స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు అందజేసి ప్రగతి కార్యక్ర మాలకు శ్రీకారం చుట్టారు. గత ఏడాది జరిగిన ఉత్సవాలకూ సీఎం హాజరవుతారని తొలుత భావించినా చివరిక్షణంలో వాయిదా పడింది. సదరు ఉత్సవాలకు సీఎం హాజరు కాక పోవ డంపై అప్పట్లో చర్చ నడిచింది. పలు అభివృద్ధి పనులు పూర్తయి, ప్రారంభో త్సవానికి సిద్ధం కాగా సీఎం లేక వాయిదా పడ్డాయి. ఇక, అప్పటి నుంచి ఇప్పటి వరకు అవి ప్రారంభానికి నోచు కోలేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఉత్సవాల్లో ఆ పను లకు చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభిం చేందుకు టీటీడీ వర్గాలు సన్నాహాలు చేస్తున్నాయి. ఈనెల 30న రాత్రి 8 గంటలకు సీతారాముల కల్యాణో త్సవం జరగనుంది. ఈ ఉత్సవానికి ముఖ్య మంత్రి హాజరు కానున్నారు. ఉదయం నుంచే వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్న సీఎం చంద్రబాబు టీటీడీ ఆధ్వర్యంలో రూ. 5 కోట్లతో నిర్మించిన భక్తుల వసతి సముదాయాన్ని ప్రారంభిం చనున్నారు. స్వామి వుష్కరిణి, ఉద్యాన విస్తరణ పనుల ప్రారంభోత్సవాలు చేపట్టే అవకాశం ఉంది. బాబు పర్యటనకు సంబంధించిన షెడ్యూలు ఖరారు కావాల్సి ఉంది. సీతారాముల కల్యాణోత్సవం, సీఎం పర్యటన నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారులు, పోలీసుశాఖ భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఇప్పటికే ట్రాఫిక్ ఇబ్బందులపై అధ్యయనం చేసిన జిల్లా ఎస్పీ అట్టాడ బాబూజీ, కలెక్టర్ బాబూరావునాయుడు ఒంటి మిట్ట ఆవల నుంచి ప్రత్యామ్నాయ రోడ్ల నిర్మాణానికి ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు క్షేత్ర స్థాయిలో పనులు జరుగుతున్నాయి. కల్యాణోత్స వానికి లక్షన్నర మందికి పైగా హాజరయ్యే అవకాశం ఉండటంతో ఈ మేరకు ప్రణాళికలు వేస్తున్నారు. రాత్రిపూట కార్యక్రమం అవడంతో ముఖ్యమంత్రి భద్రతను దృష్టిలో ఉంచుకుని సమీపంలోని కొండల వద్ద లైటింగ్ ఏర్పాటు చేసే దిశగా యోచన చేస్తున్నారు. ఆలయం నుంచి కల్యాణవేదిక వరకు విద్యుద్దీపాల తోపాటు భారీ లైటింగ్ ఏర్పాటుకు ఆలోచిస్తున్నారు. ప్రస్తుతం శుభలేఖల పంపిణీ ప్రక్రియ జోరందుకుంది.


ఒకటి రెండజుల్లో అధికారులు సమావేశమై ఉత్సవాల నిర్వ హణపై చర్చించ నున్నారు. మొత్తంగా ఈసారి ఉత్సవాలకు ముఖ్య మంత్రి హాజరవుతుండటం ప్రాధాన్యం సంతరించు కుంటోంది. ప్రస్తుత రాజకీయ పరిణామాల నేపథ్యంలో చివరి క్షణంలో ముఖ్య మంత్రి చంద్ర బాబు పర్యటనపై సంది గ్ధత ఏర్పడే అవకాశం ఉన్నట్లు చెబుతున్నా జిల్లా అధికారులు మాత్రం సీఎం పర్యటన ఉంటుం దనే నేపథ్యంలోనే ఏర్పాట్లు చేస్తున్నారు.

సంప్రదాయాలకు విరుద్ధంగా ఉగాది సంబరాలు

- ఆలయంలో కాకుండా కొండ దిగువన నర్సరీలో ఏర్పాటుకు రంగం సిద్ధం
- భక్తుల మనోభావాలను దెబ్బ తీస్తున్న అధికారులు

అన్నవరం (తూర్పుగోదావరిజిల్లా), మేజర్‌న్యూస్ : హిందూ ధర్మపరిరక్షణ ట్రస్టు దేవాదాయ దర్మాదాయ శాఖ ఆధీనంలో ఉన్న అన్ని దేవాలయాల్లోనూ విళంబి నామ సంవత్సర ప్రారంభ ఉగాది సంబరాలను అత్యంత వైభవంగా జరిపేందుకు ఆయా దేవాలయాల ఉన్నతాధికారులు ఇప్పటికే సన్నాహాలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రధాన దేవాలయాలలో ఉగాది సంబరాలు ఎలా ఉన్నా తూర్పుగోదావరి జిల్లాలోని అన్నవరం సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో మాత్రం కొత్త విధానానికి ఇక్కడి అధికారులు తెరతీశారు. ఆచారాలు, సాంప్రదాయాలకు అనుగుణంగా చేపట్టాల్సిన కొన్ని కార్యక్రమాలను భక్తులకు దూరం చేస్తూ సాంప్రదాయానికి విరుద్ధంగా ఉగాది సంబరాలను కొండదిగువన నర్సరీ(మొక్కల పెంపకం)లో నిర్వహించేందుకు రంగం సిద్ధం చేశారు. ఏడాదికేడాది ఉగాది సంబరాలను కనీవినీ ఎరుగని రీతిలో అధికారులు నిర్వహిస్తారనుకుంటే భక్తులకు,స్థానికులకు దూరం చేస్తూ గ్రామ శివారున ఉన్న ప్రైవేటు లాడ్జిలకు ఎదురుగా ఉన్న నర్సరీలో ఏర్పాటు చేయ డంపై విమర్శలు వినిపిస్తున్నాయి. కొందరు అధికారుల స్వార్థం,స్వలాభాపేక్ష కోసం ఉగాది సంబరాలను నర్సరీలో ఏర్పాటు చేయడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతీ ఏటా ఉగాది సంబరాలను అన్నవరం కొండపై సత్యదేవుని ఆలయం పరిసర ప్రాంతంలో ఏర్పాటుచేసి అటు గ్రామస్తులను ఇటు భక్తులను అలరించేలా అంగరంగవైభవంగా నిర్వహించేవారు. కానీ దేవస్థానం సొమ్మును కొందరు అధికారులు (ప్రచారాల విభాగానికి సంబంధించి) కమీషన్లకు కక్కుర్తిపడి మంచినీళ్ళలా విచ్చలవిడిగా ఖర్చు చేస్తుండడంపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో చాలా పకడ్బందీగా ఈ ఉగాది సంబరాలను భక్తులకు దూరం చేస్తూ నర్సరీలో నిర్వహించడం వెనుక ఆంతర్యమేమిటో సత్యదేవునికే తెలియాలి. దేవస్థానం ఉన్నతాధికారులు సైతం కొందరు కిందిస్థాయి అధికారుల ప్రలోభాలకు తలొగ్గి వారు చెప్పిందే వేదంగా భావిస్తూ సాంప్రదాయాలకు తిలోదకాలు వదులుతున్నారనే విమర్శలు వస్తున్నాయి.?. నేటి ఉదయం కొత్త సంవత్సరం ప్రారంభమవుతున్న దృష్ట్యా సత్యదేవుని సన్నిధిలో కేవలం పంచాంగశ్రవణం కార్యక్రమం మాత్రమే నిర్వహించి మిగతా కార్యక్రమాల్ని అధికారులు, సిబ్బంది కుటుంబాల కోసం జూనియర్ కాలేజీ పక్కనున్న నర్సరీలో ఏర్పాటు చేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దేవాలయాల ఆదాయాలకు మార్గదర్శకులైనటువంటి భక్తులపై ఇంత చిన్న చూపా? అంటూ స్థానికులు మండిపడుతున్నారు. అంతేగాక దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే పలు కార్యక్రమాలు కూడా అధికారులకు వీలుగా మలుచుకుంటున్నారనే ఆరోపణలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా దేవస్థానం ఉన్నతాధికారులు కింది స్థాయి అధికారుల ప్రలోభాలపై దృష్టిసారించాలని మేధావులు సూచిస్తున్నారు.






ప్రజారోగ్యం పారిశుద్ధ్య పరిరక్షణకు జనసేన కమిటీ

పవన్‌తో గుంటూరు యువత భేటీ



గుంటూరు, మేజర్‌న్యూస్ : గుంటూరులో పారిశుధ్ధ్య వ్యవస్థ అస్తవ్యస్తం కావడం... ప్రజల ప్రాణాలుపోతున్నా పట్టించుకోక పోవడం పాలనా వ్యవస్థ వైఫల్యానికి అద్దం పడుతుందని జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ అన్నారు. ఈ వైఫల్యాన్ని జనసేన ఎండగట్టడమే కాదని... ప్రజారోగ్యం పారిశుధ్యం పరిరక్షణ, పర్య వేక్షణకు కమిటీ నియమిస్తున్నట్లు ప్రకటించారు. పన్నులు కట్టించుకొంటున్న ప్రభుత్వం ప్రజల కనీస అవసరమైన శుద్ధమైన తాగునీరు, మెరుగైన వైద్య సేవలు కూడా అందించలేకపోతుంది.. ఈ విధానంలో మార్పు తెచ్చేలా ఈ కమిటీ పనిచేస్తుందని తెలిపారు. శనివారం రాతి విజయవాడలోని పార్టీ కార్యాలయంలో గుంటూరు, జిల్లాలోని ఇతర ప్రాతాలనుంచి వచ్చిన యువతతో భేటీ అయ్యారు. గుంటూరు నగరంలో బాధితులని చూస్తే నగర పాలక సంస్థ ఆ ప్రాంతాలని కనీసం పట్టించుకోవడం లేదని అర్ధమవుతొందన్నారు. రాజకీయాలు ఎన్నికల వరకే చేయాలి...అధికార పక్షాన్ని గెలిపించకపోతే పట్టించుకోకపోవడం దారుణం అన్నారు. షేక్ నాగూర్ బాషా, పఠాన్ జఫరుల్లాఖాన్, షేక్ ఆఫ్రిది, యర్రగోవుల జయదీప్, గాజుల మణికంత, శ్రీనివాస్ కమిటీలో సభ్యులు. ఈ కమిటీకి బి.రవి కిరణ్ సాంకేతిక సహాయం అందిస్తారు.


మంత్రి కొల్లు రవీంద్రకు తప్పిన ప్రమాదం



విజయవాడ, సూర్య ప్రతినిధి : ఏపీ మంత్రి కొల్లు రవీందక్రు ప్రమాదం తప్పింది. మంత్రి కారులో వెళుతుండగా కంకిపాడుకు సమీపంలో ఎదురుగా బైక్ రావడంతో ఎస్కార్ట్ వాహనం డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో ఎస్కార్ట్ వాహనాన్ని కొల్లు రవీంద్ర వాహనం ఢీకొట్టింది. అయితే ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కూడా కాకపోవడంతో సిబ్బంది ఊపిరి పీల్చుకుంది. విజయవాడకు వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటన అనంతరం కొల్లు రవీరద్ర మరో వాహనంలో విజయవాడకు వెళ్లారు. కాగా ఈ ప్రమాదానికి సంబంధించి మరింత సమాచారం తెలియాల్సి ఉంది.

11 పార్టీలతో యునైటెడ్ ఫ్రంట్ ఏర్పాటు

ఎన్‌డిఏకు చెక్‌పెట్టేందుకు ముమ్మర యత్నాలు



న్యూఢిల్లీ, సూర్య ప్రతినిధి : ఎన్డీయేకు చెక్ పెట్టేందుకు ముమ్మర యత్నాలు జరుగుతున్నట్లు ఓ జాతీయ ఛానల్ కథనం పేర్కొంది. 11 పార్టీలతో యునైటెడ్ ఫ్రంట్ ఏర్పాటుకు సన్నా హాలు జరుగుతున్నట్లు తెలిపింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగు దేశం అధినేత చంద్రబాబు నాయుడు వివిధ పార్టీలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో వచ్చే నెలలో మహానాడు నిర్వహించాలని ప్రయత్నిస్తున్నట్లు పేర్కొంది. యునైటెడ్ ఫ్రంట్ మొదటి సమావేశం వచ్చే నెల 7న జరుగుతుందని పేర్కొంది. శరద్ పవార్ (నేషనలిస్ట్ కాంగ్రెస్), మమత బెనర్జీ (టీఎంసీ), మాయావతి (బీఎస్‌పీ), స్టాలిన్ (డీఎంకే), అఖిలేశ్ యాదవ్ (సమాజ్‌వాదీ పార్టీ), ఫరూఖ్ అబ్దుల్లా (నేషనల్ కాన్ఫరెన్స్), అరవింద్ కేజ్రీవాల్ (ఆప్), నవీన్ పట్నాయక్ (బీజేడీ), ఓం ప్రకాశ్ చౌతాలా (ఇండియన్ నేషనల్ లోక్‌దళ్), అసోం గణపరిషత్ (ఏజీపీ)లతో చంద్రబాబునాయుడు మాట్లాడినట్లు ఆ కథనం పేర్కొంది.

అసత్యప్రచారం సఫలం కాదు : బిజేపీ

విజయవాడ, సూర్య బ్యూరో : తాము ఎదగడం కోసం రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు భారతీయ జనతా పార్టీపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాయని బిజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమ్ముల శ్యాంకిషోర్ తెలుగు దేశం, వైఎస్ఆర్‌సీపీలను విమర్శించారు. రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం, వైఎస్ఆర్‌సీపీలకు రాష్ట్ర అభివృద్ధి అవసరం లేదని సొంత ప్రయోజనాలే ముఖ్యమన్నారు. ప్రజల సమస్యలను ప్రస్తావించి వాటి పరిష్కారానికి పోరాడాల్సిన జగన్ శాసన సభా సమావేశాను బహిష్కరించి బాధ్యత లేకుండా ప్రవర్తిస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి భారతీయ జనతా పార్టీ కట్టుబడి ఉందని అన్నారు. విభజనచట్టంలో పేర్కొన్న సంస్థలను పదేళ్లలో ఏర్పాటు చేయాలని ఉన్నా కేవలం మూడున్నరేళ్లలోనే 85శాతం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు చొరవతో కడపలో ఉక్కు కర్మాగారం ఏర్పాటుకు, విశాఖ రైల్వేజోన్ ఏర్పాటుకు సానుకూల నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు. 2014-15 ఏడాదికి రెవెన్యూ లోటు ఆధారంగా మరో రూ.1,600 కోట్లు ఇచ్చేందుకు కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ సంసిద్ధతను వ్యక్తం చేశారని అయితే దానికి రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రాలేద న్నారు. బిజెపి జాతీయ అధ్యక్షులు అమిత్‌షా, రాష్ట్ర అభివృద్ధి కోసం చర్చకు సీఎంని పిలిస్తే ఆయన రాకుండా మంత్రులను, అధికారులను పంపారని విమర్శించారు. పవన్ కల్యాణ్ వెనుక బిజేపీ ఉందని టీడీపీ విమర్శించడం సరికాదన్నారు. కేంద్రంపై బురదజల్లడం ద్వారా తమపై ఉన్న వ్యతిరేకతను రుద్దే ప్రయత్నం సఫలం కాదని తెలుగుదేశం పార్టీని హెచ్చరించారు. రాష్ట్ర కోర్ కమిటి సమావేశం ఢిల్లీలో జరుగు తుందని పార్టీ బలోపేతంపై జాతీయ అధ్యక్షులు అమిత్‌షా మార్గనిర్దేశనం చేస్తారని చెప్పారు.



అభివృద్ధిలో కలసి రండి

- నాబార్డు సమీక్షలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు
- 2018-19 కి రుణ ప్రణాళిక అంచనా రూ. 1,65,043 కోట్లు
- నాబార్డు స్టేట్ ఫోకస్ పేపర్ 2018-19ను ఆవిష్కరించిన సీఎం

అమరావతి, సూర్య ప్రధాన ప్రతినిధి : ఈ ఏడాది పోషకాహార లోపం, రక్తహీనత, హృదయశస్త్ర చికిత్సల్లో స్టెంటులపై తాము ప్రధానంగా దృష్టి పెట్టా మని నాబార్డు ఇందుకు సహకరించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజ్ఞప్తి చేశారు. నాబార్డు జలసంరక్షణ ఇతివృత్తంగా రూపొందించిన స్టేట్ ఫోకస్ పేపర్ 2018-19 ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్రాభివృద్ధికి నాబార్డు అందిస్తున్న సహకారాన్ని, నాబార్డు భాగస్వామ్యంపై సమీక్షించారు. నాబార్డు ప్రజెంటేషన్ చాలా బాగుందని, రాష్ట్రాభివృద్ధిలో నాబార్డు ప్రభుత్వ విభాగాలతో కలసి పనిచేయడాన్ని స్వాగతిస్తున్నానన్నారు. అవగాహన లేకుండా పనిచేస్తే సత్ఫలితాలను సాధించ లేమని అన్నారు. నాబార్డు సహా అనేక బ్యాంకులు ఒకప్పుడు రుణాలిచ్చే సంస్థలు గానో, వ్యవస్థలుగానో ఉండేవని, ఇప్పుడు కాలానుగుణంగా అభివృద్ధిలో భాగస్వాములు కావాల్సిన అవసరాన్ని గుర్తించాయని, ఇది ఆహ్వానించదగిన పరిణామమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. పథకాల అమలును సూక్ష్మస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సమీక్షించుకుని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్థిక సంస్కరణలను తాను పూర్తిగా విశ్వసిస్తానని చెబుతూ 1995, ఆ సమయంలో వచ్చిన సంస్కరణల ప్రభావం భారత్ ఆర్థిక వ్యవస్థను తాకిందని, పీవీ నరసింహారావు సంస్కరణలను ప్రవేశపెడితే తాము ఆ సంస్కరణలను ముందుకు తీసుకెళ్లామని అన్నారు. విద్యుత్తు రంగంలో ముందుగా తాను సంస్కరణలను ప్రవేశపెట్టానని, టెలికమ్యూనికేషన్ల అభివృద్ధికి తాను అండగా నిలిచానని గుర్తు చేశారు. మైక్రో ఇరిగేషన్ పై తాను ఒకనివేదిక రూపొందించానని, అది అనేక విభాగాలకు ఒక మార్గదర్శినిలా నిలిచిందని సీఎం చెప్పారు. జలవనరుల అభివృద్ధికి తాము అగ్రప్రాధాన్యతనిస్తున్నామని, ఈ ఏడాది 16శాతం వర్షపాతం తక్కువగా ఉన్నప్పటికీ వ్యవసాయంలో 17.78 శాతం వృద్ధి రేటును నమోదు చేసినట్లు తెలిపారు. వ్యవసాయ అనుబంధ రంగాలైన ఉద్యానపంటలు, పశుగణాభివృద్ధి, పాడిపరిశ్రమ, మత్స్య సంపద, మాంసం, కోళ్ల విభాగాలపై దృష్టిపెట్టి పనిచేస్తున్నామన్నారు. సాధ్యాసాధ్యాలు పరిశీలించకుండా ఏ పనినైనా తలపెడితే ఫలితాలుండవని అన్నారు. గత ఏడాది కేంద్ర ప్రభుత్వం పప్పు ధాన్యాలకు ప్రోత్సాహకాలిచ్చిందని చెప్పారు. ఇప్పుడు వ్యూహం మారిందని తెలిపారు. నగదు లావాదేవీల కంటే డిజిటల్ కరెన్సీ పెరిగితే మంచి జరుగుతుందని, కుంభకోణాలకు ఆస్కారం ఉండదని, అన్నీ ఆన్‌లైన్‌లో కార్యకలాపాలు జరిగుతాయని, పన్నుల చెల్లింపు సవ్యంగా ఉంటుందని ముఖ్యమంత్రి చెప్పారు. ఆర్థికా భివృద్ధిలో తాము దేశంలో సగటున అగ్రగామిగా నిలిచామని, గుజరాత్ లో పోటీపడుతున్నామని, ఈ ఏడాది గుజరాత్ ఆర్థిక ఫలితాలను ప్రకటించలేదని చెప్పారు. తాము కచ్చితంగా దేశంలో నెంబర్-1గా ఉండబోతున్నామని ఘంటాపదంగా చెప్పగలనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సామాజిక న్యాయం, ఆర్థికాభివృద్ధి, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకోసం సమష్టిగా పనిచేస్తే సత్ఫలితాలు సిద్ధిస్తా యన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో నవ్యావిష్కరణ ప్రాజెక్టులు చేపట్టాలని నాబార్డును ఆహ్వానిస్తున్నామన్నారు. దీనిపై తమకెంతో ఆసక్తి ఉందని చెప్పారు. ఏకపక్షంగా వెళితే ఏదీ సాధించలేమని, అందరూ కలసి పద్ధతిగా, ఐక్యతతో పనిచేయాలని, అప్పుడే లక్ష్యాలు నెరవేరతాయన్నారు. ప్రతి మూడేళ్ల కొకసారి తమ విజన్ ను సమీక్షిస్తానని, మూడు నెలలకు ఒకసారి రెండంకెల వృద్ధి, సుస్థిర ఆర్థికాభివృద్ధిపై సమీక్ష జరిపి బేరీజు వేసుకుంటామని తెలిపారు. ఈ దిశగా తమకు నాబార్డు సహకారం అందించాలని కోరారు. మన వనరులను సామాజికాభివృద్ధికోసం ఉపయోగించుకున్నంత కాలం మేలు జరుగుతుందని తెలిపారు. సమ్మిళిత విధానం, సమన్వయం తమ విజయ రహస్యాలని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. గ్రామాలలో అన్ని సదుపా యాలు కలుగజేయాలన్న లక్ష్యంతో ఐదు భద్రతలను పౌరులకు అందిస్తు న్నామని అన్నారు. విద్యుత్తు భద్రత, గ్యాస్ భద్రత, సామాజిక భద్రత, నీటి భద్రత, ఆహార భద్రతా కల్పనలో నాబార్డు సహకారం అందించాలని ముఖ్య మంత్రి విజ్ఞప్తి చేశారు. నెలకు ఒక్కో కుటుంబం రూ.10 వేల ఆదాయం సమ కూర్చుకునే విధంగా తీర్చిదిద్దుతున్నామని, స్వయం సహాయక సంఘాల ద్వారా పేదరికాన్ని నిర్మూలించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషిచేస్తున్న సంపద సృష్టి జరగాలని, సంక్షేమం ఉండాలని, పబ్లిక్-ప్రైవేటు భాగస్వామ్యంతో సత్ఫలి తాలు



వస్తాయని నా విశ్వాసం, నా అనుభవం అని ముఖ్యమంత్రి తెలిపారు. పనితీరు సమీక్షలో ఎక్కడ వెనుకబడి ఉన్నామో, ఎక్కడ సామర్థ్యంతో పని చేయలేదో, ఎక్కడ ఫలితాలు రాలేదో ఆ రంగంలో లోటుపాట్లను సరిదిద్దుకుని ముందుకు సాగుతానని సీఎం వివరించారు. వీడియో కాన్ఫరెన్స్యద్వారా అధి కార యంత్రాంగంతో అనుసంధానం చేసు కుంటానని, జన్మభూమి కమిటీలు, పంచాయతీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేస్తానని తెలిపారు. ఇదిలా ఉంటే, స్టేట్ ఫోకస్ పేపర్ 2018-19 నాబార్డు తన రుణ ప్రణాళికా లక్ష్యాలను, విజన్‌ను వివరించింది. 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేసే ప్రభుత్వ కృషికి దన్నుగా నిలుస్తుందని నాబార్డ్ పేర్కొంది. ప్రాధాన్యతా రంగానికి 2018-19 కి మొత్తం రుణ ప్రణాళిక అంచనా రూ. 1,65,043 కోట్లు అని, 2018-19 లో వ్యవసాయ, అనుబంధ రంగాల రుణ ప్రతిపాదనల అంచనా రూ.1,06,316 కోట్లు గా ఉందని వివరించింది. నాబార్డు జీఎం కె.ఎస్ రఘుపతి స్వాగతోపన్యాసమిచ్చారు. ఆంధ్రప్రదేశ్ లో నాబార్డు సహాయంతో కొనసాగుతున్న ప్రాజెక్టులు, నాబార్డు ప్రాయోజిత ప్రాజెక్టులపై ఆంధ్రప్రదేశ్ రీజినల్ ఆఫీస్ సీజీఎం కె. సురేశ్ కుమార్ వివరించారు. సమావేశంలో రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ డైరెక్టర్ ఆర్ సుబ్రహ్మణియన్, ప్రణాళికా మండలి వైస్ ఛైర్మన్ చెరుకూరి కుటుంబరావు, ముఖ్యమంత్రి కార్యదర్శులు ఎ.వి రాజమౌళి, గిరిజాశంకర్ పాల్గొన్నారు.

ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం 2018

విజయవాడ, సూర్య బ్యూరో : సమాజంలో వివిధ వస్తువుల కల్తీ, మోసాలు చేసేవారిని అరికట్టడంతోపాటు వారి మోసాలు నుంచి వినియోగదారులను కాపాడటానికి, వాటిని అరికట్టడానికి ప్రభుత్వం చిత్తశుద్ధిగా కృషి చేస్తుందని పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. శనివారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం2018 సందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ అమెరికాలో 1962 సంవత్సరంలో జాన్ ఎఫ్ కెనడీ వినియోగదారుల హక్కులను మొదటిగా ప్రస్తావించారన్నారు. వినియోగదారుల హక్కులు ఏవిధంగా ఉండాలో చూపించిన రోజు మార్చి 15 అని ఆ రోజు నుంచి ఈ రోజు వరకు వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా జరువుకుంటున్నామన్నారు. ప్రభుత్వ పరంగా వినియోగదారుల హక్కులను కాపాడుతున్నామని, వాటిని కాపాడుకోవటానికి ప్రజలు తమ వంతు కర్తవ్యాన్ని వారు నిర్వర్తించాలని తెలిపారు. అప్పుడే వివిధ వస్తువు లలో జరిగే కల్తీలు, మోసాలు అరికట్టడానికి వీలు ఏర్పడుతుందన్నారు. రాష్ట్ర ఆహార కమీషన్ చైర్మన్ జేఆర్ పుష్పరాజ్ మాట్లాడుతూ అటు ప్రభుత్వానికి, ఇటు వినియోగదారుల హక్కులను కాపాడటానికి వారధిగా ఫుడ్ కమీషన్ పని చేయాల్సి ఉంటుందన్నారు. కల్తీ అనేది విశ్వవ్యాప్తంగా మారిందని దానిని అరికట్టాల్సిన అవసరం ప్రభుత్వం,





ప్రజలు పై ఉందన్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గద్దె అనురాధ మాట్లాడుతూ ఉప్పు, పప్పుల కోసం గ్రామాల ప్రజలు నగరాలకు వెళ్లకుండా ఉండటానికి విలేజ్‌మాల్స్ ఏర్పాటు చేయటం మంచి పరిణామమన్నారు. సివిల్ సప్లైస్ కమీషనర్ బి.రాజశేఖర్ మాట్లాడుతూ నిస్వార్ధంగా వినయోగదారుల హక్కుల కోసం వినియోగదారుల సంఘాలు రాష్ట్రంలో పనిచేస్తున్నా యన్నా రు. జిల్లా కలెక్టర్ బి. లక్ష్మీకాంతం మాట్లాడుతూ ప్రతి సంవ త్సరం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం రోజున ఒక అంశాన్ని తీసుకోవటం జరుగుతుందన్నారు. కృష్ణా జిల్లా వినియోగదారుల ఫోరం అధ్యక్షులు ఆర్. మాదవ పట్నాయక్ మాట్లాడుతూ వినియోగదారులు అసత్య ప్రకటన లతో మోసపోతున్నారని దానిని మీడియా సహకారంతో మంచి పబ్లిసిటీతో తిప్పి కొట్టవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో జేసీ2, జిల్లా రెవెన్యూ అధికారు బాబురావు, జాయింట్ కలెక్టర్ విజయ కృష్ణన్, ఆర్డీవో అంబేద్కర్, డీఎస్‌వో నాగేశ్వరరావు, ఏఎస్‌వో ఉదయ భాస్కర్, వుడ్డ కంట్రోలర్ పూర్ణచంద్రరావు, తూనికలు కొలతల శాఖ అధికా రులు పీఎస్ఆర్ఎన్‌టీ స్వామి, కృష్ణచైతన్య, రామ్‌కుమార్, వివిధ జిల్లాలకు చెందిన వినియోగదారుల హక్కుల కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి లోగిలిలో సంతోషం, ప్రతి ఒక్కరికీ ఆనందం

ముఖ్యమంత్రి చంద్రబాబు విళంబి నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు

అమరావతి, సూర్య బ్యూరో : విళంబి నామ సంవత్సరం తెలుగువారి జీవితాల్లో నవ్య కాంతులు నింపాలని, ప్రతి లోగిలిలో సంతోషం వెల్లవిరియాలని, కుటుంబంలో ప్రతి ఒక్కరూ ఆనందంగా గడపాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలకు, దేశవిదేశాల్లోని తెలుగువారికి ఆయన


విళంబి నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. విళంబి అంటే సుభిక్షం అని అర్ధమని శాస్త్రాలు చెబుతున్నాయని, వచ్చే ఏడాది రాష్ట్రం మరింత సుభిక్షంగా ఉంటుందని తెలిపారు.

పట్టిసీమ ప్రాజెక్టును పట్టుదలతో పూర్తిచేసి వరుసగా మూడేళ్లుగా కృష్ణా నదికి గోదావరి నీళ్లు తీసుకొచ్చి కృష్ణా డెల్టాను కాపాడిన విషయాన్ని చంద్రబాబు గుర్తు చేశారు. పల్నాడు, ప్రకాశం జిల్లాలలో నీరు అందని ప్రాంతాలకు బొండాపల్లి పథకం ద్వారా నీరందిస్తామని తెలిపారు.

పట్టిసీమ స్ఫూర్తితో గోదావరి,కృష్ణా, పెన్నా, వంశధార, నాగావళి నదులను అనుసంధానం చేపి, మహాసంగమాన్ని సృష్టిస్తామని, రాష్ట్రంలో ప్రతి ఎకరానికీ నీరు అందిస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. గత మూడేళ్లలో రూ. 48,474 కోట్లు ఖర్చు చేసి 13.6 లక్షల ఎకరాల ఆయకట్టును కల్పించామన్నారు. 2019 నాటికి ఎట్టి పరిస్థితుల్లో పోలవరం ప్రాజెక్టు పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకుని రాష్ట్ర బడ్జెట్‌లో అధిక నిధులను పోలవరానికి కేటాయించామన్నారు. రాయలసీమకు మునుపెన్నడూ లేని విధంగా కృష్ణా జలాలను మళ్లించి చెరువులు నింపామని, కరవు నేల ఇవాళ పంటలతో కళకళలాడుతోందని గుర్తుచేశారు.

తనను విశ్వసించి రాజధాని అమరావతి నిర్మాణానికి 34 వేల ఎకరాల భూములిచ్చారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకుని, ఆంధ్రులు గర్వించే రీతిలో రాజధాని అమరావతిని నిర్మిస్తామని చంద్రబాబు అన్నారు.రాజధాని అమరావతిలో రూ.20 వేల కోట్ల విలువైన మౌలిక సదుపాయాల కల్పన పనులు చురుగ్గా సాగుతున్నాయని, ఇప్పటికే ఎస్.ఆర్.ఎం, విట్ యూనివర్శిటీలు వచ్చాయని, శంకుస్థాపనలు జరిగిన బి.ఆర్ షెట్టి హెల్త్ సిటీ, ఇండో-యూకే ఆస్పత్రి పనులు త్వరలో ప్రారంభమవుతాయని చెప్పారు.

అరచేతిని అడ్డుపెట్టి సూర్యుడు ఉదయిస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అభివద్ధిని అడ్డుకోలేరని, గతంలో కేంద్ర కుట్రలు, కుతంత్రాలను తిప్పికొట్టిన చరిత్ర ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు గుర్తు చేశారు. ఎన్టీరామారావు ప్రభుత్వాన్ని కూలదోసిన నాటి ప్రధాని ఇందిర ప్రజాగ్రహానికి



తలవంచి తిరిగి ఆయన్ని ముఖ్యమంత్రిగా చేసిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ తో చెలగాటమాడితే ఎంతటి వారికైనా పరాభవం తప్పదన్నారు. రాష్ట్రాన్ని అన్యాయంగా, అశాస్త్రీయంగా విభజించిన కాంగ్రెస్ డిపాజిట్లు కూడా రాలేదని అన్నారు. రాష్ట్ర సుస్థిరతను దెబ్బతీయాలని చూస్తున్న శక్తుల ఆటలను సాగనివ్వబోమని అన్నారు.

నగరాల సంఘం ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాలు



విజయవాడ, సూర్య బ్యూరో : ఉగాది పురస్కారాలు కృష్ణా జిల్లా సంఘం నగరాల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉగాది సందర్భంగా మహాలక్ష్మి అమ్మవారి దేవస్థాన కళ్యాణ మండపంలో నిర్వహస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఉగాది సంబరాల ఆహ్వాన పత్రికలను సంఘం నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధరంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారికి, వివిధ రంగాలలో దూసుకుపోతున్న కళాకారులకు, 60 సంవత్సరాలు పూర్తి చేసుకున్న నగర కులస్థుల దంపతులకు షష్టిపూర్తి గౌరవ సత్కారాలు జరుగుతాయని వివరించారు. వైద్య, విద్య, రాజకీయ తదితర రంగాలకు చెందిన ప్రముఖులందరూ ఉగాది పురస్కారాల కార్యక్రమం సందర్భంగా ఒకే వేదికపై హాజరవుతున్నారు.

కార్పొరేటర్లు నాగోతి నాగమణి, కొరికాణి అనూరాధ, సుకాశి సరితలకు, కళారంగంలో రంగస్థల, టీవీ, నృత్య, షార్ట్ ఫిల్మిస్‌ల కళాకారులకు అలాగే ఛారిటబుల్ ట్రస్ మెమోరియల్ ట్రస్ట్‌ల ద్వారా సమాజానికి సేవలందిస్తున్న కొరగంజి జగన్నాథరావు, పిళ్ళా విజయ్‌కుమార్, పోతిన వెంకటప్రసాద్‌లను ఘనంగా సన్మానించనున్నామని సంఘం నాయకులు వివరించారు. ఈ సమా వేశంలో సంఘం అధ్యక్షులు గూడేల శ్రీనివాసరావు, కార్యదర్శి తమ్మిన వెంకట రమణ, కోశాధికారి అడ్డూరి రాము, మహిళా విభాగం అధ్యక్షులు యీది పార్వతీ, శీరం వెంకట్రావు, కామంధుల నరసింహారావు, నాగోతి రామారావు, గూడేల రామకృష్ణ, రాంపిళ్ళ వాసు తదితరులు పాల్గొన్నారు.

హోదాకు తగ్గ ప్యాకేజీ ఇచ్చాం

ఏపీ బీజేపీ అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు



న్యూఢిల్లీ, సూర్య ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాకు ఏమాత్రం తగ్గని ప్యాకేజీ ఇచ్చామని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, ఎంపీ హరిబాబు తెలిపారు. ఇదే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయిం చామని చెప్పారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాతో భేటీ అనరం హరిబాబు మీడియాతో మాట్లాడారు. మూడున్నరేళ్లలో పలు కేంద్ర విద్యాసంస్థలు నెలకొల్పామని చెప్పారు. చట్టంలో పెట్టిన మిగతా హామీలనూ నెరవేరుస్తామన్నారు. ఇప్పటికే పారిశ్రామిక రాయితీలు ఇచ్చామన్నారు. గత బడ్జెట్‌లో వడ్డీ రాయితీల కోసం ఇచ్చిన రూ.100 కోట్లలో ఒక్క పైసా కూడా రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేయలేదన్నారు. ప్రత్యేక హోదా పేరుతో ప్రజల్లో భావోద్వేగాలు ప్రేరేపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

చిన్నశేష వాహనంపై శ్రీరామచంద్రమూర్తి చిద్విలాసం



తిరుపతి, సూర్య ప్రతినిధి : తిరుపతిలోని శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం ఉదయం చిన్నశేష వాహనంపై స్వామివారు భక్తులకు అభయమిచ్చారు. ఉదయం 8 నుండి 10 గంటల వరకు వాహనసేవ వైభవంగా జరిగింది. భక్తజన బృందాలు భజనలు, కోలాటాలతో స్వామి వారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి వాహనసేవ కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. కైవల్య జ్ఞానప్రాప్తిలో కుండలినీశక్తి జాగృతం అత్యంత ఉత్కృష్టమైనది. ఈ కుండలినీశక్తి సాధారణంగా సర్పరూపంలో ఉంటుంది. భగవంతునిలో ఐక్యం కావడానికి అవసరమైన కుండలినీశక్తి జాగృతాన్ని ప్రబోధించేదే చిన్నశేష వాహనం. వాహనసేవ అనంతరం ఉదయం 11 నుండి 12 గంటల వరకు కల్యాణ మండపంలో స్నపనతిరుమంజనం వేడుకగా జరిగింది. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనంతో స్వామి, అమ్మవార్లకు విశేషంగా అభిషేకం చేశారు. సాయంత్రం 6 నుండి 7 గంటల వరకు ఊంజల్‌సేవ వైభవంగా జరిగింది. రాత్రి 8 నుండి 10 గంటల వరకు హంస వాహనంపై శ్రీ కోదండరామస్వామివారు భక్తులకు కనువిందు చేశారు. ఆత్మానాత్మ వివేకం కలవానికి భగవదనుగ్రహం సంపూర్ణంగా కలుగుతుంది. హంస వాహనంలోని పరమార్థం ఇదే. హంసలో పాలను, నీళ్లను వేరుచేసే సామర్థ్యం ఉంది. 'సోహం' భావం కలిగిన భక్తులలో అహంభావం తొలగించి 'దాసోహం' అనే భావం కలిగించడానికే పరమహంస రూపానికి ప్రతీక అయిన హంసవాహనాన్ని స్వామివారు అధిరోహిస్తారు.

సాంస్కృతిక కార్యక్రమాలు..

తిరుపతిలోని శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం ఆలయంలో ఉదయం 6 నుండి 7 గంటల వరకు ఎస్.వి.సంగీత, నృత్య కళాశాల వారిచే మంగళధ్వని, ఉదయం 7 నుండి 8 గంటల వరకు ధర్మగిరి వేద పాఠశాల ఆధ్వర్యంలో వేదపారాయణం నిర్వహించారు. వాహనసేవల్లో నల్గొండ జిల్లా మిర్యాలగూడ, పశ్చిమగోదావరి జిల్లా చాగల్లు, తిరుపతికి చెందిన కళాబృందాలు కోలాటాలు ప్రదర్శించాయి.


తెలుగు సంప్రదాయానికి ప్రతీక ఉగాది

ఎపి కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి



విజయవాడ, సూర్యబ్యూరో : తెలుగు సంప్రదాయానికి ప్రతీక, తెలుగు సంవత్సరంలో మొదటి పండుగ సందర్భంగా తెలుగు వారందరికీ ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఎన్. రఘువీరారెడ్డి ఉగాది శుభా క్షాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఏపి సిసి రాష్ట్ర కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు. విలంబి నామ సంవత్సర ప్రారంభ రోజు పురస్కరించుకొని అభినందనలు తెలిపారు. తెలుగు సంవత్సరం తొలిపండుగ అందరి జీవితాల్లో అంతులేని ఆనందం తీసుకురావాలని, రైతులు, నిరుపేదలు, సామ్యానులు, కార్మి కులు సమాజంలో ప్రతి ఒక్కరూ, అన్ని వర్గాల ప్రజలు ఈ ఏడాదంతా సుఖ శాంతులతో వర్థిల్లాలని ఈ సందర్భంగా రఘువీరారెడ్డి ఆక్షాంక్షించారు. అన్ని వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాలని ఆయన అభిలషించారు. ఏడాదంతా సకాలంలో వానలు పడి, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకుం టున్నానని ఆయన తెలిపారు. పాడిపంటలతో రైతులు వర్థిల్లాలని, పల్లెలు కళకళలాడాలని, సకాల వృత్తులూ పరిఢవిల్లాలని అన్నారు. షడ్రుచుల ఉగాది తెలుగువారి జీవితాల్లో వెలుగులు నింపి, ఆనందం తీసుకురావాలని రఘువీరారెడ్డి ఆక్షాంక్షించారు.

28న హుండీల లెక్కింపు



అన్నవరం, మేజర్‌న్యూస్ : ఈనెల 28న అన్నవరం సత్యదేవుని హుండీలు లెక్కించనున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. హుండీల లెక్కింపు కార్యక్రమంలో అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది, అర్చకులు, పురోహితులు విధిగా పాల్గొనాలని ఈఓ కార్యాలయం నుంచి విడుదలైన ఆదేశాలలో స్పష్టంగా పేర్కొన్నారు.

'గాంధీ మార్గం సదా ఆచరణీయం'



విజయవాడ, సూర్యబ్యూరో : అహింసా యుత పోరాటం ద్వారా మన దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన మహాత్మాగాంధీ చూపిన మార్గం సదా ఆచరణీయమని ప్రము ఖ స్వాతంత్ర్య సమరయోధురాలు రాంపిళ్ల నరసాయమ్మ అన్నారు. శనివారం ఎస్ఎఎస్ కాలేజీలో ఆవరణలో నిర్మాణంలోవున్న మహా త్మా గాంధీ దేవాలయాన్ని కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు సందర్శిం చారు. ఈ సందర్భంగా నరసాయమ్మ మాట్లాడుతు మహాత్ముని బోధన లను నేడు ప్రపంచం అంతా ఆచరించేందుకు ముందుకు వస్తోందని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల వారసుల సంఘం జాతీయ ప్రధాన కార్య దర్శి రాంపిళ్ల జయప్రకాష్ మాట్లాడుతూ గాంధీ ఆలయాన్ని త్వరలోనే పూర్తి చేస్తా మని అన్నారు. దేశంలోని పలు గాంధేయ సంస్థలు ఈ దేవాలయం పట్ల ఆసక్తి చూపుతున్నాయని ఆయన చెప్పారు. మహాత్ముని పేరిట తాము ప్రారంభించిన గాంధీ దీక్షలు ప్రపంచ వ్యాప్తం కావాల్సిన అవసరం వుందన్నారు. ఈ కార్య క్రమంలో శ్రీహనుమత్‌పీఠం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ దుర్గా ప్రసాద్ స్వామీజీ, రిటైర్డ్ ప్రిన్సిపాళ్లు ఎ.ఎల్. రామయ్య, కె. నరసింహారావు, పి.వి.శర్మ, కె. వి. శ్యాం సుందర్, డిఎస్ఎస్ఆర్, వైఎస్ఎస్ఆర్, కళాశాల ప్రిన్సిపాల్ టి. త్యాగ రాజు, డైరక్టర్ పి. డేవిడ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

'విళంబి'లో మన నేతల జాతకాలు



చంద్రబాబు నాయుడు

పిండికొద్దీ రొట్టె అంటారు. కానీ రొట్టె కొద్దీ పిండిని సంపాదించే ప్రయత్నంలో ఉంటారు.. పిండినా కూడా అవసరాలు తీర్చకుండా కేంద్ర ప్రభుత్వం తాత్సారం చేయడం కొంత ఇరకాటంలో పెడుతుంది. సముద్రాన్ని ఈదుకొచ్చినట్లుగా మొత్తంపై లక్ష్యాలను సాధించే ప్రయత్నాల్లో శ్రమ పడుతుంటారు. ఆశ్రమ ప్రజలు గుర్తిస్తారు. అక్కున చేర్చుకుంటారు. విజయావకాశాలు మధ్యమంగా ఉంటూ మొత్తంపై ప్రజల మన్ననలను పొందుతారు.





నరేంద్రమోడీ

వీరికి గతంలో వున్న సానుకూలత లేకున్నా కొంతవరకూ సానుకూలంగా నడుస్తుంది. ఎప్పుడో జరిగిన నేరాలు కూడా బహిర్గతమైన ఈ సమయంలో వాటి ప్రభావాలకు లోనుకాక తప్పదు. గతంలో గౌరవించిన వ్యక్తులు కూడా ప్రస్తుతం విమర్శలకు వూను కుంటారు. అసాధ్యాలను సుసాధ్యం చేసుకొని ఘనత ఉన్నప్పటికీ వాటిని విస్మరించి లోట్లు వెతకడానికి ఎక్కువమంది ప్రయత్నిస్తారు. మొత్తంపై గౌరవాన్ని నిలబెట్టుకోవడం జరుగుతుంది. తన లక్ష్యాలను కూడా చాలావరకూ సాధించగలుగుతారు. వాస్తవానికి సమాజం అంతా వుణ్య బలాన్ని పెంచుతూ సరిఅయినపాలకులను మంచి మార్గాల్లో నడిచేట్లు చేయటానికి వారిద్వారా సమాజాన్ని కాపాడటానికి

స్వస్తి ప్రజాభ్య: పరిపాలయంతాం
న్యాయేన మార్గేణ మహీం మహీశా:

మొదలగు రీతిలో దైవాన్ని ప్రార్థించడం అవసరం.




.కె.చంద్రశేఖరరావు

ప్రజాభిమానం బాగుంటుంది. నిరుద్యోగులకు విద్యార్థులకు సంతృప్తిపరచే అంశంలో తగిన శ్రద్ధ అవసరం. అసంతృప్తులే ఉద్యమాలకు కారణాలు అవుతాయి. ఆరోగ్య విషయంలో తగుజాగ్రత్తలు అవసరము. దైవారాధన ఎల్లవేళలా కాపాడుతుంది. హోమాలకు యాగాలకు ప్రాధాన్యత ఇచ్చి వ్యక్తిగా ఆయా కార్యాలను కొనసాగించటం వారికి, రాష్ట్రానికి కూడా మేలు చేస్తుంది. ఆరోగ్యపరంగా వైద్య రక్షణతో పాటు ఆధ్యాత్మిక రక్షణ కూడా అవసరం. రైతుల రక్షణ వుణ్య బలాన్ని పెంచుతూ ఒడిదుడుకుల నుంచి కాపాడుతుంది.

అమిత్ షా

పదవిలోని వారికి అంటిపెట్టుకొని ఉండి నీ నుంచే పదవులను తాము పొంది స్వప్రయోజనాలలో ఉపయోగించుకుంటే పక్క వారి బలంతో తాత్కాలిక విజయములు పొందిన వాస్తవాన్ని గ్రహించిన ప్రజలు సరియైన సమయంలో సరియైన భావాలు ప్రకటించగలరు. ఈ సత్యాన్ని గుర్తించి పక్క వారు ప్రజా సేవకులు అయితే వారి ప్రక్కన ఉన్నంత మాత్రం చేత మనకి కూడా తిరుగులేదన్న కోవడం భ్రాంతి. సత్యమైన అంశాలను గుర్తించి నిజమైన ప్రజా సేవకు వూనుకుంటే దీర్ఘకాలిక ప్రయోజనాలు దక్కుతాయి.



జగన్

అనుకరణ సహజమైన ప్రజాసేవ కాదు.ఎన్నికల ముందు గుర్తొచ్చే సేవా భావాన్ని ఆలోచనాపరులు మేధావులు గుర్తిస్తూనే ఉంటారు. ప్రజలు ఆలోచనపరులు. మతము, వర్గము మాత్రమే ఇచ్చే ఆదరణ దీర్ఘకాలికం కాదు, ఎత్తుగడలకు కూడా : ఇతరులను ఆశ్రయిస్తే అవసరాలకు సరైన నిర్ణయాలు రావడం కష్టం. ప్రజాదరణ మనసులోంచి రావాలి. అవసరాలకి తగినట్లుగా తాత్కాలిక వేష, దారణలతో తాత్కాలిక ఆశ్రీతులను నమ్ముకుంటే విజయం అంచు మీదే ఉంటుంది.

కె. తారక రామారావు

ఘర్షణలకు తావు లేని ప్రవర్తన ముందడుగు వేయటా నికి దోహదం చేస్తుంది . ప్రజలకోసంనేను అనే భావన నుంచి పదవికై పోరాటం ఆరాటం ఇబ్బందికి గురిచేసే అవకాశం ఉంది. ప్రజల అవసరాలు గుర్తిస్తుంటే పదవులు వెనకాలే వస్తా యి. పదవులను ముందు పెట్టుకొని వాటికోసమే పయ నం అన్నట్లు వ్యవహరించుట వలన చిక్కులు ఎదురవుతాయి ప్రజాసేవ జీవితలక్ష్యం కావాలి కానీ పదవి సేవనం లక్ష్యం కావటం అయితే చిక్కులకి గురి చేస్తుంది.





రాహుల్ గాంధీ

తానేమీ తప్పులు చేయకుండా జరిగిన తప్పులను తాను బాధ్యత వహించాల్సిన స్థాయిలో ఉంటే అనుభవ రాహిత్యం గెలువునకు దూరం చేస్తుంది. అనుభవజ్ఞుల అనుభవాన్ని స్వీకరించటానికి కూడా కష్టమై మన మాట వినే వారు మంచివారు అన్న విధానాన్ని పాటిస్తే తాత్కాలిక విమర్శల వల్ల కొద్ది కొద్ది విజయాలు దక్కినా దీర్ఘకాలిక ప్రయోజనాలు దెబ్బతినే అవకాశా లున్నాంటు. ఆధ్యాత్మిక బలం అనుకరణవల్ల రాదు ..సహజం అయితే ఆదినుంచి ఉండాలిగా...




రజనీకాంత్

కళారంగంలో ఉన్న ప్రజాదరణ ప్రపంచవ్యాప్తంగా ఉంటుంది. ప్రపంచ వ్యాప్తమైన ఆ అభిమానం పాలన విష యంలో పూర్తిగా కనబడుతుందని అనుకోవడం కష్టం. అయినప్పటికీ కలువు కొనే లక్షణం వలన పాలనలో కూడా ఆదరణ ఉంటుంది. ముఖ్యంగా ప్రజల అవసరాలు ఏంటి అని ప్రజల నుండి సమాచారం సేకరించే పద్ధతి వీరి విజయానికి దోహదం చేస్తుంది. ఆధ్యాత్మిక ప్రగతి పరిణతి, ఆరోగ్యాన్ని మెరుగుచేస్తే, పాలనలోని ఒడిదుడుకులు ఆందోళనలు ఆరోగ్యా న్ని దెబ్బతీసే అవకాశాలు ఉంటాయని గ్రహించాలి.



తొలి యువ మహిళా జ్యోతిష, వాస్తుశాస్త్ర పట్టభద్ర స్వర్ణకంకణ సన్మానిత,జ్యోతిష చూడామణి, జ్యోతిర్వాస్తు ప్రజ్ఞావిశారద

డా॥ ఈడ్పుగంటి పద్మజారాణి



పవన్ కళ్యాణ్

ప్రజాదరణ ఉంది కానీ పనులలో ఆలస్యాలు ప్రజలకు రుచించవు. వాస్తవానికి సినిమా యొక్క గెలువుకి పలువురి ప్రజ్ఞ తోడ్పడుతుంది ఆ విజయము అంతా తానొక్కడిదే అనుకోవడం వల్ల ఏకైక వ్యక్తిగా ప్రజల ముందుకి రావడం వలన ప్రజల ఆదరణని పొందటం కష్టం. ప్రజల అవసరాలని గుర్తిస్తున్నప్పటికీ ఎక్కడ చూసినా తానొక్కడే కనిపించుట వలన ప్రజలలో విశ్వాసాన్ని కలిగించడం కష్టం. కొందరితో కలిసి పని చేయడం వలన సమిష్టి కృషి సత్ఫలితాలను ఇచ్చే అవకాశం ఉంది.

సూర్య సినిమా

నాకు కచ్చితంగా మరో మంచి విజయాన్నిచ్చే చిత్రం!

-మంచి లక్షణాలున్న కథానాయకుడు కళ్యాణ్ రామ్



తనకున్న ఘనమైన కుటుంబ నేపథ్యం తన మొదటి చిత్రం వరకే ఉపయోగపడింది. 'తొలి చూపులోనే" పేరుతొ విడుదలైన కళ్యాణ్ రామ్ తొలి చిత్రం తనకి పెద్దగా ఉపయోగపడలేదు. దానితో సినీరంగమనే పద్మవ్యూహంలో అతని పరిస్థితి 'అభిమన్యుడు'గా మారింది. బీటలు వారుతున్న తన కెరీర్‌కి ఎవరో వచ్చి బాటలు వేస్తారని ఎదురు చూడడం వివేకమనిపించుకోదని నిర్ణయించుకొని.. తన కెరీర్‌ని తానే నిర్మించుకోవాలని నిర్ణయించుకున్నాడు. అది కూడా ఒక కొత్త కుర్రాడికి దర్శకుడిగా అవకాశమిస్తూ అతను నిర్మించిన 'అతనొక్కడే' అతని కెరీర్ కి తిరుగులేని పునాది వేసింది. సురేందర్‌రెడ్డి అనే ఓ అసాధారణ ప్రతిభాశాలిని తెలుగు తెరకు పరిచయం చేసింది. వరసగా రెండు చిత్రాలతో అపజయాలను అందుకుని కూడా ఒక కొత్త దర్శకుడికి అవకాశం ఇస్తూ, ఆ చిత్రాన్ని తానే స్వయంగా నిర్మించి ఉండడం బట్టి కళ్యాణ్ రామ్ గట్స్‌ని అర్థం చేసుకోవచ్చు.

'అతనొక్కడే' తర్వాత కూడా మళ్ళీ అదే పరిస్థితి. అయినా కళ్యాణ్‌రామ్ నిరాశపడలేదు. 'లక్ష్మీ కళ్యాణం, జయీభవ' చిత్రాలతో ఓ మోస్తరు విజయాలందుకున్న కళ్యాణ్ రామ్.. మళ్ళీ ఒక కొత్త దర్శకుడికి అవకాశమిస్తూ 'పటాస్' పేల్చి తన కెరీర్‌లో వెలుగులు నింపుకున్నాడు. కళ్యాణ్‌రామ్ పరిచయం చేసిన అనిల్ రావిపూడి అనే దర్శకుడు.. ఈ చిత్రం తర్వాత తాను దర్శకత్వం వహించిన రెండు చిత్రాలతోనూ విజయాలు సొంతం చేసుకొని.. విజయపథంలో దూసుకుపోతుండడం తెలిసిందే.

సురేందర్ రెడ్డి, అనిల్ రావిపూడిలను దర్శకులుగా పరిచయం చేసిన కళ్యాణ్ రామ్ ఇప్పుడు ఉపేంద్ర మాధవ్ ని దర్శకుడిగా పరిచయం చేస్తున్నారు. అందుకే 'ఎం.ఎల్.ఏ' (మంచి లక్షణాలున్న అబ్బాయి) చిత్రంపై సహజంగానే మంచి అంచనాలు ఏర్పడ్డాయి.

అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఈ నెల 23న ప్రేక్షకుల ముందుకు రానున్నది. 'లక్ష్మీ కళ్యాణం'లో కళ్యాణ్‌రామ్‌కి జోడీగా నటించడం ద్వారా తెలుగు తెరకు పరిచయమైన కాజల్ అగర్వాల్ సుదీర్ఘ విరామం తర్వాత మళ్ళీ కళ్యాణ్ రామ్‌తో జత కట్టడం కూడా 'ఎం.ఎల్.ఏ' మరిన్ని అంచనాలు పెంచాయి. ఇటీవలకాలంలో కాజల్ నటించిన సినిమాలన్నీ సూపర్ హిట్స్ అవ్వడం తెలిసిందే.

అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకొన్న 'ఎం.ఎల్.ఏ' చిత్రం ఈనెల 23న ప్రేక్షకుల ముందుకు రానున్న సందర్భాన్ని పురస్కరించుకొని 'మంచి లక్షణాలున్న కథానాయకుడు' కళ్యాణ్‌రామ్ 'సూర్య సినిమా'తో ప్రత్యేకంగా ముచ్చటించారు!!

ఉపేంద్రకు ఉజ్వలమైన భవిష్యత్!

ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయమవుతున్న ఉపేంద్ర మాధవ్ కూడా చాలా ప్రతిభావంతుడు. ఫస్ట్ నేరేషన్‌లోనే నేను చాలా ఇంప్రెస్ అయ్యాను. సురేందర్ రెడ్డి, అనిల్ రావిపూడిలా ఇతను కూడా మంచి పేరు తెచ్చుకుంటాడు. ఇందులో నా పాత్రను ఉపేంద్ర చాలా వైవిధ్యంగా తీర్చి దిద్దాడు.

కాజల్ క్యారక్టర్ కూడా కత్తిలా ఉంటుంది!

ఇందులో కాజల్ క్యారక్టర్‌కి కూడా చాలా ఇంపార్టెన్స్ ఉంటుంది. తను కూడా చాలా ఇన్వాల్వ్ అయి చేసింది. మా ఇద్దరి మధ్య కెమిస్ట్రీ చాలా బాగుంటుంది. టీజర్‌కి చాలా మంచి రెస్పాన్స్ వస్తుండడం హ్యాపీగా ఉంది.

నేనూ స్వతహా నిర్మాతనే కాబట్టి..

ఈ చిత్ర నిర్మాతలు సినిమా అంటే ప్యాషన్ ఉన్నవాళ్లు. సినిమా చాలా బాగా రావడానికి తమవంతు కృషి చేశారు. నేను కూడా స్వతహా నిర్మాతనే కాబట్టి.. నాతో సినిమాలు తీసేవాళ్లకు నిర్మాణ సమయంలో కానీ, విడుదలకు ముందు, తర్వాత.. నష్టాలూ, కష్టాలు రాకుండా- నా వరకు నేను అన్ని జాగ్రత్తలు తీసుకుంటాను.

నా సపోర్ట్ సిస్టం వాళ్ళే!

నా ఫ్యామిలీ ఎప్పుడూ నాకు సపోర్ట్‌గా ఉంటుంది. వాళ్ళు లేకపోతే నేను లేను. వాళ్లే నాకు కొండంత అండ. సక్సెస్ వచ్చినప్పుడు, లేనప్పుడు.. ఎప్పుడూ వాళ్ళు నా వెంటే ఉంటారు. ఆ తర్వాత చెప్పుకోవాల్సింది ఫ్యాన్స్.

రేంజ్ చెప్పలేను కానీ హిట్ గ్యారంటీ

'ఎం.ఎల్.ఏ' సినిమా ఓవరాల్‌గా చాలా బాగా వచ్చింది. సక్సెస్‌పై అందరం చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాం. అయితే ఏ రేంజ్ అన్నది ఇప్పుడే చెప్పలేం. ఒక సినిమా హిట్ రేంజ్ చాలా అంశాలపై ఆధారపడి ఉంటుంది.

నా నువ్వే కూడా

జయేంద్ర దర్శకత్వం వహిస్తున్న 'నా నువ్వే' కూడా దాదాపుగా పూర్తయ్యింది. అది కూడా చాలా బాగా వస్తోంది. ఇందులో హీరోయిన్‌గా నటిస్తున్న తమన్నా పాత్ర కూడా చాలా బాగుంటుంది. ఈ చిత్రాన్ని కూడా ఈ సమ్మర్‌లోనే రిలీజ్ చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు!



హలో గురూ ప్రేమ కోసం

త్రినాధరావు నక్కిన దర్శకత్వం, దిల్ రాజు నిర్మాణంలో రామ్ నటిస్తున్న చిత్రానికి 'హలో గురూ ప్రేమ కోసం' అనే టైటిల్ ఖరారు చేసిన విషయం తెలిసిందే. రామ్ ప్రీవియస్ మూవీ 'ఉన్నది ఒక్కటే జిందగీ' పూర్తిగా నిరాశపరిచి ఉన్న నేపథ్యంలో.. ఈ చిత్రంపై రామ్ చాలా ఆశలు పెట్టుకుంటున్నాడు.

ఈ చిత్రంలో తన లుక్ చాలా డిఫరెంట్‌గా, స్టైలిష్‌గా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాడు. ఈ మూవీలో తన లుక్ ఇలా ఉండబోతోంది అంటూ ట్విట్టర్‌లో ఒక ఫోటో పోస్ట్ చేశాడు రామ్. దీనికి అతని ఫ్యాన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది. 'సినిమా చూపిస్త మావా, నేను లోకల్' చిత్రాలతో బ్యాక్ టు బ్యాక్ హిట్స్ కొట్టిన త్రినాధరావు నక్కిన ఈ చిత్రంతో హ్యాట్రిక్ కొడతాడేమో చూడాలి!!

నింగీ నేలా ఒక్కటయ్యేలా

మాస్‌తోపాటు క్లాస్‌నీ ఆకట్టుకొనే ఎస్ఆర్‌టి ఎంటర్‌టైన్‌మెంట్స్ నేల టికెట్



ఎస్ ఆర్‌టి ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై.. 'సోగ్గాడే చిన్నినాయనా, రారండోయ్ వేడుక చూద్దాం' లాంటి సూపర్ హిట్ చిత్రాల దర్శకుడు కళ్యాణ్‌కృష్ణ దర్శకత్వంలో, రాజా ది గ్రేట్‌తో అదరగొట్టిన మాస్ మహారాజా 'రవితేజ' హీరోగా రామ్ తాళ్లూరి నిర్మిస్తున్న సినిమా ఫస్ట్ లుక్ తెలుగువారి మొదటి పండుగ ఉగాది సందర్భంగా హీరో రవితేజ ట్విట్టర్ ద్వారా విడుదల చేశారు. క్లాస్ మాస్ మేళవింపుతో ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్టైనర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి 'నేల టిక్కెట్టు' పేరు ఖరారు చేశారు.

రవితేజ సరసన మాళవిక శర్మ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో జగపతిబాబు, బ్రహ్మానందం, జయప్రకాశ్, రఘుబాబు, సుబ్బరాజు, ఆలి, పోసాని, అన్నపూర్ణమ్మ, ప్రియదర్శి, ప్రభాస్ శ్రీను, పృథ్వీ, సురేఖా వాణి, ప్రవీణ్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు.

కమల్ విశ్వరూపం-2 కూడా వచ్చేస్తోంది!



గత మూడేళ్లుగా పలు కారణాల వల్ల విడుదలకు నోచుకోకుండా ఉండిపోయిన కమల్ హాసన్ 'విశ్వరూపం-2' విడుదలకు సిద్ధమవుతోంది. ఈ చిత్ర నిర్మాతలు ఆర్థిక ఇబ్బందుల్లో పడిపోవడం, సినిమా బడ్జెట్ ఎక్కువైపోవడం వంటి కారణాల వల్ల గత మూడేళ్లుగా ఈ చిత్రం ల్యాబ్‌లోనే ఉండిపోయింది. అయితే ఇటీవల రాజకీయాల్లోకి ప్రవేశించిన కమల్‌హాసన్.. తన రాజకీయ భవిష్యత్‌కు ఉపయోగం ఉంటుందనే ఉద్దేశ్యంతో ఈ చిత్రాన్ని తన చేతుల్లోకి తీసుకొని, ఆర్థికపరమైన ఆటంకాలు తొలగించి విడుదలకు మార్గం సుగమం చేశారు. కమల్ హాసన్, ఆండ్రియా, పూజా కుమార్, రాహుల్ బోస్ తదితరులు నటించిన ఈ చిత్రం సెన్సార్ కూడా పూర్తి చేసుకొంది. ఈ వేసవిలోనే ఈ చిత్రం విడుదల కానుంది!!

అందరికీ ఆనందం పంచడం ఖాయం!



సుఖీభవ మూవీస్ అధినేత ఎత్తరి గురురాజ్. మలయాళంలో సూపర్‌డూపర్ హిట్ అయిన 'ఆనందం' చిత్రాన్ని అదే పేరుతో తెలుగు ప్రేక్షకులకు ఈ నెల 23న అందించనున్నారు. మలయాళ ప్రేక్షకుల హృదయాలను కొల్లగొట్టిన ఈ చిత్రానికి గణేశ్ రాజ్ దర్శకత్వం వహించారు. కేరళ టాప్ హీరో 'ప్రేమమ్' ఫేమ్ నివిన్ పాల్ ఇందులో గెస్ట్ రోల్ చేశారు. మిగిలిన నటీనటులందరూ దాదాపుగా కొత్తవారే. తెలుగులో అనువాదమవుతోన్న 'ఆనందం' చిత్రానికి వీర వెంకటేశ్వర రావు (పెదబాబు), వి.ఆర్.బి.రాజు, రవి వర్మ చిలువూరి సహ నిర్మాతలు. సీనియర్ నిర్మాత ఆర్.సీతారామరాజు ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. సచిన్ వారియర్ సంగీతం అందించిన ఈ సినిమా ఆడియో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాత గురురాజ్, ప్రముఖ నిర్మాత కె.ఎల్.దామోదర్ ప్రసాద్, దర్శకుడు గణేష్ రాజ్, హీరో తరుణ్ పద్మరాజు, ఎ.వి.ఎస్.రాజు, సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు. మలయాళంలో మంచి విజయం సాధించి తెలుగులో 'ఆనందం' పేరుతో వస్తున్న ఈ చిత్రం అంతకంటే పెద్ద విజయం సాధించి అందరికీ ఆనందాన్ని పంచాలని వక్తలు అభిలషించారు!!

మనం సైతం కోసం నేను సైతం అంటున్న తమన్నా






కాదంబరి కిరణ్ సారథ్యంలో.. తెలుగు చిత్ర పరిశ్రమలో కష్టాల్లో ఉన్నవారికి ఉద్యమ స్ఫూర్తితో సేవలందిస్తున్న 'మనం సైతం'కు మరో టాప్ సెలబ్రిటీ నుంచి మద్దతు లభించింది. మెగాస్టార్ చిరంజీవి మొదలుకొని పలువురు సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు 'మనం సైతం'కు మనస్ఫూర్తిగా మద్దతు తెలిపి భారీగా భూరి విరాళాలు అందిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఈ జాబితాలో మరో తార చేరారు. ప్రముఖ హీరోయిన్ తమన్నా.. 'మనం సైతం' ద్వారా కాదంబరి కిరణ్ చేస్తున్న సేవా కార్యక్రమాలు తెలుసుకొని తన మద్దతు ప్రకటించారు. కాదంబరిని అభినందించిన తమన్నా.. ఈ సందర్భంగా 'మనం సైతం' టీ షర్ట్స్ ఆవిష్కరించారు. 'మనం సైతం' సేవల్ని తమన్నా కొనియాడడం, తను కూడా తనవంతు సహకారం అందిస్తానని స్వచ్ఛందంగాముందుకు రావడం చాలా సంతోషాన్నిస్తోందని కాదంబరి అన్నారు!!



రష్యన్ ఫ్రెండ్‌ని రహస్యంగా పెళ్లాడిన శ్రియా శరన్

పెళ్లంటే పందిళ్లు, తాళాలు, తలంబ్రాలు' అనే సెంటిమెంట్ శ్రియకి లేదనుకుంటా. అందుకే సైలంట్‌గా పెళ్లి చేసేసుకుకుంది. పోనీ పెళ్లయ్యాకైనా ఆ ఫోటోలు రిలీజ్ చేసిందా.. అంటే అదీ లేదు. ముంబయిలోని తన నివాసంలో అత్యంత నిరాడంబరంగా శ్రియ పెళ్లయిపోయింది. గత కొంతకాలంగా డేటింగ్ చేస్తున్న తన రష్యన్ ఫ్రెండ్‌ని శ్రియ ఎట్టకేలకు పెళ్లి చేసేసుకొంది. ఈనెల 12న వీరిద్దరి పెళ్లి జరిగిందని తెలుస్తోంది. మరి ఈ వివాహాన్ని శ్రియ అధికారికంగా ఎప్పుడు ప్రకటిస్తుందో ఏమో?



చిరంజీవి సుశాంత్ అనుమోలు..

సుశాంత్ కథానాయకుడిగా సిరుని సినీ కార్పొరేషన్ పతాకంపై రాహుల్ రవీంద్రన్ దర్శకుడిగా పరిచయమవుతూ తెరకెక్కిస్తున్న చిత్రం "చి ల సౌ". ఈ చిత్రాన్ని జస్వంత్ నడిపల్లి నిర్మిస్తున్నారు. సుశాంత్ సరసన రుహాని శర్మ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం ఫస్ట్ లుక్ కథానాయకుడు సుశాంత్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేశారు.

నిర్మాత జస్వంత్ నడిపల్లి మాట్లాడుతూ.. షూటింగ్ పూర్తయ్యింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటోంది. మే 11న చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అన్నారు.

వెన్నెల కిషోర్, రోహిణి, అనుహాసన్, రాహుల్ రామకృష్ణ, జయప్రకాష్, విద్యుల్లేఖ, సంజయ్ స్వరూప్, హరీష్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: హరీష్ కోయలగుండ్ల, ఎడిటర్: ఛోటా కె.ప్రసాద్, మ్యూజిక్ డైరెక్టర్: ప్రశాంత్ ఆర్.విహారి, సినిమాటోగ్రఫీ: ఎం.సుకుమార్!!

అప్పుడు ఇప్పుడు ఎప్పుడూ



యు.కె.ఫిలింస్ పతాకంపై ఉషా రాణి కనుమూరి, విజయ రామకృష్ణంరాజు సంయుక్తంగా నిర్మిస్తున్న విభిన్న ప్రేమకథా చిత్రం 'అప్పుడు- ఇప్పుడు'. చలపతి పువ్వల దర్శకుడు. సుజన్-తనిష్క హీరోహీరొయిన్‌లుగా నటిస్తుండగా.. శివాజీరాజా, 'మళ్లీ రావా' ఫేం పేరుపురెడ్డి శ్రీనివాస్ ముఖ్య పాత్రల్లో కన్పించనున్నారు. చిత్రీకరణ పూర్తి చెసుకుని, నిర్మాణాంతర కార్యక్రమాలు జరుపుకుంటోన్న ఈ చిత్రం ఫస్ట్ లుక్ విళంబినామ ఉగాది పర్వదినం సందర్భంగా విడుదల చేశారు. ఫీల్ గుడ్ కామెడీ ఎంటర్‌టైనర్ గా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని సమ్మర్‌లో విడుదల చేసేందుకు సన్నాహాలు చెస్తున్నారు.

మాధవి, జబర్దస్త్ అప్పారావు తదితరులు నటిస్తొన్న ఈ చిత్రానికి కెమెరా: కల్యాణ్ సమి, ఆర్ట్: ఠాగూర్, ఎడిటింగ్: వి.వి.ఎన్.వి. సురేష్, సంగీతం: పద్మానావ్ భరద్వాజ్!

సూర్య
హైదరాబాద్
ఆదివారం
18 మార్చి 2018



డబ్ల్యూటీవో సమావేశానికి పాకిస్తాన్ నో

న్యూఢిల్లీ: భారత్, పాకిస్తాన్ మధ్య గత కొన్ని రోజులుగా దౌత్యపరమైన ప్రతిష్టంభన నెలకొన్న విషయం తెలిసిందే. తమ రాయబారులు వేధింపులకు గురవుతున్నారంటూ ఇరు దేశాలు పరస్పరం ఆరోపణలు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో త్వరలో ఢిల్లీలో జరగనున్న ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యూటీవో) సమావేశానికి తాము హాజరుకాలేమని పాక్ చెప్పింది. ఈ మేరకు ఆ దేశ దౌత్య వర్గాలు వెల్లడించినట్లు సమాచారం. మార్చి 19,20 తేదీల్లో ఢిల్లీ వేదికగా డబ్ల్యూటీవో మంత్రిత్వ స్థాయి సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి హాజరుకావాలని పాక్ వాణిజ్యశాఖ మంత్రి పర్వేజ్ మాలిక్‌కు గత నెలలో భారత్ ఆహ్వానం పంపింది. అయితే ప్రస్తుతం ఆయన ఈ సమావేశానికి రావడం లేదు. ఇటీవల ఇరు దేశాల మధ్య చోటుచేసుకున్న విభేదాల నేపథ్యంలో డబ్ల్యూటీవో సమావేశం నుంచి పాకిస్తాన్ తప్పుకుంటుంది అని పాక్ దౌత్యవర్గాలు తెలిపాయి. సదస్సుకు రాకూడదని పాక్ చివరి నిమిషంలో నిర్ణయం తీసుకుందని.. దీనిపై తాము స్పందించబోమని భారత అధికారులు చెబుతున్నారు. ఇటీవల భారత్, పాక్ మధ్య దౌత్యాధికారుల విషయమై విభేదాలు తలెత్తిన విషయం తెలిసిందే. భారత్‌లో తాము వేధింపులకు గురవుతున్నామంటూ పాక్ హైకమిషన్ సిబ్బంది ఫిర్యాదు చేశారు. పాక్ మీడియా ద్వారా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. వెంటనే స్పందించిన భారత్ దీనిపై విచారణ చేపడుతామని హామీ ఇచ్చింది. అయితే ఇస్లామాబాద్‌లోని భారత హైకమిషన్ సిబ్బంది కూడా ఏళ్ల తరబడి వేధింపులకు గురవుతున్నారని భారత్ ఆరోపించింది. కానీ పాక్‌లా తాము మీడియా దృష్టికి తీసుకెళ్లకుండా దౌత్యపరంగా చర్చించుకోవాలనుకుంటున్నామని స్పష్టం చేసింది.

రాహుల్ ప్రధాని కావడాన్ని ఎవరూ ఆపలేరు

- కాంగ్రెస్ పార్టీ ఈ దేశ ప్రజలందరిదీ
- ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందే
- కాంగ్రెస్ పక్ష నేత మల్లికార్జున్ ఖర్గే
- ట్విట్టర్‌లో పేరు మార్చుకున్న రాహుల్‌గాంధీ




న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ 84వ ప్లీనరీ సమావేశాలు ఢిల్లీలో జరుగుతున్నాయి. రాహుల్‌గాంధీ తొలిసారి అధ్యక్ష హోదాలో ఈ ప్లీనరీలో ప్రసంగించారు. దేశాన్ని ఐక్యం చేసి ముందుకు నడిపించేది చేతి గుర్తేనని రాహుల్ ఈ సందర్భంగా అన్నారు. రాహుల్ ప్రసంగం తర్వాత మల్లికార్జున్ ఖర్గే, శశిథరూర్, సిద్ధరామయ్య వంటి పలువురు సీనియర్ కాంగ్రెస్ నేతలు మాట్లాడుతూ అధికార భాజపాపై విమర్శల వర్షం కురిపించారు. లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ఈ దేశ ప్రజలందరిదీ. జవహర్‌లాల్ నెహ్రూ నాయకత్వంలో కాంగ్రెస్ ఎన్నో పరిశ్రమలను, నీటి పారుదల ప్రాజెక్టులను ఏర్పాటు చేసింది. ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపించింది. భారత్‌కు స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యాన్ని అందించింది. ఆ ప్రజాస్వామ్యం వల్లే ప్రధాని మోదీ అధికారంలోకి వచ్చారు. కానీ, ఇప్పుడు ఆయన ప్రభుత్వమే ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారింది అని ఆరోపించారు. అనంతరం సీనియర్ నేత శశిథరూర్ సామాజిక న్యాయం తదితర అంశాల గురించి మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీపై ఆయన పరోక్షంగా విమర్శలు చేశారు. 56 అంగుళాల ఛాతీ ఉంటే సరిపోదు. అందుకు తగ్గ మనసు కూడా ఉండాలి. మనం హిందువులం మాత్రమే కాదు.. హిందుస్థానీయులం అని శశిథరూర్ అన్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కూడా ఈ ప్లీనరీలో పాల్గొని ప్రసంగించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో రాహుల్‌గాంధీ ప్రధాని కావడాన్ని ఎవరూ ఆపలేరు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు లౌకికవాదానికి, మతోన్మాదానికి మధ్య జరిగే పోరు. రాహుల్ గాంధీ నేతృత్వంలో ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అతిపెద్ద విజయాన్ని సాధిస్తుంది. లోక్‌సభ ఎన్నికలకు ఈ విజయం నూతనోత్సాహాన్ని ఇస్తుంది అని సిద్ధరామయ్య ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఏడాది జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ భారీ విజయం సాధిస్తుందని సచిన్ పైలట్ అన్నారు. రాహుల్ నాయకత్వంలో కాంగ్రెస్ ప్రజలకు మరింతగా చేరువవుతుందన్నారు. శుక్రవారం ప్రారంభమైన ఈ ప్లీనరీ సమావేశాలు మూడు రోజుల పాటు జరుగనున్నాయి. ఈ సమావేశాల్లో కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, పార్టీ సీనియర్ నేతలు, శ్రేణులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మల్లికార్జున ఖర్గే అన్నారు. ప్రత్యేక హోదా డిమాండ్‌పై ఎన్డీఏ నుంచి టీడీపీ వైదొలగడంపై మాట్లాడుతూ, ఏపీకి ప్రత్యేక హోదా ఇచ్చి తీరాలని స్పష్టం చేశారు. త్వరలో జరుగనున్న కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం తథ్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. శనివారంనాడు కాంగ్రెస్ ప్లీనరీ సదస్సులో ఖర్గే మాట్లాడుతూ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి (యోగి) కర్ణాటకలో ప్రసంగాలతో బిజీగా గడిపారని, ఫలితంగా యూపీలో జరిగిన ఉపఎన్నికల్లో ఆ పార్టీ ఓటమి పాలైందని అన్నారు. అయితే కర్ణాటకలో కార్యకర్తలు, నేతల ఆశీస్సులు, సహకారంతో మనం మళ్లీ అధికారంలోకి రాబోతున్నామని అన్నారు. పార్టీ ఎంతో చేసినా కార్యకర్తలందరి సహకారం కూడా చాలా అవసరమని ఆయన అన్నారు. పార్టీ కార్యకర్తలు, నేతలు ఇంటింటికీ వెళ్లి ప్రచారం సాగించాలని సూచించారు. జాతి ప్రయోజనాల దృష్ట్యా విభేదాలన్నీ పక్కనపెట్టి పార్టీ కోసం కలిసి పనిచేయాలని ఖర్గే పిలుపునిచ్చారు. దేశంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమే కారణమని ఖర్గే విమర్శించారు. 'దేశంలో ప్రతిరోజూ వేలాది మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం, మోదీ చాలా వాగ్దానాలు చేశారు. కానీ బడ్జెట్‌లో కేటాయింపుల పరంగా చేసింది ఏమీ లేదు. మేము (యూపీఏ) అధికారంలో ఉన్నప్పుడు రైతు ఇబ్బందుల్లో ఉంటే వారిని వెంటనే ఆదుకునే వాళ్లం' అని అన్నారు. శనివారం ఉదయం కాంగ్రెస్ ప్లీనరీ సమావేశాన్ని పార్టీ అధ్యక్ష హోదాలో రాహుల్ గాంధీ ఇక్కడ ప్రారంభించారు. సోనియాగాంధీ, మన్మోహన్, తదితర సీనియర్, యువనేతలు ఈ ప్లీనరీలో పాల్గొన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ పేరు మార్చుకున్నారు. ఎందులో, ఎక్కడ, ఏం పేరు ఇలా డౌట్స్ మీద డౌట్స్ వస్తున్నాయి కదా.. ఏమీ లేదండి, రాహుల్ తన ట్విటర్ ఖాతా పేరును మార్చుకున్నారు. కాంగ్రెస్ ప్లీనరీ సమావేశంలో రాహుల్ ప్రసంగించడానికి కొద్ది గంటల ముందే ఈ మార్పు జరిగింది. పేరుతో పాటు ప్రొఫైల్ ఫొటోను కూడా మార్చారు. 2015 ఏప్రిల్‌లో రాహుల్ తన ట్విటర్ ఖాతాను తెరిచారు. అయితే గతేడాది నుంచి ఆయన సోషల్‌మీడియాలో చాలా చురుగ్గా ఉంటున్నారు. ముఖ్యంగా గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో రోజుకో ప్రశ్న పేరుతో భాజపాపై విమర్శల వర్షం కురిపించారు. ఆ మధ్య రాహుల్ ట్విటర్ నుంచి ట్వీట్లు చేస్తుంది వేరే వ్యక్తి అంటూ కొన్ని విమర్శలు కూడా వచ్చాయి. వీటికి తనదైన శైలిలో స్పందించిన రాహుల్.. నా కోసం ట్వీట్లు చేస్తుంది పీడీ గాంధీ అంటూ ఓ పెంపుడు శునకం వీడియోను పోస్టు చేసిన విషయం తెలిసిందే. ఆ వీడియో వైరల్‌గా మారింది. రాహుల్‌ను ట్విటర్‌లో 60లక్షల మందికి పైగా అనుసరిస్తున్నారు.

యోగి ప్రభుత్వానికి ఎదురుదెబ్బ



లక్నో: లోక్‌సభ ఉప ఎన్నికల్లో ఓటమి నుంచి కోలుకోకముందే ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వానికి మరో ఎదురుదెబ్బ తగిలింది. రాష్ట్ర కేబినెట్ మంత్రి స్వామి ప్రసాద్ మౌర్య అల్లుడు శనివారం సమాజ్‌వాదీ పార్టీలో చేరారు. ఆ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, మరో నేత అజం ఖాన్ సమక్షంలో మౌర్య అల్లుడు నవల్ కిషోర్ ఎస్పీలో చేరుతున్నట్లు ప్రకటించారు. స్వామి ప్రసాద్ మౌర్య గతంలో బీఎస్పీలో ఉన్నారు. 2016 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆయన బీఎస్పీ నుంచి భాజపాలో చేరి విజయం సాధించారు. ప్రస్తుతం రాష్ట్ర కార్మిక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా మౌర్య బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. గోరఖ్‌పూర్, ఫూల్‌పూర్ లోక్‌సభ నియోజకవర్గాల్లో జరిగిన ఉప ఎన్నికల్లో భాజపా ఓటమి పాలైన విషయం తెలిసిందే. యోగికి కంచుకోటలాంటి గోరఖ్‌పూర్‌ను ఎస్పీ తన ఖాతాలో వేసుకుంది. ఇది జరిగిన మూడు రోజుల వ్యవధిలోనే భాజపా మంత్రి కుటుంబసభ్యుడు ఎస్పీలో చేరడం గమనార్హం.

'రామజన్మభూమిపై ఆర్డినెన్స్ తేవాలి'



న్యూఢిల్లీ: అయోధ్యలోని రామజన్మభూమి స్థలం యాజమాన్య హక్కులపై కేంద్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకురావాలని బీజేపీ సీనియర్ నేత సుబ్రహ్మణ్య స్వామి కోరారు. ఈ మేరకు ప్రధాని మోదీకి ఆయన లేఖ రాశారు. రామజన్మభూమి కేసులో పురోగతిని అడ్డుకోవడమే కాంగ్రెస్ ప్రభావిత న్యాయవాదాల అజెండాగా ఉందని ఆయన ఆరోపించారు. అందువల్ల రాజ్యాంగాన్ని, చట్టాన్ని ఆయుధంగా చేసుకుని ప్రభుత్వం తప్పనిసరిగా ఆర్డినెన్స్ తీసుకురావాలని ఆయన అన్నారు. తద్వారా ఆగమశాస్త్రంలో నిష్ణాతులైన మతపెద్దలకు భూమిని అప్పగించి వారి నిర్దేశకత్వంలో భవ్య రామమందిరాన్ని నిర్మించవచ్చని ఆయన తన లేఖలో ప్రధానికి సూచించారు.

రిటైర్మెంట్‌కు ముందు ఉద్యోగం నుంచి తొలగింపు

వాషింగ్టన్: గతంలో ఎఫ్‌బీఐ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేసిన ఆండ్ర్యూ మెక్‌కేబ్‌ను ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్లు అటార్నీ జనరల్ జెఫ్ సెషన్స్‌వెల్లడించారు. అయితే పదవీవిరమణకు కేవలం ఒక్కరోజు కంటే ముందే ఆయనను ఉద్యోగం నుంచి తొలగించారు. దీని వల్ల ఆయనకు పదవీవిరమణ అనంతరం పొందే లాభాలు రాకుండా పోయే అవకాశం ఉంది. మెక్‌కేబ్ ఇటీవల తరచూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆగ్రహానికి గురవుతున్న నేపథ్యంలో రిటైర్మెంట్‌కు కేవలం 26 గంటలు ఉందనగా ఆయనను ఉద్యోగం నుంచి తీసేయడం చర్చనీయాంశంగా మారింది. మార్చి 16న రాత్రి పది గంటల(అమెరికా కాలమానం ప్రకారం) సమయంలో జెఫ్ సెషన్స్ ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. కాగా మార్చి 18న ఆయన పదవీ విరమణ చేయాల్సి ఉంది. మెక్‌కేబ్ 2016 ఫిబ్రవరి 1 నుంచి 2018 జనవరి 29 వరకు ఎఫ్‌బీఐ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేశారు. తర్వాత తన పదవీవిరమణ రోజైన మార్చి 18వరకు సెలవు పెట్టారు. హిల్లరీ క్లింటన్ ఈమెయిల్ సర్వర్ కేసు దర్యాప్తు విషయంలో సమాచారాన్ని మీడియాకు ఇచ్చేందుకు సహకరించారని , దర్యాప్తు అధికారులను తప్పుదోవ పట్టించారని ఎఫ్‌బీఐకి చెందిన ప్రొఫెషనల్ రెస్పాన్సిబిలిటీ కార్యాలయం నివేదిక అందజేసింది. అంతర్గత దర్యాప్తు నివేదిక ప్రకారం ఆయనను ఉద్యోగం నుంచి తీసెయ్యొచ్చని సిఫార్సు చేసింది. దీంతో ఆయనను వెంటనే తొలగిస్తున్నట్లు అటార్నీ జనరల్ జెఫ్‌సెషన్స్ వెల్లడించారు. మెక్‌కేబ్స్‌ను తొలగించడం జస్టిస్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన అంశమని, అయితే ఈ నిర్ణయాన్ని తాము స్వాగతిస్తున్నామని అధ్యక్ష నివాసమైన వైట్‌హౌస్ వెల్లడించింది. మెక్‌కేబ్స్ దాదాపు 20ఏళ్ల పాటు ఎఫ్‌బీఐలో పనిచేశారు. పలు కీలక పదవుల్లో పనిచేశారు. ఆదివారం రిటైర్ కావాల్సిన ఆయనను ఇలా ఉన్నట్టుండి తొలగించడంతో ఇన్నేళ్ల సర్వీసుకు సంబంధించి పెన్షన్ డబ్బు తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తనున్నాయి. మరోవైపు సమాచారాన్ని జర్నలిస్ట్‌లకు తెలియజేయడానికి తనకు అధికారం ఉందని మెక్‌కేబ్ పేర్కొన్నారు. ఇది తన విశ్వసనీయతపై జరుగుతున్న దాడి అని అన్నారు.

వెయ్యి గ్రామాల్లో వేల ట్యాంకులు కట్టిన ఘనుడు



జైపూర్: ప్రజల అవసరాల కోసం అప్పుడెప్పుడో కాకతీయులు చెరువులు కట్టించారని విన్నాం. ఇప్పుడు అదే తరహాలో ఓ వ్యక్తి సుమారు వెయ్యి గ్రామాల్లో నీటి ట్యాంకులు నిర్మిస్తున్నాడు. ఎడారి ప్రాంతమైన రాజస్థాన్‌లో నీటికి ఎంత అవస్థలు పడతారో తెలియంది కాదు. రాష్ట్రం మొత్తానికి నీరు అందించే సామర్థ్యం ఒక్కరి వల్లే కాకపోయినా ఆయన వంతు ప్రయత్నం చేస్తున్నాడు. జైపూర్‌కు చెందిన రాజేంద్ర సింగ్ 21ఏళ్లుగా రాజస్థాన్‌లోని కొన్ని గ్రామాలను గుర్తించి నీటిని నిల్వ చేసే ట్యాంకులను నిర్మిస్తున్నాడు. ప్రభుత్వ ఉద్యోగం వదిలేసి మరీ 1985లో కేంద్ర ప్రభుత్వంతో కలిసి నేషనల్ సర్వీస్ వలంటీర్‌గా చేరాడు. అప్పటి నుంచి గ్రామీణాభివృద్ధి మీద దృష్టి సారించాడు. తరుణ్ భరత్ సంఘ్ అనే సంస్థను స్థాపించి నీటి నిల్వపై ప్రచారం చేస్తున్నారు. మహాత్మ గాంధీని ఆదర్శంగా తీసుకుని గ్రామ సభలు, మహిళా బ్యాంకులు వంటివి కట్టించారు. సాధారణ సమయాల్లోనే నీటి ఎద్దడి ఉండే రాజస్థాన్‌లో వేసవి వచ్చిందంటే పరిస్థితి ఇంకా దారుణంగా ఉంటుంది. ఈసమయంలోఉన్న కొద్ది నీటిని ఆదా చేసుకునే దిశగా రాజేంద్ర ప్రచారం చేస్తుంటారు. 1985లో మొదటి సారిగా గోపా ల్‌పురా అనే గ్రామంలో నీటి ట్యాంకులు తవ్వడం ప్రారంభించారు. అప్పటి నుంచి తొమ్మిది జిల్లాల్లో 1058గ్రామాల్లో 6,500కి.మీ మేర 86000 ట్యాంకులను నిర్మించారు. కేవలం నీటి నిల్వల మీదనే కాకుండా పర్యావరణం, బాలికా విద్య తదితర అంశాలపై ఆయన చేస్తున్న సేవలకు గానూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మూడు సార్లు జాతీయ అవార్డులుతో సత్కరించింది. పర్యావరణ పరిరక్షణకు ఈయన అవలంబించే పద్ధతులకు గానూ ఓ అంతర్జాతీయ అవార్డు వరించింది.

దేశంలోనే మొదటి క్లోనింగ్ దున్నపోతు



హిసార్: ముర్రా జాతికి చెందిన గేదె ద్వారా క్లోనింగ్ పద్ధతిలో దున్నపోతుని అభివృఎద్ధి చేసినట్లు పశువుల ప్రయోగ, పరిశోధన సంస్థ (సీఐఆర్‌బీ) తెలిపింది. దేశంలోనే మొదటి సారిగా అస్సామీ జాతికి చెందిన దున్నపోతు పుట్టినట్లు సీఐఆర్‌బీ తెలిపింది. హిసార్‌లో ఉన్న ప్రయోగశాలలో దీన్ని అభివృద్ధి చేశారు. ఈ విషయంపై సీఐఆర్‌బీ అధ్యక్షుడు పీఎస్ యాదవ్ మాట్లాడుతూ... దీన్ని అభివృద్ధి చేయడానికి ఎన్నో పద్ధతులు అనుసరించాం. గతేడాది డిసెంబరు 22న సచ్ గౌరవ్(క్లోనింగ్ దున్నపోతు పేరు) సాధారణ ప్రసవంలో జన్మించింది. ముర్రాజాతికి చెందిన గేదెకి జన్మించిన ఇది ఇప్పుడు ఎంతో ఆరోగ్యంగా ఉంది. ఇది 54.4కేజీల బరువుతో పుట్టింది. దీనిపై ఎంతో శ్రద్ధ పెట్టాం. ఎందుకంటే యావత్ భారతదేశంలో అసోం జాతి గేదెలకు మంచి డిమాండ్ ఉంది. ఆ రాష్ట్రంలో పశువులను ఎక్కువగా వ్యవసాయానికి ఉపయోగిస్తున్నారు. అసోం జాతి, ముర్రాజాతి రెండు జాతులు కలవడం వల్ల ఇటు వ్యవసాయానికి, అటు పాల దిగుబడికి ఉపయోగపడతాయనే ఉద్దేశంతో మొదటిసారి క్లోనింగ్ పద్ధతిని అనుసరించాం.ఇందుకు మాకు భారత వ్యవసాయ పరిశోధన మండలి(ఐసీఏఆర్) ఎంతో సహకారం అందించింది. జంతువుల క్లోనింగ్ అనేది మంచి లక్షణాలున్న జంతువులను అభివృద్ధి చేయడానికి ఉపయోగపడే అద్భుతమైన ప్రత్యుత్పత్తి పద్ధతి అని తెలిపారు. మనది వ్యవసాయ ఆధారిత దేశం. అందులో పాల దిగుబడి, వినియోగం ఎక్కువగానే ఉంటుంది. దీనికి ప్రత్యామ్నాయం అవసరమని భావించాం. అసోం జాతి గేదెలు కేవలం ఈశాన్య రాష్ట్రాలకే పరిమితమై ఉన్నాయి. వీటి ఉనికిని దేశవ్యాప్తం చేయడానికే ఈ ప్రయోగం చేశాం. ఐసీఏఆర్- సీఐఆర్‌బీ పర్యవేక్షణలో క్లోనింగ్ ద్వారా ఇంతకు ముందు గేదెను అభివృద్ధి చేశాం. 2011 డిసెంబరు 15న దేశ చరిత్రలోనే మొదటిసారిగా గేదెను సృష్టించాం. దీని స్ఫూర్తితో కేవలం 22నెలల్లోనే మరో 10గేదెల వరకూ అభివృద్ధి చేశాం. ఈ క్లోనింగ్ గేదెలను, దున్నపోతులను ఎక్కువగా సృష్టించడం వల్ల దేశవ్యాప్తంగా కొందరికైనా ఉపాధి లభిస్తుంది. ఇవి ముఖ్యంగా పాడి రైతులకు ఉపయోగకరంగా ఉంటాయి. అని ఐసీఏఆర్-సీఐఆర్‌బీ ఇంద్రజిత్ సింగ్ అన్నారు.

భారత్‌లో స్టీఫెన్ హాకింగ్ కోరిక తీరలేదు



న్యూఢిల్లీ: ప్రపంచ దిగ్గజ శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ గత బుధవారం మరణించారు. ఆయనకు తీరని కోరిక ఒకటి మిగిలిపోయిందని ఒక లేఖ ద్వారా వెల్లడైంది. 17 సంవత్సరాల క్రితం స్టీఫెన్ హాకింగ్ భారత్‌లో పర్యటించారు. ఆ సమయంలో ఆయన నేషనల్ సెంటర్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్ ఫర్ డిజేబుల్డ్ పీపుల్ (ఎన్‌సీపీఈడీఎల్) డైరెక్టర్ జావేద్ అబిదికి ఒక లేఖ రాశారు. భారత్‌లో చరిత్రాత్మక ప్రదేశాలైన హుమాయున్ సమాధి, జంతర్ మంతర్, కుతుబ్ మినార్, తాజ్ మహల్ వంటి ప్రదేశాలు చూడాలని ఉందని దానిలో వెల్లడించారు. అవయవ లోపం ఉన్నవారు ఆ పర్యటనను తేలిగ్గా చేసేలా ఏర్పాట్లు చేయమని కోరారు. ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియాకూ అటువంటి లేఖనే పంపారు. కానీ ఆ అధికారులు ఒక్క ఇటుక కూడా మేం కదిలించం. యథాతథ స్థితిలోనే చూడాల్సి ఉంటుంది అన్నట్టు వ్యవహరించారు. దాంతో హాకింగ్ కేవలం కుతుబ్ మినార్, జంతర్ మంతర్ మాత్రమే చూడగలిగారు. అక్కడ కూడా తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ర్యాంప్‌లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. అయితే ఆయన పర్యటన దేశంలోని ప్రముఖ కట్టడాలు దివ్యాంగులు చూడటానికి అనుకూలంగా మారడానికి కారణం అయ్యాయి. ఈ ఏర్పాట్ల కోసం దివ్యాంగులు ఎప్పటినుంచో పోరాటం చేస్తున్నారు. మనం దేశంలో హాకింగ్ పర్యటన అనంతరం అప్పటి పర్యాటక శాఖ మంత్రి అనంతకుమార్ తాజ్‌మహల్‌తో సహా మిగతా కట్టడాలన్నింటిని అందరూ చూడగలిగే ప్రదేశాలుగా మారుస్తామని ప్రకటించారు. హాకింగ్ భారత్‌లో పర్యటించి 15 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్ విత్ డిజబిలిటీస్... 50 చారిత్రక కట్టడాల్లో దివ్యాంగులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని నిర్ణయించాయి. వాటిలో భాగంగా దివ్యాంగులకు అనుకూలమైన టాయిలెట్లు, రెయిలింగ్స్, ర్యాంపులు నిర్మిస్తారు. హాకింగ్ తాజ్‌మహల్‌ను చూడలేకపోయినా ఆయన రావడం వల్లే ఇప్పుడు అనేక మంది దివ్యాంగుల కోరిక నెరవేరుతోంది.

సంకటస్థితిలో సిరియా ప్రజలు



బైరుట్: సిరియాలో ఉగ్రవాదులు, ప్రభుత్వ బలగాల మధ్య యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో అక్కడి ప్రజల పరిస్థితి అత్యంత దారుణంగా మారింది. దాడుల్లో వేల మంది ప్రాణాలు కోల్పోతున్నారు. గాయాల పాలవుతున్నవారికి లెక్కేలేదు. వీటి నుంచి తప్పించుకోవడానికి ఎంతో మంది తమ ప్రాంతాలు వదిలేసి పారిపోతున్నారు. సిరియా ఉత్తర ప్రాంతంలోని ఆఫ్రిన్ నగరం నుంచి మూడు రోజుల్లో దాదాపు రెండు లక్షల మంది పారిపోయారని సిరియాకు చెందిన మానవ హక్కుల పరిశీలన సంస్థ వెల్లడించింది. టర్కీ దళాల సహకారంతో సిరియా ప్రభుత్వ వర్గాలు కుర్దులను అణచడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఇందులో భాగంగానే దాడులు చేస్తుండటంతో సామాన్యులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈరోజు కూడా దాదాపు 50వేల మంది నగరం విడిచి వెళ్లిపోయారని బ్రిటన్‌కు చెందిన మానవ హక్కుల పరిశీలన సంస్థ తెలిపింది. ఇక్కడ పరిస్థితి అత్యంత భయంకరంగా ఉందని సంస్థ డైరెక్టర్ రమి అబ్దెల్ రెహమాన్ వెల్లడించారు. కుర్దిష్ పీపుల్స్ ప్రొటెక్షన్ యూనిట్స్ ఆధీనంలో ఉన్న ఆఫ్రిన్ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోవాలని సిరియా ప్రభుత్వం దాదావుగా గత రెండు నెలలుగా దాడులు చేస్తోంది. ఆఫ్రిన్‌లో దాదావు 3,50,000 మంది ఉండగా బలగాలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి కేవలం దక్షిణం వైపు నుంచి మాత్రమే ప్రజలు పారిపోవడానికి అనుమతి ఇచ్చారని రమి అబ్దెల్ తెలిపారు. సిరియాలోని తూర్పు గౌటా ప్రాంతంలోనూ తిరుగుబాటు దారులపై రష్యా దళాల సహకారంతో సిరియా ప్రభుత్వ దళాలు దాడులు చేస్తున్నాయి. నేడు జరిగిన వైమానిక దాడుల్లో 30 మంది పౌరులు మరణించారని బ్రిటన్‌కు చెందిన మానవహక్కుల పరిశీలన సంస్థ వెల్లడించింది. జమాల్కా పట్టణంలో ఈ దాడులు జరిగినట్లు తెలిపింది. తూర్పు గౌటా ప్రాంతాన్ని ప్రభుత్వం తమ ఆధీనంలోకి తీసుకోవడానికి ఫిబ్రవరి 18 నుంచి దాడులు చేస్తోంది. ఇప్పటికే 70శాతం ప్రాంతాన్ని స్వాధీనం చేసుకుంది. ఈ ప్రాంతంలో గత కొన్ని రోజులుగా జరుగుతున్న వైమానిక దాడుల్లో 1390మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని బ్రిటన్ సంస్థ తెలిపింది. ఇక్కడ కూడా వేల మంది ప్రజలు తిరుగుబాటు దారుల ఆధీనంలోని ప్రాంతాల నుంచి ప్రభుత్వ ఆధీనంలోని ప్రాంతాలకు పారిపోతున్నారని వెల్లడించింది.




రాజకీయాలు విడదీస్తాయి : కమల్



చెన్నై : ఇటీవలే నూతన రాజకీయ పార్టీ ప్రారంభించిన కమల్ హాసన్ అటు రాజకీయాలను, ఇటు సినిమాలనూ సమన్వయం చేస్తున్నారు. చెన్నైలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఇప్పటి వరకు నేనూ, రజనీకాంత్ ఎన్నో సినిమాలు చేశాం. ఎన్నో సూపర్‌హిట్స్ అందుకున్నాం. అయినా ఇద్దరి వ్యూహాలు వేరు. ఇరువురి అభిరుచి వేరు. సినిమాల్లో ఆయన చేసిన పాత్రలు నేను చేయలేదు. ఆయన కూడా నాలాంటి పాత్రలు చేయలేదు. ఏదేమైనా సినిమాలో మా ఉద్దేశం ఒకటే... సగటు ప్రేక్షకులని అలరించడం. కాకపోతే ఇప్పుడు ఇద్దరం రాజకీయాల్లోకి ప్రవేశించాం. ఆయన రాజకీయ వ్యూహాలేంటో నాకు తెలీదు. రాజకీయంగా నా సిద్ధాంతాలు నాకున్నాయి. నేను మతాలను నమ్మను. నాకు ఏ మతం మీదా ప్రేమలేదు. ఇప్పటివరకూ చిత్ర పరిశ్రమలో కలిసి ఉన్న మమ్మల్నిద్దరినీ రాజకీయాలు వేరు చేస్తాయి. ఆయనతో నాకు మంచి అనుభవం ఉంది. కాబట్టి మేమిద్దరం రాజకీయంగా వేరైనా వాటి ప్రభావం మా బంధంమీద పడదు అని అన్నారు. కమల్ గత నెలలో మక్కల్ నీది మయ్యుమ్అనే రాజకీయ పార్టీని స్థాపించారు.

భారత తొలి ప్రధానికి ఘోర అవమానం



కోల్‌కతా: విగ్రహ విధ్వంసాల వైరస్ మళ్లీ బెంగాల్‌లో చోటుచేసుకుంది. పశ్చిమబెంగాల్‌లోని బుర్ద్వాన్ జిల్లా కట్వా టౌన్‌లో కొందరు అగంతకులు భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లలో నెహ్రూ విగ్రహాన్ని శనివారం ఉదయం ధ్వంసం చేసే ప్రయత్నం చేశారు. కట్వా మున్సిపాలిటీ సమీపంలో ఉన్న నెహ్రూ విగ్రహంపై తారు చల్లారు. ఈ విషయం తెలుసుకున్న మున్సిపాలిటీ అధికారులు గుర్తుతెలియని వ్యక్తులపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కట్వా మున్సిపాలిటీ తృణమూల్ కాంగ్రెస్ అధీనంలో ఉండగా...ఫిర్యాదులో మాత్రం ఎవరి పేరూ పేర్కొనలేదు. అయితే ఈ చర్య వెనుక బీజేపీ మద్దతుదారుల ప్రమేయం ఉందని మున్సిపాలిటీ చైర్మన్ రబీంద్రనాథ్ ఛటర్జీ ఆరోపించగా, ఆ ఆరోపణలను బీజేపీ స్థానిక నేత కిషన్ ఘోష్ తోసివుచ్చారు. రాజకీయ విభేదాలు ఉండొచ్చు కానీ, తమ పార్టీ వారెవరూ అలాంటి చర్యలకు పాల్పడరని ఘోష్ వివరణ ఇచ్చారు.

నరేశ్ అగర్వాల్ చేరికపై విమర్శలు



న్యూఢిల్లీ : సమాజ్‌వాది పార్టీ మాజీ పార్లమెంట్ సభ్యుడు నరేశ్ అగర్వాల్‌ను ఇటీవల భారతీయ జనతాపార్టీ చేర్చుకోవడం పట్ల సర్వత్రా విస్మయం వ్యక్తం అవుతోంది. సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విస్కీలో విష్ణువు ఉన్నారు, రమ్లో శ్రీరామ్ ఉన్నారంటూ హిందూ దేవుళ్లను మద్యం బ్రాండ్లతో పోల్చడం, భారత సైన్యం సత్తాను ప్రశ్నించడం, పాక్లో ఉరి శిక్ష పడిన కులభూషణ్ జాదవ్‌ను టెర్రరిస్టుగా వర్ణించడం, సమాజ్‌వాది పార్టీ ఎంపీ జయా బచ్చన్పై సెక్స్ కామెంట్లు చేయడం, ప్రధాని నరేంద్ర మోడీకి కులతత్వాన్ని ఆపాదించడం ద్వారా నరేశ్ అగర్వాల్ అత్యంత వివాదాస్పదుడయ్యారు. గోమాంసం, ట్రిపుల్ తలాక్ పట్ల బీజేపీ వైఖరిని తీవ్రంగా విమర్శించిన ఆయన ఓ గ్యాంగ్ రేప్పై అనుచిత వ్యాఖ్యలు చేశారు. పెద్ద నోట్ల రద్దు తాము తీసుకున్న అత్యంత దరిద్రమైన నిర్ణయమని ఏనాడైనా బీజేపీ ఒప్పుకుంటుందా? అని కూడా ఆయన ప్రశ్నించారు. ఇలాంటి వ్యక్తిని పార్టీలోకి తీసుకోవడానికి బీజేపీ ఏమైనా వాషింగ్ మిషనా!, బీజేపీ భిన్నమైన పార్టీ అంటే అర్థం ఇదేనా? అని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు.

ద్రవిడనాడుకు స్టాలిన్ మద్దతు



చెన్నై: దక్షిణాది రాష్ట్రాలు అన్నీ కలిసి 'ద్రవిడ నాడు' ఏర్పాటుకు డిమాండ్ చేసే పరిస్థితి వస్తే తాను స్వాగతిస్తానంటూ డీఎంకే నేత ఎంకే స్టాలిన్ అన్నారు. దక్షిణాది రాష్ట్రాలన్నీ కలిసి ఉమ్మడి 'ద్రవిడ నాడు' ఏర్పాటు చేస్తాయా అని అడిగినప్పుడు 'అదే జరిగితే నేను స్వాగతిస్తారు. అలా జరగొచ్చని కూడా నమ్ముతున్నాను' అని స్టాలిన్ సమాధానమిచ్చారు. ఆయన వ్యాఖ్యలు తమిళనాట తాజా చర్చకు దారితీసింది. ఆర్కే నగర్ ఎమ్మెల్యే టీటీవీ దినకరన్ దీనిపై శనివారంనాడు స్పందించారు. 'ద్రవిడ నాడు'కు అసలు అవకాశమే లేదని ఆయన అన్నారు. డీఎంకే అధికారంలో ఉన్నన్ని రోజులూ ఆయన ఏమి చేశారు? అని స్టాలిన్‌ను నిలదీశారు. ప్రస్తుతం ఆయన కావేరీ అశంపై దృష్టి సారిస్తే మంచిదని దినకరన్ హితవు పలికారు. ద్రవిడ నాడు'ను స్వాగతిస్తున్నట్టు తాను చేసిన వ్యాఖ్యలు చర్చకు దారితీయడంతో స్టాలిన్ వెంటనే స్పందించారు. తాను ఒక ప్రశ్నకు సమాధానంగానే ఆ విషయం చెప్పానని, దాని అర్థం తాను ద్రవిడ నాడు ప్రచారానికి శ్రీకారం చుడతానని కాదని అన్నారు. కాగా, తమిళ, మలయాళ, తెలుగు, కన్నడ భాష మాట్లాడే ప్రజలకు 'హోం ల్యాండ్' ఉండాలన్న ఈవీ రామస్వామి పెరియార్ ఆలోచనకు ప్రతిరూపమే 'ద్రవిడ నాడు'గా చెబుతారు. 1940 దశకంలో ఆయన డీఎంకేను స్థాపించినప్పుడు పార్టీ సిద్ధాంతాల్లో ఇది కూడా ఒకటిగా ఉందని డీఎంకే వర్గాల సమాచారం.

జాతీయగీతం వినగానే వారేం చేస్తారంటే...!



కోల్‌కతా: కొంతమంది జాతీయగీతం వినబడగానే లేచి నిలబడేందుకు కష్టంగా భావిస్తారు. కానీ, పశ్చిమ్‌బంగాలోని ఓ గ్రామస్థులు మాత్రం జనగణమన వస్తున్నంతసేపూ తమ ఇళ్లలోని పనులను సైతం నిలిపివేసి గీతాన్ని ఆలపిస్తూ ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. నదియా జిల్లాలోని నాందేస్క్రిప్ట్ అనే గ్రామంలో రోజూ ఉదయాన్నే 10.50గం. అక్కడ పాఠశాలలో 52 సెకండ్ల పాటు జాతీయగీతాన్ని ఆలపిస్తారు. గీతాలాపన ప్రారంభం కాగానే పాఠశాల పరిసర ప్రాంతాల్లోని ఇళ్లలో నివసించే ప్రజలు, పాదచారులు, ద్విచక్రవాహనదారులు, ఆటోరిక్షాలు, సైకిళ్లపై వెళ్లేవాళ్లు ఎక్కడికక్కడ ఆగిపోతారు. వాహనదారులు రహదారిపైనే నిలబడి గీతాన్ని ఆలపిస్తారు. అది పూర్తయిన తర్వాత మళ్లీ యథావిధిగా తమ పనులు చేసుకుంటారు. అభయ్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో రోజూ జాతీయగీతాన్ని ఆలపిస్తారు. పాఠశాలకు వంద మీటర్ల దూరం వరకు విద్యార్థులు ఆలపించే గీతం వినపడే విధంగా లౌడ్‌స్పీకర్లు పెట్టారు. విద్యార్థుల్లోనే కాదు.. ప్రజల్లో కూడా దేశభక్తిని పెంపొందించేందుకు ఈ విధంగా చేస్తున్నామని సదరు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సఫికుల్ ఇస్లాం చెప్పుకొచ్చారు. జాతీయగీతాలాపన జరిగే సమయంలో వాళ్లు కూడా పాడాల్సిందిగా గ్రామస్థులను కోరగా అందుకు వాళ్లందరూ సంతోషంగా అంగీకరించారట.

పొగతాగే చిన్నారుల సంఖ్య పెరుగుదల

న్యూఢిల్లీ: పొగతాగడం ఆరోగ్యానికి హానికరం అని ఎన్నిసార్లు హెచ్చరించినా కొందరు ఏ మాత్రం పట్టించుకోరు. ఆ అలవాటుకు బానిసై అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటారు. అయితే పెద్దలే కాదు చిన్నారులు కూడా ఈ దురలవాటుకు బానిసలుగా మారుతున్నారు. తెలిసీ తెలియని వయసులో ఆకర్షణకులోనై తమ జీవితాలను కోల్పోతున్నారు. మన దేశంలో 6.25లక్షల మంది చిన్నారులు రోజూ పొగతాగుతున్నట్లు ఇటీవల విడుదలైన ఓ నివేదిక ద్వారా వెల్లడైంది. వారంతా 10 నుంచి 14ఏళ్ల వయసు మధ్యవారే కావడం గమనార్హం. అమెరికన్ క్యాన్సర్ సొసైటీ(ఏసీఎస్), వైటల్ స్ట్రాటజీస్ సంయుక్తంగా గ్లోబల్ టొబాకో అట్లాస్ డేటా పేరుతో నివేదిక విడుదల చేశాయి. దీని ప్రకారం.. ఏటా భారత్‌లో పొగాకు సంబంధిత వ్యాధుల కారణంగా 9.32లక్షల మందికి పైగా ప్రాణాలు కోల్పోతున్నారు. అంటే వారానికి 17,887 పొగాకు సంబంధిత మరణాలు చోటు చేసుకుంటున్నాయి. మనదేశంలో 15 ఏళ్లు అంతకంటే పైబడిన వయసు గల వారిలో 10.3కోట్ల మంది ప్రజలు రోజూ పొగతాగుతున్నట్లు నివేదికలో పేర్కొన్నారు.

సూర్య స్పోర్ట్స్

హైదరాబాద్‌లో భారత తొలి డే-నైట్ టెస్ట్



హైదరాబాద్ : టీమిండియా తొలి డే-నైట్ టెస్ట్ మ్యాచ్‌ను హైదరాబాద్ లేక రాజ్‌కోట్ వేదికగా నిర్వహించాలని బీసీసీఐ భావిస్తోంది. 2018-19 సీజన్‌లో స్వదేశంలో జరగనున్న మ్యాచ్‌ల వేదికలను ఎంపిక చేయడం కోసం బీసీసీఐ శనివారం సమావేశం నిర్వహించింది. స్వదేశంలో టీమిండియా కేవలం మూడు టెస్టు మ్యాచ్‌లే ఆడనుంది. అఫ్ఘనిస్తాన్‌తో చారిత్రాత్మక ఏకైక టెస్టు, వెస్టిండీస్‌తో రెండు టెస్టు మ్యాచ్‌లు జరగనున్నాయి. అయితే వీటిలో ఒక టెస్ట్ మ్యాచ్‌ను ప్రయోగాత్మకంగా డే-నైట్ టెస్టు మ్యాచ్ నిర్వహించాలని బీసీసీఐ భావిస్తోంది. ఈ మేరకు సమావేశంలోని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. అయితే ఈ ప్రతిపాదనకు పాలకుల కమిటీ (సీఓఏ) ఆమోదం తెలుపాల్సి ఉందని బీసీసీఐ కార్యదర్శి అమితాబ్ చౌదరి మీడియాకు తెలిపారు. అక్టోబర్ వరకు ఆస్ట్రేలియాలో పర్యటించనున్న భారత జట్టు దివాళీ అనంతరం వెస్టిండీస్‌కు ఆతిథ్యం ఇవ్వనుంది. రెండు టెస్టు మ్యాచ్‌లతో పాటు 5 వన్డే, 3 టీ20లు జరుగనున్నాయి. అనంతరం ఆస్ట్రేలియాతో 5 వన్డే, 2 టీ20 మ్యాచ్‌లు జరుగుతాయి. వీటికి సంబంధించిన వేదికలను సమావేశంలో బీసీసీఐ అధికారులు ఖారారు చేయగా పాలకుల కమిటీ ఆమోదించాల్సిఉంది.

ఆఖరి మ్యాచ్ ఆడేశా : పీటర్సన్



దుబాయి : ఇంగ్లాండ్ స్టార్ బ్యాట్స్‌మెన్ కెవిన్ పీటర్సన్ తన క్రికెట్ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. ఆఖరి మ్యాచ్ కూడా ఆడేశానని ప్రకటించాడు. ప్రస్తుతం అతడు పాకిస్థాన్ క్రికెట్ ప్రీమియర్ లీగ్‌లో క్వెట్టా గ్లాడియేటర్స్ తరవున బరిలోకి దిగాడు. ఇక తన పూర్తి సమయంకుటుంబానికే కేటాయిస్తానంటూ ప్రకటించాడు. బూట్స్ అప్! కృతజ్ఞతలు! అని ట్వీట్ చేశారు. దీంతో ఆయన గతంలో చెప్పినట్లే ఇదే ఆయన ఆఖరి టోర్నీ అని మరోసారి తేలిపోయింది. ఇంగ్లాండ్ జట్టులో మంచి ప్రతిభావంతుడిగా.. అరుదైన బ్యాట్స్‌మెన్‌గా పేరు తెచ్చుకున్న పీటర్సన్.. అనేక వివాదాల ద్వారా వివాదాస్పద క్రికెటర్‌గానూ వార్తల్లోకెక్కాడు. 2013-14 యాషెస్ సిరీస్‌లో పేలవ ఫాం కారణంగా పీటర్సన్‌ను ఎంపిక చేయకపోవడంతో అతడి కెరీర్ అనూహ్యంగా ముగిసింది. తర్వాత ప్రపంచవ్యాప్తంగా అతడు అనేక లీగ్ టోర్నీలు ఆడాడు. ఇక అతడి ట్వీట్‌కు స్పందిస్తూ పలువురు క్రికెటర్లు, వ్యాఖ్యాతలు ట్వీట్స్ చేశారు. ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ మైకేల్ వాన్ వెల్ డన్ కేపీ. నీలాంటి అత్యుత్తమ బ్యాట్స్‌మెన్‌తో కలిసి ఆడటాన్ని గౌరవంగా భావిస్తు న్నా. ఆసీస్ జట్టులో భయం పుట్టించిన తొలి ఇంగ్లాండ్ బ్యాట్స్‌మెన్‌వి నువ్వే. అంటూ ప్రశంసించాడు. మరో క్రికెటర్ డారెన్ గాఫ్ అద్భుతమైన కెరీర్ అంటూ పేర్కొన్నాడు. ఇక క్రికెట్ వ్యాఖ్యాతగా మారిన విండీస్ టినో బెస్ట్... నీతో కలిసి.. నీలాంటి లెజెండ్‌కు పోటీగా ఆడటం చాలా గొప్పగా ఉంది. నీ భవిష్యత్తు బాగుండాలి. అంటూ ట్వీట్ చేశారు. ఇక మరో ట్వీట్‌లో తన క్రికెట్ కెరీర్‌లో మొత్తం 30,000 పరుగులు చేశానని.. అందులో 152 అర్ధ శతకాలు, 68 శతకాలు ఉన్నట్లు తనకు చెప్పారని వెల్లడించారు. పీటర్సన్ తన అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌లో మొత్తం 104 టెస్టులు, 136 వన్డేలు, 37 టీ20లు ఆడాడు. 2010లో కరేబియన్‌లో జరిగిన టీ20 ప్రపంచకప్ గెలిచిన ఇంగ్లాండ్ జట్టులో సభ్యుడు.

షమి అబద్ధాల కోరు



న్యూఢిల్లీ : టీమిండియా పేస్ బౌలర్ మహ్మద్ షమీపై అతని భార్య హసీన్ జహాన్ ఆరోపణల పరంపర కొనసాగుతూనే ఉంది. ఇతర అమ్మాయిలతో అక్రమసంబంధాలు ఉన్నట్లు గతంలో ఆరోపణలు చేసిన జహాన్, తాజాగా తన భర్త పెద్ద అబద్ధాలకోరని, విలువలు లేని వ్యక్తి అని, తనని కాపాడుకోవడం కోసం అబద్దాలు ఆడుతూ తనపై లేని పోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇక చివరి సారిగా షమీతో వాట్సాప్ కాల్ మాట్లాడానని అది కూడా షమీ ప్రణాళికలో భాగంగా చేసిందేనని ఆమె తెలిపారు. ఈ వీడియో కాల్‌లో వివాదం పరిష్కారం కావాలంటే ఏం చేయాలని అడిగాడని, చేసిన తప్పులు ఒప్పుకొని, క్షమాపణలు కోరాలని సూచించినట్లు ఆమె ఓ జాతీయ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. క్రికెట్ గురించి అంతగా తెలియని తనకు షమీపై ఫిక్సింగ్ ఆరోపణలు ఎలా చేస్తానని జహాన్ ప్రశ్నించారు. ఆ మొబైల్ ఫోన్ తనకి దొరక్కుండా ఉంటే షమీ ఎప్పుడో విడాకులిచ్చేవాడన్నారు. రెండేళ్లుగా తన భర్త నుంచి వేధింపులు భరిస్తున్నానని, సరైన ఆధారాలు లేకే ఇన్ని రోజులు ఓపికగా ఎదురు చూశానన్నారు. ఇప్పటికీ అన్ని మరిచిపోయి నూతన జీవితం ప్రారంభించటానికి సిద్ధంగా ఉన్నట్లు ఆమె స్పష్టం చేశారు. ఇక ఐపీఎల్‌లో షమీ ఆడేది బీసీసీఐ నిర్ణయంపై ఆధారడి ఉంది. వీలైనంత త్వరగా ఈ కేసు సమసి పోవాలని కోరుకుంటున్నామని బీసీసీఐ అధికారి ఒకరు తెలిపారు. షమీపై ఫిక్సింగ్ ఆరోపణలు రావటంతో బీసీసీఐ అవినీతి నిరోధక శాఖ దర్యాప్తు చేస్తోంది. ఇప్పటికే షమీ, తన భార్య జహాన్ కాల్ డేటాను అధికారులు పరిశీలిస్తున్నారు.

బీసీసీఐని నేను కోరేది ఒకటే : షమి

తన భార్య హసిన్ జహాన్ చేసిన మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలను భారత్ క్రికెట్ జట్టు బౌలర్ మహ్మద్ షమి కొట్టిపారేశాడు. ఈ అంశంపై పూర్తి స్థాయి దర్యాప్తు జరగాలని తాను కోరుకుంటున్నట్లు శనివారం ఓ మీడియా సంస్థకిచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించాడు. తాను ఎప్పుడూ ఎలాంటి మ్యాచ్ ఫిక్సింగ్‌ల్లోనూ పాల్గొనలేదని.. తనకు బీసీసీఐ ఎప్పుడూ మద్దతుగా నిలిచిందని పేర్కొన్నాడు. నేను బీసీసీఐ నుంచి ఆశిస్తున్నది ఒకటే.. ఈ అంశంపై వారు పూర్తి స్థాయి విచారణ చేపట్టాలి. అన్ని అంశా లను పరిశీలించాలి. ఓ పాకిస్థానీ అమ్మాయి వద్ద నుంచి డబ్బులు తీసుకోవడం.. దుబాయి వెళ్లిన ఘటనలను రెండింటినీ తప్పుగా కలిపి చూపిస్తున్నారు. నేనెప్పుడూ తప్పు చేయలేదు. భవిష్యత్తులో చేయను కూడా. ఇదంతా నా వ్యక్తిత్వాన్ని దెబ్బతీయడానికి చేస్తున్న ప్లాన్. దీనిపై పూర్తి స్థాయి విచారణ జరగాలని కోరుకుంటున్నా. అని షమి చెప్పుకొచ్చాడు. ఇది ప్రజల్లోకి వెళ్లిన కుటుంబ వ్యవహారం. నా జట్టు సహచరులందరికీ నేనేంటో తెలుసు. గతంలో వారు నాకు చాలా మద్దతుగా నిలిచారు. భవిష్యత్తులోనూ కొనసాగుతుందని భావిస్తున్నా. నేను కొందరు జట్టు సభ్యులతో మాట్లాడాను. మరికొందరు నాకు బహిరంగంగానే మద్దతు తెలిపారు. అన్ని కుటుంబాల్లోనూ ఏదో ఒక సమస్య ఉంటుంది. కానీ, అవి పరిమితులు దాటి బయటికిరావు. నా కుమార్తెకు ఎంతో జీవితం ముందుంది. ఆమె భవిష్యత్తును కాపాడాల్సిన బాధ్యత నాపై ఉంది. దాని కోసం చేయాల్సిందంతా చేస్తాను. అంటూ వివరించాడు. ఓ పాకిస్థానీ అమ్మాయి నుంచి షమి డబ్బుల తీసుకున్నాడని అతడి భార్య ఆరోపించిన నేపథ్యంలో సీఓఏ అధినేత వినోద్ రాయ్ విచారణకు ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై ఏసీయూ అధినేత నీరజ్ కుమార్ విచారణ జరుపుతున్నారు.

ప్రపంచ నంబర్‌వన్‌కు షాక్



కాలిఫోర్నియా : ఇండియన్ వెల్స్ మాస్టర్స్ టోర్నీలో ప్రపంచ నంబర్‌వన్ టెన్నిస్ క్రీడాకారిణి సిమోనా హలెప్‌కు చుక్కెదురైంది. మహిళల సింగిల్స్‌లో భాగంగా జరిగిన సెమీ ఫైనల్ మ్యాచ్‌లో హలెప్ 3-6, 0-6 తేడాతో జపాన్‌కు చెందిన అన్ సీడెడ్ క్రీడాకారిణి నయోమి ఒసాకా చేతిలో ఓటమి పాలైంది. 64 నిమిషాల పాటు జరిగిన పోరులో హలెప్ ఏ దశలోనూ ఆకట్టులేకపోయింది. అనవసర తప్పిదాలతో తొలి సెట్‌ను కోల్పోయిన హలెప్.. రెండో సెట్‌లో కూడా అదే పునరావృతం చేసింది. ఫలితంగా టోర్నీ నుంచి హలెప్ నిష్క్రమించగా, ఒసాకా ఫైనల్‌కు చేరింది. ఆదివారం జరిగే తుదిపోరులో రష్యాకు చెందిన దారియా కసాత్కినాతో ఒసాకా అమీతుమీ తేల్చుకోనుంది.

బంగ్లా ఆటగాళ్లపై లంక బాస్ ఫైర్

ఆటగాళ్ల విజయ సంబరాల్లో భాగంగానే అద్దాలు ధ్వంసం



కొలంబో : నిదహాస్ ట్రోఫీలో భాగంగా శుక్రవారం జరిగిన ఉత్కంఠకర మ్యాచ్‌లో బంగ్లాదేశ్ ఆటగాళ్ల తీరుపై శ్రీలంక క్రికెట్ ఛీఫ్ తిలింగా సుమతిపాలా అసంతృప్తి వ్యక్తం చేశారు. మ్యాచ్ జరుగుతుండగా అంపైర్ల నిర్ణయం పట్లబంగ్లా ఆటగాళ్లు వ్యవహరించిన తీరు ఆహ్వానించదగినది కాదని, విచారకరమైన ఘటనగా ఆయన అభివర్ణించారు. ఇక ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ బ్యాటింగ్ చివరి ఓవర్లో గందరగోళం ఏర్పడిన విషయం తెలిసిందే. అంపైర్లు నోబాల్ ఇవ్వడం లేదని బంగ్లా ఆటగాళ్లు అసహనానికి లోనయ్యారు. అంతేగాకుండా బంగ్లా కెప్టెన్ షకీబ్ అల్ హసన్ బ్యాట్స్‌మన్‌ను మైదానం వీడమని సూచించడం మైదానంలో ఉత్కంఠకు తెరలేపింది. ఇక రిజర్వ్ ఆటగాడు నురుల్ లంక కెప్టెన్ పెరీరాతో వాగ్వాదానికి దిగడం గొడవకు మరింత ఆజ్యం పోసినట్లైంది. దీంతో మైదానంలో గందరగోళ పరిస్థి తులు ఏర్పాడ్డాయి. చివరికి బంగ్లా ఓ బంతి మిగిలి ఉండగానే మ్యాచ్ గెలి చింది. అనంతరం బంగ్లా ఆటగాళ్లు నాగినీ డ్యాన్స్‌లతో చిందేశారు. ఈ నేపథ్యంలో లంక ఆటగాళ్లతో మరోసారి వాగ్వాదం చోటు చేసుకుంది. ఇక మ్యాచ్ ప్రజెంటేషన్ అనంతరం బంగ్లా డ్రెస్సింగ్ అద్దాలు ధ్వంసమవ్వడంతో దుమారం రేగింది. అయితే ఈ అద్దాలు బంగ్లా ఆటగాళ్లు విజయ సంబరాలు జరువుకుంటుండగా ధ్వంసమైనట్లు తెలిసింది. ఈ ఘటనపై స్పందించిన ఐసీసీ బంగ్లా కెప్టెన్ షకీబ్ అల్ హసన్, రిజర్వు ఆటగాడు నురుల్ మ్యాచ్ ఫీజులో 25 శాతం కోతతో పాటు ఓ డీమెరిట్ పాయింట్ విధించారు.

ఆటలో గందరగోళం.. పగిలిన కిటికీ అద్దం



కొలంబో : నిదహాస్ ట్రోఫీలో భాగంగా శుక్రవారం బంగ్లాదేశ్, శ్రీలంక మధ్య జరిగిన మ్యాచ్ ఆఖరి ఓవర్‌లో గందరగోళం నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఇరు జట్ల ఆటగాళ్లు హద్దు మీరి ప్రవర్తించడం, బంగ్లాదేశ్ కెప్టెన్ షకిబ్ అల్ హసన్ అసహనాన్ని ప్రదర్శిస్తూ క్రీజులో ఉన్న ఆటగాళ్లను వెనక్కి రమ్మంటూ సంజ్ఞలు చేయడంతో మైదానంలో గందరగోళం ఒక్కసారిగా తారాస్థాయికి చేరుకుంది. అయితే మరోవైపు బంగ్లాదేశ్ గెలువు ఖాయం అయిన అనంతరం మైదానంలో ఆ జట్టు డ్రెసింగ్ రూమ్ కిటికీ అద్దం పగిలిపోయింది. దీనికి సంబంధించి అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ మ్యాచ్ రిఫరీ క్రిస్ బ్రాడ్ ప్రేమదాస స్టేడియం అధికారులను మ్యాచ్‌కు సంబంధించిన పూర్తి సీసీటీవీ ఫుటేజిని అడిగారు. ఒకవేళ ఈ ఉదంతంలో ఆటగాళ్లు ఎవరైనా ఉండి ఉంటే వారిపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. మరోవైపు శ్రీలంక బోర్డు సైతం మైదానంలోని వస్తువులకు జరిగిన నష్టం గురించి సీసీటీవీ ఫుటేజిని పరిశీలించి కారకులపై చర్యలు తీసుకోవాలని ఐసీసీని కోరినట్లు సమాచారం. అంపైర్లు సైతం మ్యాచ్ చివరి క్షణాల్లో జరిగిన గందరగోళానికి సంబంధించిన ఫుటేజీని పరిశీలించి నష్టం కలిగించిన వారిపై చర్యలు తీసుకునే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది.

బంగ్లా కెప్టెన్‌కు జరిమానా

- మ్యాచ్‌లో గందరగోళంపై ఐసీసీ సీరియస్
- షకీబ్‌తో పాటు నురుల్ మ్యాచ్ ఫీజులో కోత



కొలంబో : నిదహాస్ ట్రోఫీలో భాగంగా శుక్రవారం శ్రీలంకతో జరిగిన టీ20 మ్యాచ్‌లో క్రీడాస్ఫూర్తి మరచి ప్రవర్తించిన బంగ్లాదేశ్ కెప్టెన్ షకీబ్ అల్ హసన్, రిజర్వ్ ప్లేయర్ నురుల్ హసన్‌లపై అంతర్జాతీయ క్రికెట్ నియంత్రణ మండలి (ఐసీసీ) జరిమానా విధించింది. మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధించడమే కాకుండా ఓ డీమెరిట్ పాయింట్ కేటాయించింది. బంగ్లాదేశ్ బ్యాటింగ్ చివరి ఓవర్లో మైదానంలో గందరగోళ పరిస్థితి ఏర్పడిన విషయం తెలిసిందే. రెండు బంతులు భుజం కంటే ఎత్తులో వెళ్లినా అంపైర్లు నోబాల్ ఇవ్వకపోవడంపై బంగ్లా బ్యాట్స్‌మన్ అసహనానికి గురయ్యారు. ముస్తఫిజుర్ రనౌటైన గ్యాప్‌లో గ్రౌండ్‌లోకి వచ్చిన బంగ్లా రిజర్వ్ ప్లేయర్ నురుల్ శ్రీలంక కెప్టెన్ తిసారా పెరిరాతో వాగ్వాదానికి దిగాడు. అంపైర్లు కలగజేసుకుని సర్దిచెప్పేలోపే కెప్టెన్ షకీబ్ బౌండరీ దగ్గరకొచ్చి బయటికి వచ్చేయండి.. అంటూ గట్టిగా కేకలు వేశాడు. ఈ ఘటనను సిరీయస్‌గా పరిగణించిన మ్యాచ్ రిఫరీ క్రిస్ బోర్డ్ ఐసీసీ కోడ్ 2.1.1 ప్రకారం షకీబ్, 2.1.2 కింద నూరుల్ క్రీడాస్ఫూర్తిని దెబ్బతీస్తూ నిబంధనలు అతిక్రమించారని జరిమాన విధించారు. ఈ వివాదంపై రిఫరీ విచారం వ్యక్తం చేశారు. ఉత్కంఠగా సాగుతున్న ఆటలో ఇలాంటి ఉద్వేగాలు సహజమే కానీ ఆటగాళ్లు ఇలా ప్రవర్తించాల్సింది కాదని అభిప్రాయపడ్డారు. ఇక ఫోర్త్ అంపైర్ షకీబ్‌ను ఆపకపోవడం, మైదానంలోని అంపైర్లు నూరుల్, తిసారాల మధ్య గొడవ జరుగుతుండగా కల్పించుకోకపోవడం పరిస్థితి మరింత అధ్వాన్నంగా మార్చాయని చెప్పుకొచ్చారు. ఇక ఈ ఉత్కంఠకర మ్యాచ్‌లో లంకపై బంగ్లాదేశ్ ఓ బంతి మిగిలి ఉండగానే విజయం సాధించిన విషయం తెలిసిందే. ఆదివారం జరిగే ఫైనల్లో భారత్‌తో బంగ్లాదేశ్ తలపడునుంది.

అక్టోబర్‌లో భారత్‌కు విండీస్

ఈడెన్ గార్డెన్స్‌లో ఓ టీ20 మ్యాచ్



కోల్‌కతా : వెస్టిండీస్ జట్టు ఈ ఏడాది అక్టోబరు-నవంబరు నెలల్లో భారత్‌లో పర్యటించనుంది. ఇందులో భాగంగా మూడు టెస్టులు, ఐదు వన్డేలు, ఓ టీ20 మ్యాచ్ ఆడనుంది. ఈ నేపథ్యంలో విండీస్ టీ20 మ్యాచ్‌కు కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ ఆతిథ్యం ఇవ్వనున్నట్లు క్యాబ్ అధ్యక్షుడు సౌరభ్ గంగూలీ వెల్లడించారు. మిగతా వేదికలకు సంబంధించి వివరాలను త్వరలో వెల్లడించనున్నారు. అంతేకాదు ఐపీఎల్ 2018 టోర్నీలోని క్వాలిఫైయర్స్ మ్యాచ్‌లకు కూడా ఈడెన్ గార్డెన్స్ వేదికగా నిలిచే అవకాశముందని సౌరభ్ చెప్పారు. 2014లో విండీస్ భారత్‌లో పర్యటించింది. ఆ సమయంలో వెస్టిండీస్ బోర్డులో చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో అర్ధాంతరంగా పర్యటనను రద్దు చేసుకుని తిరిగి వెళ్లిపోయింది. తర్వాత ఆ జట్టు 2016లో జరిగిన టీ20 ప్రపంచ కప్‌లో పాల్గొనేందుకు మాత్రమే భారత్‌కు వచ్చింది. భారత్ మాత్రం రెండు సార్లు విండీస్‌లో పర్యటించింది. 2016లో టెస్టులతో పాటు 2017లో పరిమిత ఓవర్ల సిరీస్‌లో ఆడింది.



సెమీస్‌లో ఓడిన సింధు

బర్మింగ్‌హామ్: ఆల్ ఇంగ్లాండ్ బ్యాడ్మింటన్ సెమీఫైనల్‌లో భారత క్రీడాకారిణి పీవీ సింధు ఓడిపోయింది. జపాన్ క్రీడాకారిణి యమగుచి 19-21, 21-19, 21-18 తేడాతో సింధుపై విజయం సాధించింది. ఫైనల్‌లో తైవాన్ క్రీడాకారిణి థాయ్‌తో యమగుచి తలపడనుంది. సెమీస్‌లో తొలిగేమ్ సింధు గెలిచినా.. మిగిలి రెండు గేముల్లో యమగుచి స్పష్టమైన ఆధిపత్యం చూపించి గేమ్‌లను కైవసం చేసుకుంది. ఇదిలా ఉంటే... సైనా నెహ్వాల్, కిదాంబి శ్రీకాంత్, హెచ్ఎస్ ప్రణయ్.. ఇప్పటికే ఆల్ ఇంగ్లాండ్ టైటిల్ పోరులో ఇంటిముఖం పట్టారు. 11వసారి బరిలోకి దిగిన 27ఏళ్ల సైనా తొలిరౌండ్‌లోనే ప్రపంచ నెంబర్‌వన్, డిపెండింగ్ ఛాంపియన్ తై జు యింగ్(చైనీస్ తైపీ) ముందు తలవంచాల్సి వచ్చింది. ఇక ఆరో సారైనా అందని ద్రాక్షగా మిగిలిన ఆల్ ఇంగ్లాండ్ టైటిల్ ఒడిసిపట్టుకోవాలని సింధు అడుగులు వేస్తోంది. కానీ, సింధు కలనెరవేరాలంటే సెమీస్‌లో అడ్డంకిగా ఉన్న మూడో సీడ్ యమగూచిని దాటాలి.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2-293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO 22, DOOR NO.8-2- 293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS HYDERABAD-33, TELANGANA. PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2- 293/82/A/22,ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044-